fb/prajasakti, www.prajasakti.com

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 70 | విజయవాడ, సోమవారం 12 మార్చి 2018 | 12+12 పేజీలు వెల : 4.00



అడవి అగ్నిలో 40 మంది విద్యార్థులు

తమిళనాడులో కలకలం

30మందిని కాపాడిన భద్రతా సిబ్బంది

9

మహా రైతు మహోద్యమం



మహారాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అఖిల భారత కిసాన్ సభ (ఏఐకెఎస్) నేతృత్వంలో రైతులు ఐదురోజుల క్రితం చేపట్టిన లాంగ్ మార్చ్ 35 వేల మందితో ఆదివారం ముంబయికి చేరుకుంది. రుణ మాఫీ, విద్యుత్ బిల్లుల రద్దు, స్వామినాథన్ కమిషన్ సిఫారసుల అమలు, ఆదివాసీలకు భూబదలాయింపు చేయాలనే డిమాండ్లతో వీరంతా నేడు మహారాష్ట్ర అసెంబ్లీని ముట్టడించనున్నారు. కొండాకోనలను దాటుతూ, పోలీసుల దిగ్బంధనాలను తొలగించుకుంటూ సాగిన వీరి యాత్ర దేశ రైతాంగ ఉద్యమంలో మహాఘట్టంగా నిలువనుందని కిసాన్ సభ నాయకులు పేర్కొంటున్నారు. పూర్తి కథనం 8లో

ఏపి గ్రే హౌండ్స్‌కు కేంద్రం మొండి చెయ్యి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మావోయిస్టుల దాడులు, తీవ్రవాద చర్యల్ని ఎదుర్కోవడంలో కీలకంగా వ్యవహరించే గ్రేహౌండ్స్, ఆక్టోపస్ దళాల శిక్షణా కేంద్రం ఏర్పాటులో కేంద్ర ప్రభుత్వం మొండి చెయ్యి చూపిస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలోని హైదరాబాద్‌లో ఉన్న గ్రేహౌండ్స్ శిక్షణా కేంద్రం దేశంలోనే తలమానికంగా ఉండేది. వివిధ రాష్ట్రాల నుంచి పోలీస్ అధికారులు శిక్షణ కోసం ఇక్కడికొచ్చే వారు. ఆంధ్రప్రదేశ్ అధికారులు కూడా ఇతర ప్రాంతాలకు వెళ్లి సిబ్బందికి శిక్షణ ఇచ్చే వారు. రాష్ట్ర విభజన అనంతరం ఆ కేంద్రం తెలంగాణాకు ఇచ్చేశారు. విభజన జరిగిన తరువాత మొదటి మూడేళ్లూ రెండు తెలుగు రాష్ట్రాలూ శిక్షణా కేంద్రాన్ని సంయుక్తంగా వినియోగించుకోవాలని, అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో గ్రేహౌండ్స్ శిక్షణా కేంద్రం ఏర్పాటుకు పూర్తి స్థాయిలో సహకరిస్తామని కేంద్రం అప్పట్లో హామీ ఇచ్చింది. కేంద్రం ఇచ్చిన హామీతో మిగతా 9లో

రమేష్, రవీంద్ర


టిడిపి రాజ్యసభ అభ్యర్థులు ఖరారు

చంద్రబాబు తీరుపై బిసి, ఎస్సీల ఆగ్రహం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



రమేష్



రవీంద్ర

రాజ్యసభ అభ్యర్థులుగా సిఎం రమేష్, కనక మేడల రవీంద్ర కుమార్‌ను తెలుగు దేశం పార్టీ ఎంపిక చేసింది. ఆదివారం అధికారికంగా ప్రకటన విడుదల చేసింది. ఇప్పటికే రాజ్యసభ సభ్యుడిగా ఉన్న రమేష్‌ను చంద్రబాబు స్వయంగా ఎంపిక చేశారు. అయితే రెండో అభ్యర్థిగా వర్ల రామయ్య, బీదా మస్తానరావు పేర్లు వినిపించాయి. చివరికి టిడిపి లీగల్ సెల్ అధ్యక్షుడు కనకమేడల మిగతా 9లో

టిఆర్ఎస్ అభ్యర్థులు వీరే

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజ్యసభ అభ్యర్థులుగా జోగినపల్లి సంతోష్ కుమార్, బండా ప్రకాశ్ ముదిరాజ్, బడుగుల లింగయ్య యాదవ్‌ను ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదివారం ఖరారు చేశారు. వీరు సోమవారం ఉదయం 10.30 గంటలకు నామినేషన్లు దాఖలు చేయనున్నారు. కాంగ్రెస్ ప్రకటించినట్టుగా ఆ పార్టీ మిగతా 9లో



లింగయ్య సంతోష్ ప్రకాశ్



ఓటరు గుర్తింపునకు ఆధార్ తప్పనిసరి

సుప్రీం కోర్టుకు ఎన్నికల కమిషన్ స్పష్టీకరణ

న్యూఢిల్లీ : ఆధార్ నంబరును ఓటరు గుర్తింపు కార్డుకు అనుసంధానించడంలో ఎన్నికల కమిషన్ (ఇసి) తన వైఖరిని మార్చుకుంది. ఓటరు గుర్తింపు కార్డుతో ఆధార్ నంబరును అనుసంధానం చేయడాన్ని తప్పనిసరి చేయాలని కోరుతూ ఆదివారం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఆధార్ నంబరును ఓటరు కార్డుకు అనుసంధానం చేయడం కేవలం స్వచ్ఛందమేనని, తప్పనిసరి కాదని ఇసి అంతకుముందు పేర్కొంది. ప్రభుత్వం ఆధార్ చట్టాన్ని ఆమోదించిన కారణంగా ఓటరు కార్డుకు అధార్ నంబరును అనుసంధానించడాన్ని తప్పనిసరి చేస్తున్నట్లు తెలిపింది. అంతేకాకుండా ఆధార్ నంబరును అనుసంధానించడం వల్ల ఓటింగ్ సమయంలో మోసం జరిగే అవకాశముండదని పేర్కొంది. ఆధార్ చట్టం మార్చి 2017లో ఆమోదం పొందింది. దాదాపు అన్ని అత్యవసర సేవలకు ఆధార్ నంబరును అనుసంధానించడాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేసింది. అయితే ఆధార్ రాజ్యాంగ చెల్లుబాటుపై సుప్రీంకోర్టులో ఇప్పటికే పెద్ద సంఖ్యలో పిటిషన్లు దాఖలై ఉన్నాయి. వీటన్నిటిపై సుప్రీం విచారణ చేపట్టింది.

పదికి సిద్ధం

15 నుంచి పరీక్షలు

ఆరు లక్షలకు పైగా విద్యార్థులు

తొలిసారి ఇన్విజిలేటర్లకు జంబ్లింగ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పదో తరగతి వార్షిక పరీక్షలకు అంతా సిద్ధమయ్యింది. ఈ నెల 15 నుంచి 29 వరకు జరుగనున్న పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 6,16,946 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వీరిలో 3,08,834 మంది బాలురు, 3,27,997 మంది బాలికలు ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2,805 పరీక్షా కేంద్రాల్ని పాఠశాల విద్యాశాఖ ఏర్పాటు చేసింది. ఉదయం 9:30గంటల నుంచి మధ్యాహ్నం 12:15 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. విద్యార్థులు అరగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుంది. కాంపోజిట్ కోర్సులకు మరో అరగంట అదనంగా పరీక్ష ఉంటుంది. 80 మార్కులకే ఈ పరీక్షలు జరుగనున్నాయి. ఫార్మెటీవ్, సమ్మెటీవ్ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా 20 ఇంటర్నల్ మార్కులుంటాయి. పరీక్షా కేంద్రాలకు ఇన్విజిలేటర్లను జంబ్లింగ్ విధానంలో పాఠశాల విద్యాశాఖ కేటాయించనుంది. పరీక్షకు ముందు ఇన్విజిలేటర్లను లాటరీ ద్వారా నియమిస్తారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్ టిక్కెట్‌ను చూపించి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని పొందవచ్చు. హాల్ టికెట్లను మిగతా 9లో



సౌర విద్యుత్‌దే భవిత

2030 నాటికి ఒక టెరావాట్ సౌరశక్తి సామర్థ్యం

లక్ష్య సాధనకు రూ.65 లక్షల కోట్లు అవసరం

అంతర్జాతీయ సౌర కూటమి సదస్సులో ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్

న్యూఢిల్లీ : ప్రపంచ వ్యాప్తంగా 2030 నాటికి ఒక టెరావాట్ (టిడబ్ల్యు) సౌర శక్తి సామర్థ్యాన్ని సాధించేందుకు 65 లక్షల కోట్ల రూపాయలు అవసరమవుతాయని ఫ్రాన్సు అధ్యక్షుడు ఎమ్మాన్యుల్ మాక్రాన్ ఆదివారం తెలిపారు. న్యూఢిల్లీలో ఆదివారం జరిగిన ఇంటర్నేషనల్ సోలార్ అలియన్స్ (ఐఎస్ఎ (అంతర్జాతీయ సౌర కూటమి) వ్యవస్థాపక సదస్సులో ప్రధాని నరేంద్ర మోడీతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ లక్ష్యాన్ని మిగతా 9లో

కాలుష్య పరిశ్రమలపై చర్యలేవీ ?

నోటీసులకే పిసిబి పరిమితం

విశాఖ, చిత్తూరు, ప్రకాశం జిల్లాల్లోనే అధికం

విస్తరిస్తున్న వాయు, నీటి కాలుష్యం

తనిఖీలూ నామమాత్రమే



విశాఖలో యద్దేచ్ఛగా విష వాయువులు గాలిలోకి వదులుతున్న పరిశ్రమలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో దేశంలోనే ప్రథమ స్థానంలో ఉన్నామని, సులభంగా 21 రోజుల్లోనే పరిశ్రమలకు అన్ని రకాల అనుమతులు అందజేస్తామని ప్రభుత్వం చెబుతోంది. కానీ, ఆ పరిశ్రమల వల్ల కలిగే కాలుష్యానికి మాత్రం కళ్లెం వేయలేకపోతోంది. రాష్ట్రంలో కాలుష్య కారక పరిశ్రమలపై ప్రభుత్వం చర్యలు తీసుకున్న దాఖలాలు ఎక్కడా కనిపించడంలేదు. నిబంధనలు పాటించకపోయినా, సరైన ప్రమాణాలు అమలు చేయకపోయినా కాలుష్య నియంత్రణ మండలి (పిసిబి) నోటీసులు పంపడం వరకే పరిమితమవుతోంది. వాయు, నీటి కాలుష్యానికి కారకాలుగా ఉన్న పరిశ్రమలకు ఇటీవల పిసిబి నోటీసులు అందజేసింది. ప్రధానంగా వ్యర్థ జలాలను శుద్ధి చేసి విడుదల చేసే 'ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్' (ఇటిపి), వాయు కాలుష్య నియంత్రణ లేకపోవడంతో 45 పరిశ్రమలను మూసివేయాలనీ, మరో 25 పరిశ్రమలలో ఉత్పత్తి ఆపేయాలనీ నోటీసులు జారీ చేసింది. ఆన్‌లైన్ పర్యవేక్షణా విధానం, కాలుష్య కారకాల నిర్వహణ సరిగా లేదంటూ నిబంధనలు పాటించని 452 పరిశ్రమల్ని పిసిబి హెచ్చరించింది.

రాష్ట్రవ్యాప్తంగా అత్యంత కాలుష్య కారకాల్ని విడుదల చేసే కేటగిరీ నుంచి తక్కువ మోతాదులో కాలుష్యాన్ని కలిగించే కేటగిరీ కలిపి మొత్తం 6,174 పరిశ్రమలున్నాయి. వాటిలో అత్యంత ప్రమాదకర రసాయనాలు, కాలుష్యానికి కారణమయ్యే ఫార్మా, సిమెంట్, థర్మల్ పవర్ (రెడ్ కేటగిరీ) పరిశ్రమలు 2238 ఉన్నాయి. ఇక రెడ్ కేటగిరీ కంటే తక్కువ కాలుష్యాన్ని కలిగించే కాటన్ స్పిన్నింగ్ (ఆరెంజ్ కేటగిరీ) వంటి పరిశ్రమలు 3219, తక్కువ కాలుష్యాన్ని కలిగించే రెడీ మిక్స్, రబ్బరు వస్తువుల తయారీ (గ్రీన్ కేటగిరీ) 658 పరిశ్రమలు, అతి తక్కువ మిగతా 9లో



ఓటేసిన అనంతరం విజయ సంకేతం చూపిస్తున్న యోగి ఆదిత్యనాథ్

ఉత్తరప్రదేశ్‌లో కీలక ఉప సమరం

- 43 శాతం దాటని పోలింగ్
- ఈనెల 14న ఫలితాలు

లక్నో : ఉత్తర ప్రదేశ్‌లో ఆదివారం రెండు లోక్‌సభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికలు యోగీ పాలనకు పెద్ద పరీక్షగా నిలవనున్నాయి. సిఎం యోగీ రాజీనామాతో గోరఖ్‌పూర్‌లోనూ, ఉప ముఖ్యమంత్రి మౌర్య రాజీనామాతో ఫూల్‌పూర్‌లోనూ ఉప ఎన్నికలు జరిగాయి. గోరఖ్‌పూర్‌లో 43 శాతం పోలింగ్ అవ్వగా ఫూల్‌పూర్ లో 40 శాతం మాత్రమే ఓటింగ్ జరిగింది. ఈ ఉప ఎన్నికల్లో చాలా ఏళ్ల తర్వాత బిఎస్‌పి అధినేత మాయావతి సమాజ్‌వాది పార్టీకి మద్దతు తెలపడంతో ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారాయి. గోరక్‌పూర్‌లో బిజెపి తన అభ్యర్థిగా బ్రహ్మణ కులానికి చెందిన స్థానిక నేత ఉపేంద్ర శుక్లాను రంగంలోకి దింపింది. సమాజ్‌వాది పార్టీ ఓబిసి కులమైన నిషాద్‌కు చెందిన ప్రవీణ్ నిషాద్‌ను నిలబెట్టింది. గోరఖ్‌పూర్‌లోని గ్రామీణ ప్రాంతాల్లో నిషాద్ కులానికి మంచి ప్రాతినిధ్యమే ఉంది. యాదవ్‌లకు కాకుండా నిషాద్ కులానికి సీటు ఇవ్వడంతో అఖిలేష్ తమ పార్టీపై ఇతర ఓబిసి కులాలకు ఉన్న వ్యతిరేకతను తగ్గించుకునే ప్రయత్నం చేశారు. అయితే ఇక్కడ జాతవ్ దళితులు, ముస్లీమ్‌లు కూడా అధికంగా ఉన్నారు. బిఎస్‌పి మద్దతుదారులైన వీరు ఎప్పటి నుండో మిగతా 9లో

ఆదరణకు ఆంక్షలు

శిక్షణ తీసుకున్న వారికే రుణం

50 ఏళ్లు దాటితే లేనట్టే

సాధికార సర్వేలో నమోదు కాకపోయినా అంతే

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రానున్న ఎన్నికల్లో బిసి ఓటర్లను ఆకర్షించడానికి ప్రధాన అస్త్రంగా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆదరణ పథకంలో అనేక మతలబులున్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పథకం ద్వారా రుణాలందించే అంశంపై ప్రభుత్వం రూపొందించిన నిబంధనల పట్ల బిసి వర్గాల్లో అప్పుడే అసంతృప్తి వెల్లువెత్తుతోంది. కుల వృత్తులపై ఆధార పడి జీవించే వారికి



వయసుతో లింక్ పెట్టడమేంటని ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర జనాభాలో సగ భాగం బిసిలు ఉంటే కేవలం రెండు లక్షల మందికే రుణాలివ్వడానికి ప్రణాళికలు సిద్ధం చేయడంపై బిసి సంఘాల నేతలు ఆక్షేపిస్తున్నారు. ఆదరణ పథకానికి సంబంధించిన మార్గదర్శకాల్ని ప్రభుత్వం శనివారం విడుదల చేసిన విషయం తెలిసిందే. వయసు 18 నుంచి మిగతా 9లో

అఖిలపక్షంతో కేంద్రంపై ఒత్తిడి

ముఖ్యమంత్రికి సిపిఐ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి కేంద్రంపై ఒత్తిడి పెంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆదివారం లేఖ రాశారు. బిజెపి నాయకులు పదే పదే ఏపీకి ఎక్కువ ఇస్తున్నామని చెబుతున్నారని, ప్రధాని మోడీ కూడా ఏమాత్రం పట్టించుకోవడం లేదని వివరించారు. పార్లమెంటు సమావేశాలు ముగిసేలోగా ఏపీకి చెందాల్సినవి సాధించుకోవలసిన అవసరముందని, ఇది చాలా కీలకమైన సమయమని సూచించారు. రాష్ట్రాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని తక్షణమే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అవసరమైతే ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లి మోడీపై ఒత్తిడి పెంచాలని కోరారు.

వినతులు

ప్రకాశం జిల్లాలో చివరిరోజు పాదయాత్రలో సందర్భంగా జగన్‌ను కలిసి తమ సమస్యలు వివరిస్తున్న న్యాయవాదులు



జగన్‌కు వినతుల వెల్లువ

ప్రకాశంలో ముగిసిన పాదయాత్ర

ప్రజాశక్తి-చీరాల (ప్రకాశం)

ప్రకాశం జిల్లాలో చివరిరోజు పాదయాత్రలో వైసిపి అధినేత జగన్‌కు వినతులు వెల్లువలా వచ్చాయి. చీరాలలో 109వ రోజు ప్రజాసంకల్పయాత్ర ఆదివారం ఉదయం చర్చి కాంపౌండ్ నుండి ప్రారంభమైంది. యాత్ర ప్రారంభం నుండి జనం జగన్ వెంట అడుగులు కలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణాపురంకు చెందిన ఆరేళ్ల చిన్నారి గుంటుపల్లి నాగశ్రీలత అనే బాలిక తన కిడ్డీ బ్యాంకులో రెండేళ్లుగా దాచుకున్న నగదును జగన్‌కు అంజేసి అభిమానాన్ని చాటుకున్నారు. ఓరుగంటి రెడ్డి రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో సమస్యలపై జగన్‌కు వినతిపత్రం అందజేశారు. తోటవారిపాలెం ఎత్తిపోతల పథకం పరిధిలోని రైతులు కొత్తపేటలో వినతి పత్రం అందజేశారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు సమీపంలో న్యాయవాదులు జగన్‌ను కలిసి సమస్యలు వివరించారు. పూలతో స్వాగతం పలికారు. కొత్తపేట, విఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాల, కోర్టు, బాలాజీ థియేటర్, పేరాల చిన్నరథం సెంటర్, కారంచేడు గేటు సెంటర్, మసీదు సెంటర్‌గా మీదుగా ఐఎల్‌టిడి కంపెనీ వరకు చేరుకున్నారు. మధ్యాహ్నం విరామం అనంతరం ఆదినారాయణపురం మీదుగా ఈపురుపాలెం చేరుకున్నారు. నేడు గుంటూరు జిల్లాలో ప్రజాసంకల్ప యాత్ర ప్రవేశించనుంది. ఈపురుపాలెంలో బిసిల సదస్సు నిర్వహించారు. యాత్రలో వైసిపి జిల్లా అధ్యక్షులు బాలినేని శ్రీనివాసరెడ్డి, బాపట్ల పార్లమెంటు ఇన్‌ఛార్జీ మోపిదేవి వెంకటరమణ, సజ్జల రామకృష్ణారెడ్డి, నందిగం సురేష్‌బాబు, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ యడం బాలాజీ, డాక్టర్ వరికూటి అమృతపాణి పాల్గొన్నారు.



72 గంటల్లో వాయుగుండం

ఆగ్నేయ అరేబియాలోకి వెళ్లే అవకాశం

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

నైరుతి బంగాళాఖాతంలో శనివారం ఏర్పడిన అల్పపీడనం ఆదివారం నాటికి దక్షిణ శ్రీలంక తీరానికి చేరుకుందని భారత వాతావరణ శాఖ ప్రకటించింది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని తెలిపింది. ఇది మరింత బలపడి పశ్చిమ-వాయువ్య దిశగా ముందుకు కదులుతూ 48 గంటల్లో తీవ్ర అల్పపీడనంగా మారుతుందని, తర్వాత మరో 24 గంటల్లో ఆగ్నేయ అరేబియాలోకి చేరుకున్నాక వాయుగుండంగా మార్పు చెందుతుందని వివరించింది. దీని ప్రభావంతో శ్రీలంక, కేరళ తీరాల్లో వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. రాష్ట్రంపై అల్పపీడనం ప్రభావం చూపించే అవకాశాల్లేవని, నాలుగు రోజుల పాటు కోస్తా, రాయలసీమలో వేడి వాతావరణమే కొనసాగుతుందని పేర్కొంది.

700 ఎకరాలకు ఎసరు

- విశాఖలో ప్రభుత్వ 'శాటిలైట్ టౌన్‌షిప్'కు యత్నాలు
- త్వరలో రైతులతో ఉన్నత స్థాయి సమావేశం



'శాటిలైట్ టౌన్‌షిప్' నిర్మించే ప్రాంతం ఇదే..

ప్రజాశక్తి - విశాఖపట్నం ప్రతినిధి

గతంలో తమకు ప్రభుత్వం నుంచి దఖలు పడిన అసైన్‌మెంట్ భూములను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని చూస్తే పరిహారమివ్వాల్సిందేనని రైతులు, పేద, బలహీన తరగతుల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. బలవంతపు భూసేకరణ చేపడితే ఊరుకునేది లేదని, అభివృద్ధిలో భూములిచ్చేవారిని భాగస్వాములను చేస్తామనే ప్రభుత్వ పెద్దల మాటలను ఆచరణలో పెట్టాలని రైతులు కోరుతున్నారు. తాజాగా విశాఖ జిల్లా లంకెలపాలెం సమీపంలో ఐదు గ్రామాల మధ్య సుమారు 900 ఎకరాల్లో 'శాటిలైట్ టౌన్‌షిప్' నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం పావులు కదుపుతుండ గా, ఆదిలోనే దీనికి హంసపాదయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. అయితే, కేంద్ర బృందం కూడా ఇటీవల ఈ ప్రాంతాన్ని సందర్శించి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే ఇక్కడ ప్రభుత్వ భూములున్నవి కేవలం 200 ఎకరాలు మాత్రమే. మిగతా 700 ఎకరాలు 30ఏళ్ల కిందట సాగుకోసం జారీచేసిన అసైన్‌మెంట్ భూములు. తాజా శాటిలైట్ ప్రతిపాదనతో రైతులు తమ భూములను వదులుకోబోమని ప్రభుత్వానికి సంకేతాలు పంపుతున్నట్లు సమా చారం. ఒక వేళ గనక తీసుకోవాల్సి వస్తే తగిన నష్టపరిహారం చెల్లిం చాలని డిమాండ్ చేస్తున్నారు. ఎకరాకు రూ.6లక్షలు చెల్లించా లనే ప్రతిపాదన తో ప్రభుత్వం ఇప్పటికే ఉన్నట్లు తెలుస్తోంది. అయితే వాస్తవ మార్కెట్ ధర ఎకరా రూ.కోటి పైగానే పలుకుతోంది.. జాతీయ రహదారికి దగ్గర్లో ఈ 700 ఎకరాలుండడంతో ప్రభుత్వ వైఖరి ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి భూములను వదులుకుంటే తిరిగి జీవితంలో దక్కవన్నది రైతులంతా ఒక్కటై ఈ విషయంలో ప్రభుత్వంతో పోరాడేందుకు సిద్ధమవుతున్నారు.

అసైనీలతో చర్చలకు త్వరలో సమావేశం


అసైనీలైన రైతులతో చర్చించేందుకు ప్రభుత్వ హై లెవెల్ కమిటీ ఒకటి త్వరలో ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఈ ప్రాంతంలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కరికల్‌వళెవన్ కూడా పర్యటించారు. భూములు రైతుల నుంచి సేకరించేందుకు, నష్టపరిహారం, ప్రాజెక్టు అంచనాల కోసం ఈ కమిటీ చర్చించనుంది. ప్రభుత్వం ఇప్పటికే తయారు చేసిన ప్రాజెక్టు నివేదిక ప్రకారం 150 ఎకరాల్లో స్పోర్ట్స్ కాంప్లెక్స్, మరో 400 ఎకరాల్లో 25వేల గృహాలను నిర్మించేందుకు సన్నాహా లు చేస్తోంది. దశల వారీగా వీటిని నిర్మాణం చేసేందుకు ఒక కన్స ల్టెన్సీతో సంప్రదింపు లను చేపట్టింది. ప్రస్తుతం ఈ ల్యాండ్ అంతా రెవెన్యూ పరిధిలో ఉంది. త్వరలో వుడాకి బదలాయించే ందుకు ప్రభుత్వం సన్నాహాలు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ 900 ఎకరాలూ 3 మండలాలు 5 గ్రామాల పరిధిలో ఉంది. గాజువాకలోని ఆగనంపూడి, నంగినారపాడు, గంగవరం, సబ్బవరంలోని పెదముషిడివాడ, పరవాడ మండలం ఇ-మర్రిపాలెంల్లో ఈ భూమంతా ఉన్నట్లు సమాచారం. విశాఖ నగరంలో ఎప్పటినుంచో పేద, మధ్యతరగతి ప్రజలకు ఇళ్ల సమస్య ఉండడం, 2019 ఎన్నికలు దగ్గర పడడంతో భారీ స్థాయిలో శంకుస్థాపన చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టుకు అంచనా వ్యయం కూడా రూ.వందల కోట్లలోనే అవసరం కావడంతో పిపిపి పద్ధతిలో వెళ్లే ఆలోచనలను ప్రభుత్వం చేస్తోంది.

14న కాజలో జనసేన బహిరంగ సభ

ముఖ్య నేతలతో పవన్ కళ్యాణ్ చర్చలు

నేడు పార్టీ కార్యాలయానికి భూమి పూజ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



జనసేన పార్టీ ఆవిర్భావం సందర్భంగా ఈ నెల 14న గుంటూరు జిల్లా కాజలో బహిరంగ సభను నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ విజయవాడలోని ఒక ప్రైవేటు హోటల్‌లో ఆదివారం పార్టీ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. సభ ఏర్పాట్లతో పాటు ఎంతమంది కార్యకర్తల్ని, అభిమానుల్ని సమీకించాలనే అంశాలపై నేతలతో చర్చించినట్టు తెలిసింది. జనసేన ఆవిర్భావం సందర్భంగా సభను భారీ ఎత్తున నిర్వహించాలని పవన్ భావిస్తున్నట్టు సమాచారం. ఇప్పటికే సభకు సంబంధించిన ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నట్టు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. అలాగే స్వంత గృహంతో పాటు పార్టీ కార్యాలయాన్ని కూడా నిర్మించే ఆలోచనలో పవన్ ఉన్నట్టు తెలిసింది. సోమవారం పార్టీ కార్యాలయానికి భూమి పూజ నిర్వహించనున్నారు. ఎన్నికలు సమీస్తున్న నేపథ్యంలో కాజ నుంచే పార్టీ కలాపాల్ని నిర్వహించనున్నట్టు నేతలు చెబుతున్నారు.

టిడిపికి నష్టమేమీ లేదు

బిజెపితో పొత్తును జగన్ బహిర్గతం చేయాలి

మంత్రి నక్కా ఆనంద్ బాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బిజెపితో విడిపోవడం వల్ల టిడిపికి వచ్చిన నష్టమేమీ లేదని సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనంద్ బాబు అన్నారు. బిజెపి ఓట్లతో టిడిపి గెలవలేదని, సొంత బలంతోనే అధికారంలోకొచ్చామని, కేవలం కేంద్రం నుంచి సహాయం కోసమే ఆ పార్టీతో పొత్తు పెట్టుకున్నామని ఆయన పేర్కొన్నారు. ఆదివారం విజయవాడ స్టేట్ గెస్ట్‌హౌస్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. సొంత రాజకీయ అవసరాల కోసమే బిజెపితో జగన్ కుమ్మక్కయ్యారన్నారు. మూడున్నరేళ్లు బిజెపితో కలిసి పనిచేసిన తాము ఆ పార్టీపై నమ్మకం లేకే బయటకొచ్చామన్నారు. పార్లమెంట్‌లో అవిశ్వాసం పెట్టినా అది వీగిపోయే అవకాశముందని, అలాంటప్పుడు ప్రయోజనమేముందో జగన్ చెప్పాలన్నారు. ఎంపీలను రాజీనామా చేయాలంటూ కొత్త నాటకానికి జగన్ తెరలేపుతున్నారని విమర్శించారు. ప్రధాని మోడీని చూస్తే జగన్‌కు భయం పట్టుకుందన్నారు. బిజెపితో పొత్తు విషయాన్ని జగన్ బహిర్గతం చేయాలన్నారు. ఇప్పటి వరకు అంతర్గతంగా కేంద్రంతో పోరాటం చేశామని, ఇక నుంచి బహిర్గతంగా పోరాటం చేస్తామన్నారు. రాజ్యసభ ఎంపీల ఎంపికలో టిడిపి సామాజిక న్యాయాన్ని పాటించిందా? అన్న ప్రశ్నకు మంత్రి సమాధానం దాటవేశారు.

దళిత భూములు లాక్కుంటే పోరాటాలతో అడ్డుకుంటాం : సిపిఎం

ప్రజాశక్తి - గన్నవరం (విజయవాడ)

దళిత భూములను బలవంతంగా ప్రభుత్వం లాక్కుంటే పోరాటాలతో అడ్డుకుంటామని సిపిఎం జిల్లా (తూర్పు కృష్ణా) కార్యదర్శి ఆర్.రఘు అన్నారు. కృష్ణా జిల్లా చనుపల్లివారిగూడెంలో ఆర్ఎస్ నెంబర్ 788/2లో దళితుల భూములు తీసుకోవద్దని డిమాండ్ చేస్తూ భూపరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సిపిఎం నాయకులు మామిడి తోటలను పరిశీలించారు. అనంతరం తోటలో జరిగిన సాగుదార్ల సమావేశంలో రఘు మాట్లాడుతూ మూడు తరాల నుంచి దళితులు సాగు చేసుకుంటున్న భూములను లాక్కునేందుకు ప్రయత్నించడం దారుణమన్నారు. ఆ భూముల్లో కంపెనీలు పెట్టడం వల్ల సాగుదార్లకు చేకూరే లాభం ఏమీ ఉండదన్నారు. పరిశ్రమల పేరుతో ఎన్ని గ్రామాల్లో పేదల భూములు తీసుకుంటారని ప్రశ్నించారు. అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, అభివృద్ధి పేరుతో సాగుతున్న భూ దోపిడీకి వ్యతిరేకమని స్పష్టం చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.నరసింహారావు మాట్లాడుతూ దళితుల సంఘటిత సత్తా ఏంటో ప్రభుత్వానికి, రెవెన్యూ అధికారులకు చూపించాలన్నారు. సాగుదార్ల పోరాటానికి తాము నిలబడతామని హామీ ఇచ్చారు. పేదలకోసం అవసరమైతే జైలుకైనా వెళ్తామన్నారు. భూములు పరిరక్షించుకునేందుకు అందరూ ఐక్యతగా ముందుకు సాగాలన్నారు. సిపిఎం గన్నవరం మండల కార్యదర్శి కళ్లం వెంకటేశ్వం రావు, భూ పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు గజగంటి బా బూరావు, పులపాక వరాలు, వి పుష్పనాథం, వీరబాబు, సుజానమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజ్ఞ

1. స్ట్రాండ్‌జా అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నీలో స్వర్ణ పతకం సాధించిన తొలి భారతీయుడు?
2. దక్షిణాఫ్రికా నూతన అధ్యక్షులుగా ఇటీవల ఎవరు ఎన్నికయ్యారు?
3. యూనిసెఫ్ ప్రకారం శిశుమరణాల రేటులో భారత్ స్థానం ఎంత?
4. హెచ్‌ఎస్‌బిసి ఎక్స్‌పాట్ ఎక్స్‌ప్లోరల్ సర్వే ప్రకారం ప్రపంచంలో వలసదారులకు అత్యధిక జీతాలు ఇచ్చే నగరంగా మొదటి స్థానం దక్కించుకున్న నగరం ఏది?
5. చంద్రుడిపై ఇస్రో నిర్మించ తలపెట్టిన ఆవాసాల పేరు ఏమిటి?

సమాధానాలు 7లో

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగ పడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.



బిజెపి.కోర్‌కమిటీ-సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షులు హరిబాబు

మూడే పెండింగ్

- టిడిపి దుష్ప్రచారం చేస్తోంది
- హోదాకు తగ్గట్టుగా ప్యాకేజీ
- బిజెపి అధ్యక్షులు హరిబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విభజన చట్టంలో మూడు అంశాలే పెండింగ్‌లో ఉన్నాయని బిజెపి అధ్యక్షులు హరిబాబు తెలిపారు. బిజెపి రాష్ట్ర కోర్ కమిటీ సమావేశం ఆదివారం విజయవాడలో జరిగింది. సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు ఏమీ చేయ లేదని టిడిపి దుష్ప్రచారం చేస్తోందన్నారు. తాజా రాజకీయ పరిస్థితులపై సమావేశంలో చర్చించామన్నారు. కేంద్రం చేయాల్సిందంతా చేస్తోందని, పెండింగ్ హామీలను త్వర లోనే నెరవేరుస్తామన్నారు. బిజెపి మోసం చేసిందని విమర్శి ంచడం దారుణమన్నారు. విభజనకు ముందు కూడా 13 జిల్లాల్లో ఒక్క జాతీయ సంస్థ కూడా లేదని, మూడేళ్లలో తొమ్మిది సంస్థల్ని ఏర్పాటు చేశామన్నారు. ఇతర రాష్ట్రాలతో చర్చించాక విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ వస్తుందన్నారు. కడపలో స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు ప్రక్రియ వేగవంతమైంద న్నారు. బిజెపి వల్లే రాష్ట్రం అభివృద్ధి చెందిందన్నారు. హోదాకు తగ్గట్టు ప్యాకేజీ ద్వారా రాష్ట్రానికి నిధులివ్వడానికి కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. బిజెపిపై ఇష్టంతోనే సినీ నటి కవిత కూడా జాయిన్ అయ్యారన్నారు.

వాడీవేడిగా...

'రాష్ట్ర అభివృద్ధి-బిజెపి సంకల్పం' పేరిట నిర్వహించిన కోర్ కమిటీ సమావేశం వాడీవేడిగా జరిగింది. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు, తెలుగుదేశం వ్యవహార శైలిపై మెజార్టీ సభ్యులు తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. శాసనసభా పక్షనేత విష్ణుకుమార్‌రాజుతో పాటు సోము వీర్రాజులు టిడిపి నేతల తీరుపైనా, ముఖ్యం గా సిఎం చంద్రబాబు వ్యాఖ్యలపైనా తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ విషయాన్ని బిజెపి హైక మాండ్ దృష్టికి తీసుకెళ్లాలని పట్టుబట్టినట్లు తెలుస్తోంది. నాలుగేళ్ల కలిసుండి, కేంద్రం ఇచ్చిన వేల కోట్లు నిధులు తీసుకుని ఇప్పుడు హోదా పేరుతో కొత్త నాటకం ఆడుతు న్నారని కోర్ కమిటీలోని సీనియర్ సభ్యులు అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు సమాచారం. ప్రస్తుత తరుణంలో ఢిల్లీ పెద్దల నుంచి స్పష్టమైన ఆదేశాలందే వరకూ వేచి చూసే ధోరణి అవలంబించాలని నిర్ణయించు కున్నారు. ఏదేమైనా టిడిపి విషయంలో ఇకపై మరింత దూకుడుగా వ్యవహరించాలని కోర్ కమిటీలో అభిప్రాయప డినట్లు సమాచారం. సమా వేశంలో కావూరి సాంబశివరావు, పురంధేశ్వరి, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, మాణిక్యా లరావు, ఆకుల సత్యనారా యణ, ఎమ్మెల్సీలు మాధవ్, సత్యనారాయణరాజు, సీనియర్ నేత కన్నా లక్ష్మీనారాయణ తో పాటు పలువురు పాల్గొన్నారు.



చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం మాధవనగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన వాహనం

రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి

ఐదుగురికి తీవ్రగాయాలు

మృతులంతా కేరళవాసులే..


ప్రజాశక్తి-బంగారుపాళ్యం (చిత్తూరు)

రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన చెన్నయ్- బెంగళూరు నాలుగో నెంబర్ జాతీయ రహదారి మాధవనగర్ వద్ద ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు చోటు చేసుకుంది. డిఎస్‌పి చౌడేశ్వరి కథనం మేరకు.. కేరళ రాష్ట్రం కాసర్ జిల్లా నంగేరి తాలుకా కుంబ్లే గ్రామానికి చెందిన తొమ్మిది మంది యాత్రికులు శనివారం మధ్యాహ్నం తిరుమలకు శ్రీవారి దర్శనార్థం మిని ట్రావెల్స్‌లో బయల్దేరారు. ఆదివారం ఉదయం మండలంలోని మాధవనగర్ వద్ద ఎస్ఆర్ఎస్ ప్రయివేటు ట్రావెల్స్ (పివై.01ఆర్‌హెచ్1825) బస్సు ముందు వెళ్తున్న వాహనాన్ని అధిగమించబోయి చిత్తూరు వైపు వస్తున్న మిని వ్యాను(కెఎల్.14 కె7468)ను ఢీకొంది. ఈ ప్రమాదంలో గిరిజ(47), మంజప్పగట్టే(55), సదాశివగట్టే(50) శ్రీకర్‌గట్టే(75)లు అక్కడికక్కడే మృతి చెందారు. నాగవేణి, హరిష్, లక్ష్మీ, రాజగట్టే, డ్రైవర్ ఉమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీన్ని గమనించిన స్థానికులు క్షతగాత్రులను బంగారుపాళం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమచికిత్స అందించి, అనంతరం మెరుగైన చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని సిఐ మధుసూదన్‌రావు., ఎస్ఐ నెట్టికంఠయ్య పరిశీలించారు. మృతదేహాలకు బంగారుపాళ్యం ప్రభుత్వాసుపత్రిలో పంచనామా నిర్వహించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

స్వర్ణోత్సవ పిలుపు

ప్రజారోగ్య రక్షణకు బలమైన ఉద్యమం

- ఎఫ్ఎంఆర్ఎఐ జాతీయ అధ్యక్షులు ఆర్ విశ్వనాథన్ పిలుపు
- ఘనంగా ముగిసిన స్వర్ణోత్సవ వేడుకలు



కర్నూలులో ఎపిఎంఎస్ఆర్‌యు స్వర్ణోత్సవ సభలో మాట్లాడుతున్న ఎఫ్ఎంఆర్ఎఐ జాతీయ అధ్యక్షులు ఆర్ విశ్వనాథన్

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

పాలకులు ప్రజారోగ్యాన్ని కార్పొరేట్ శక్తులకు వదిలేశారని, దీంతో ఫార్మా రంగంలో కార్మిక హక్కులు నిర్వీర్యమవుతున్నాయని ప్రజారోగ్యాన్ని పరిరక్షించుకోవడంతో పాటు కార్మిక హక్కులను కాపాడుకునేందుకు మెడికల్ రెప్రజెంటేటివ్‌లు బలమైన ఉద్యమాలను నిర్మించాలని ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ అండ్ సేల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎంఆర్ఎఐ) అధ్యక్షులు ఆర్.విశ్వనాథన్ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రెప్రజెంటే టేవ్ యూనియన్(ఎపిఎంఎస్ఆర్‌యు) స్వర్ణోత్సవాలు కర్నూలు నగరంలో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన ఎపిఎంఎస్ఆర్‌యు రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశంలో విశ్వనాథన్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ బహుళ జాతి కంపెనీలకు అనుకూలంగా వ్యవహరి స్తోందన్నారు. మెడికల్ రెప్రజెంటేటివ్‌లు కార్మిక హక్కులను కాపాడుకునేందుకు ఇతర అన్ని కార్మిక సంఘాలతో కలిసి పోరాటాలను నిర్మించాలని అప్పుడే ఉద్యమ ఉధృతి పాలకులకు బోధపడుతుందన్నారు. ఈ సందర్భంగా ఎపిఎంఎస్ఆర్‌యు రాష్ట్ర నాయకులు టి .కామేశ్వరరావు మాట్లాడారు. ఫార్మా రంగం లో బహుళ జాతి కంపెనీల దోపిడీని అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. లాభాల కోసం బహుళజాతి కంపెనీలు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నా కేంద్ర ప్రభుత్వం ఏ మాత్రం చర్యలు తీసుకోకపోగా ఇందుకు వ్యతిరేకంగా ఉద్యమించే కార్మిక వర్గంపై దాడికి పాల్పడడం శోచనీయ మన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని అన్నారు. ఎపిఎంఎస్ఆర్‌యు రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పిఎస్.శేఖర్‌రెడ్డి, యువి. క్రిష్ణ య్య మాట్లాడారు. ప్రజల ప్రాణాలను కాపాడే మందులపై ప్రభుత్వాలు పన్నులు విధించడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. వైద్యం ఖరీదై పోయిందని, ధనవంతులకే వైద్యం దొరుకు తోందని అన్నారు. సామాన్యులకు జబ్బులొస్తే ఆస్తులు అమ్ముకునేలా వైద్యం ఖర్చులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల మందులపై జిఎస్‌టిని రద్దు చేసి ధరలను సామాన్యులకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఎంఎస్ ఆర్‌యు నాయకులు ఎజి.రాజ్‌మోహన్, ఎవి.నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, ప్రసాద్‌శర్మ, వెంకట్, శ్రీకాంత్, రవీంద్రారెడ్డి, రాఘవేంద్ర, పెద్దస్వామి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

నియామకాల్లో రిజర్వేషన్లు

కెవిపిఎస్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల్లో కచ్చితంగా రిజర్వేషన్లు అమలు చేయాలని కెవిపిఎస్ డిమాండ్ చేసింది. రూల్ ఆఫ్ రిజర్వేషన్లు అమలు చేయాలని భూపరిపాలన శాఖ కమిషనర్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారని, ఇది హర్షించదగిన అంశమని సంఘం ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకంలో కూడా రూల్ ఆఫ్‌రిజర్వేషన్ పాటించాలని ఆయన కోరారు.

ప్రధాని పదవి కోసమే కెసిఆర్ థర్డ్ ఫ్రంట్

పిసిసి అధ్యక్షులు రఘువీరారెడ్డి

ప్రధానమంత్రి కావాలనే దురాలోచనతోనే కేసీఆర్ థర్డ్ ఫ్రంట్‌ను తెరపైకి తీసుకొస్తున్నారని పిసిసి అధ్యక్షులు రఘువీరారెడ్డి విమర్శించారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణాలో ఎన్నికలు జరిగితే టిఆర్ఎస్ చిత్తుగా ఓడిపోవడం ఖాయమన్నారు. అలాంటి పార్టీ థర్డ్ ఫ్రంట్ పెట్టినా నిలదొక్కుకోవడం కష్టమన్నారు. ఎన్డీయేతో చంద్రబాబు తెగతెంపులు చేసుకుంటారన్న ఉద్దేశంతోనే థర్డ్ ఫ్రంట్ పేరుతో కెసిఆర్ ఊగిసలాడుతున్నారని ఆరోపించారు. ఇకనైనా ప్రజలను మభ్య పెట్టకుండా రాష్ట్రంలో అన్ని పార్టీలూ ఒకే తాటిపైకి వచ్చి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. బడుగు బలహీన వర్గాలతోపాటు అగ్ర వర్ణ పేదల్ని కూడా టిడిపి, బిజెపి ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయన్నారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల అమలుకు తమ పార్టీ కట్టుబడి ఉందన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన గంగాధర్

బిసి జనసభ అధ్యక్షులు డాక్టర్ గంగాధర్ కాంగ్రెస్ పార్టీలో చేశారు. ఎంపి కెవిపి రామచంద్రరావు, మాజీ మంత్రి పల్లంరాజు కండువా కప్పి ఆయన్ని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుంకర పద్మశ్రీ, కొలనుకొండ శివాజీ, మీసాల రాజేశ్వరరావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధ దంపతుల మృతదేహాలు లభ్యం

ప్రజాశక్తి -వన్‌టౌన్ (విజయవాడ)

ప్రకాశం బ్యారేజీలో గుర్తు తెలియని వృద్ధ దంపతుల మృతదేహాలు లభ్యమయ్యాయి. కృష్ణా నదిలో బ్యారేజీ అవతల ఒడ్డు నుండి కృష్ణా డెల్టా కాలువలోకి ఆదివారం మధ్యాహ్నం వృద్ధ దంపతుల మృతదేహాలు కొట్టుకురావడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. చుట్టు పక్కల ఉన్న సిసి కెమెరాలను పరిశీలించి వీరు ప్రమాదవశాత్తు పడిపోయారా లేక కావాలనే నదిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నారా అనే కోణంలో వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. ఉదయం నుండి బ్యారేజీలో మృతదేహాలు అక్కడక్కడే నీటిలో ఉంటే ఇరిగేషన్ శాఖ అధికారులు సైతం పట్టించుకోకపోవడం విశేషం.



కృష్ణాజిల్లా నూజివీడులోని ట్రిపుల్ ఐటిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గంటా

నెలలో ఒకరోజు ట్రిపుల్ ఐటిలోనే మకాం

విద్యా శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-నూజివీడు

ప్రతి నెలలో ఒక రోజు ట్రిపుల్ ఐటిలోనే ఉండి పర్యవేక్షించనున్నట్లు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. కృష్ణాజిల్లా నూజివీడులోని ట్రిపుల్ ఐటిని మంత్రి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని రోజులుగా ట్రిపుల్ ఐటిలోని విద్యుత్ సబ్ స్టేషన్ పనిచేయకపోవడంతో విద్యుత్ సమస్య తలెత్తింది. దీంతో మంత్రి ఆదేశాల మేరకు వెంటనే సబ్ స్టేషన్‌కు అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు తీసుకువచ్చి విద్యుత్‌ను పునరుద్ధరించారు. అలాగే మెస్‌లను పరిశీలించి ఆహార నాణ్యతను మెనూ ప్రకారం ఇస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ కృష్ణాజలాలు పునరుద్ధరించే వరకు అవసరమైతే ట్యాంకర్ల ద్వారా సప్లై చేయడానికి టెండర్లు పిలవాలని మంత్రి ఆదేశించారు. మరీ అవసరమైతే సమీప పొలాల్లోని బోర్ల నుండి నీటిని ట్రిపుల్ ఐటికి అందించాలని సూచించారు. విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను త్వరలోనే అందిస్తామని తెలిపారు. విసి రామచంద్రరాజు, డైరెక్టర్ వివి.దాసు, టిడిపి నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రొయ్యల ఫ్యాక్టరీ విషవలయం

- అస్వస్థతకు గురౌతున్న సిబ్బంది
- బెంబేలెత్తుతున్న ప్రజలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

తూర్పుగోదావరి జిల్లాలోని ఓ రొయ్యల ఫ్యాక్టరీ విషవలయంగా మారింది. తరచూ విషం చిమ్ముతూ అక్కడి సిబ్బందినీ, సమీపంలోని గ్రామస్తులను రోగాల బారిన నెడుతోంది. రొయ్యల అవశేషాలను శీతలీకరించే ఈ ఫ్యాక్టరీలో తరచూ అమోనియా గ్యాస్ లీక్ అవుతూనే ఉంటుంది. దీనిపై అధికారులు వచ్చి హెచ్చరికలు చేయడం, సీజ్ చేయడం, ఆ తర్వాత వారం రోజులకే ఆ ఫ్యాక్టరీని తెరవడం ఆనవాయితీగా మారింది.కాకినాడ సమీపంలోని గురజనాపల్లిలో మూడేళ్ల క్రితం వీరభద్రా సీఫుడ్స్ రొయ్యల ఫ్యాక్టరీ ప్రారంభమైంది. ఈ ఫ్యాక్టరీలో రెండు షిఫ్టులుగా సుమారు 750 మంది కార్మికులు పని చేస్తున్నారు. ఈ ఫ్యాక్టరీలో రొయ్యల అవశేషాలను అధిక ఉష్ణోగ్రత వద్ద శీతలీకరిస్తారు. ఇందుకోసం అమోనియా గ్యాస్ వాడతారు. ఈ ఫ్యాక్టరీ నుంచి వస్తున్న దుర్వాసనతో గురజనాపల్లి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై అధికారులకు ఎన్ని వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్లలో నాలుగు సార్లు గ్యాస్ లీకై ఉద్యోగులు అస్వస్థతకు గురై, ఆసుపత్రి పాలయ్యారు. తాజాగా ఈ నెల ఐదో తేదీ ఉదయం ఫ్యాక్టరీలో అమోనియా గ్యాస్ లీకవడంతో 10 మంది సిబ్బంది అస్వస్థతకు గురయ్యారు. వీరిని ఆ యాజమాన్యానికి చెందిన ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. అక్కడికి మీడియాను సైతం అనుమతించడం లేదు. సిఐటియు నాయకత్వం యాజమాన్యం అడ్డుకున్నా వారిని ఎదిరించి లోపలికి ప్రవేశించింది. ఫ్యాక్టరీ లోపల గ్యాస్ లీకవుతున్న విషయాన్ని సిఐటియు నాయకులు గ్రహించి తిరిగి అధికారులను అక్కడికి రప్పించి లీకేజీని అదుపు చేయించారు. తరచూ గ్యాస్ లీకవుతున్నా యాజమాన్యం మాస్కులు కూడా ఇవ్వకుండా సిబ్బంది పట్ల నిర్లక్ష్యంగా ఉండటాన్ని వారు తప్పుబట్టారు. సిఐటియు నేతల రాకతో వెనుక గేటు నుంచి సిబ్బందిని పంపించేశారు.



కరప మండలం గురజనాపల్లిలో రొయ్యల ఫ్యాక్టరీ

ఏడాదిలో రెండుసార్లు

గతేడాదీ మార్చిలోనే ఈ ఫ్యాక్టరీలో ప్రమాదం జరిగింది. అప్పుడు కూడా 10 మంది మహిళలు అస్వస్థతకు గురవ డంతో ఆసుపత్రికి తరలించారు. ఆ తర్వాత యాజ మాన్యం వారికి ఎటువంటి పరిహారమూ చెల్లించలేదు.

ఆ సమయం లోనూ తగిన రక్షణ ప్రమా ణాలు ఆ ఫ్యాక్టరీలో లేవని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు ఫ్యాక్టరీని సీజ్ చేశారు. తెరిచేశారు. తగిన రక్షణ ప్రమాణాలు పాటిస్తున్నారని, పొల్యూ షన్ కంట్రోల్‌కు తగిన జాగ్రత్తలు తీసుకు న్నారని అధికారులు అప్పట్లో చెప్పారు. ఏడాది తిరగ కుండానే మరో ప్రమాదం చోటు చేసుకుంది.

మరోసారి సీజ్

గ్యాస్ లీకు ఘటనతో వీరభద్ర సీ ఫుడ్స్ కంపెనీని మరోసారి రెవెన్యూ అధికా రులు సీజ్ చేశారు. మళ్లీ 10 రోజులకే ఫ్యాక్టరీని తెరిచేశారు. తగిన ప్రమాణా లు తీసుకోవ డంలో యాజమాన్యం విఫలమైందని చెబుతు న్నారు. ఈసారి ఎన్ని రోజులు సీజ్ చేసి ఉంచు తారో వేచి చూడాల్సిందే. ప్రమాదం జరిగిన ప్పుడు మూసేసి, ఆ తర్వాత అనుమతులు ఇస్తూ అధికారులు యాజమాన్యంతో లాలూచీ పడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పరిహారమివ్వడం లేదు

వీరభద్ర సీఫుడ్స్ ఫ్యాక్టరీలో తరచూ ప్రమాదాలు జరుగుతు న్నాయి. ఇప్పటికే నాలుగుసార్లు ప్రమాదాలు జరగడం వల్ల చాలామంది ఆసుపత్రి పాలై ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడాల్సిన పరిస్థితులు ఉన్నాయి. వీరికి యాజమాన్యం ఎటువంటి నష్టపరిహారమూ ఇవ్వడం లేదు. ఇక్కడ పనిచేసిన సిబ్బంది మంచం పడుతున్నా యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. తగిన భద్రతా ప్రమాణాలు తీసుకోకుండా సిబ్బందితో పనిచేయించుకుంటోంది. ఇప్పటికైనా ప్రమాదాలకు కారణమైన యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలి.



ఎం వీరలక్ష్మి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి

అంచనాలు తలకిందులు

- ఒప్పందాలు రూ.4844 కోట్లు వచ్చింది 115 కోట్లు
- కృష్ణా జిల్లాలో కార్యరూపం దాల్చని విశాఖ ఒప్పందాలు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్ ప్రతినిధి

ప్రభుత్వం కుదుర్చుకుంటున్న పారిశ్రామిక పెట్టుబడి ఒప్పందాలు తలకిందులవుతున్నాయి. వేల కోట్ల పెట్టుబడి, లక్షల మందికి ఉపాధి అని ప్రభుత్వం చెపుతున్న మాటలు కార్యరూపం దాల్చడం లేదు. గత పారిశ్రామిక భాగస్వామ్య సదస్సు తరువాత ఈ 14 నెలల కాలంలో కృష్ణాజిల్లాకు వచ్చిన సంస్థలు, పెట్టుబడి, ఉపాధిని పరిశీలిస్తే ఈ విషయం తేటతెల్లమవుతోంది. 2017 జనవరి 27, 28లలో విశాఖలో జరిగిన పారిశ్రామిక భాగస్వామ్య సదస్సులో జిల్లాలో 28 సంస్థలు రూ.4,844 కోట్లు పెట్టుబడి పెట్టడానికి ముందుకు వచ్చాయని ప్రభుత్వం ప్రకటించింది. తద్వారా 64, 283 మందికి ఉపాధి వస్తుందని తెలిపింది. వ్యవసాయ జిల్లాను పారిశ్రామికంగా ముందుకు తీసుకెళ్లేందుకు ఈ ఒప్పందాలు దోహదపడుతుందని ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచారం చేసింది.



విశాఖ సదస్సులో పెట్టుబడులపై జరిగిన ఒప్పందాలు(ఫైల్)

14 నెలల్లో వచ్చింది మూడు సంస్థలే...

ప్రభుత్వం ప్రైవేటు సంస్థలతో ఒప్పందం చేసుకుని ఇప్పటికి 14 నెలలు పూర్తయింది. ఇప్పటికి వచ్చిన సంస్థలు మూడు మాత్రమే. ఈ సంస్థలు పెట్టిన మొత్తం పెట్టుబడి రూ.115.10 కోట్లు మాత్రమే. ఉపాధి అతి స్వల్పంగా 325 మందికి మాత్రమే లభించింది. కంచికచర్ల వద్ద ఏర్పాటు చేసిన ఇన్వెంట్ బయో కెమికల్స్ మాత్రమే అత్యధికంగా రూ.110 కోట్లు పెట్టుబడిగా పెట్టి 250 మందికి ఉపాధి కల్పించింది. నూజివీడులో ఏర్పాటు చేసిన విజయదుర్గా ఆయిల్ ప్రొడక్ట్సు ప్రైవేటు లిమిటెడ్ రూ.3.50 కోట్లు, ఆగిరిపల్లి మండలం నెక్కలం వద్ద శ్రీ సంపద లక్ష్మీ ఫ్రూట్ ఇండస్ట్రీ (విస్తరణ)కు రూ.1.60 కోట్లు పెట్టుబడి పెట్టాయి. ఈ రెండు సంస్థలు 75 మందికి మాత్రమే ఉపాధి కల్పించాయి.

పురోగతిలో ఉన్నవి ...

జగ్గయ్యపేట ముక్త్యేశ్వరం వద్ద రూ.500కోట్లతో కెసిపి సిమెంట్ పరిశ్రమ విస్తరిస్తోంది. పామర్రు వద్ద రూ.23.6 కోట్లతో అక్షయఫుడ్స్, కృత్తివెన్నులో ఆనంద్ ఎంటర్ ప్రైజెస్ రూ.6 కోట్లతో రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్‌లను నెలకొల్పుతున్నాయి. కెసిపి సంస్థ తాజాగా 2,000 మందికి, రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా మరో 405 మందికి ఉపాధి లభిస్తుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

తప్పించుకునే ప్రయత్నంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మోపిదేవి:



పేకాట శిబిరంపై పోలీసులు దాడిచేయటంతో వారి నుంచి తప్పించుకునేందుకు నదిలో దూకి వ్యక్తి మృతి చెందిన ఉదంతం కృష్ణాజిల్లా మోపిదేవి మండలం పెదకళ్లేపల్లిలో జరిగింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన ముసలం రామాంజనేయులు (32), మరికొంతమంది నదీప్రాంతంలోని కరకట్ట పక్కన పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారమందటంతో శనివారం చల్లపల్లి పోలీసులు దాడి చేశారు. పోలీసులు కొంతమంది పేకాట రాయుళ్లను కొంతమందిని అదుపులోకి తీసుకోగా రామాంజనేయులు తప్పించుకుని నదిలో దూకినట్లు గ్రామస్తులు తెలిపారు. రాత్రి 9గంటల సమయంలో కృష్ణానదిలో శవమై తేలుతున్న రామాంజనేయులును మత్స్యకారులు గుర్తించి గ్రామస్తులకు సమాచారం అందించారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. పేకాట శిబిరంపై పోలీసులు దాడిచేయటం వల్లే రామాంజనేయులు మృతిచెందాడని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మృతి విషయం తెలుసుకున్న చల్లపల్లి పోలీసులు గ్రామ పెద్దలతో జరిపిన రాజీప్రయత్నాల్లో మృతుని కుటుంబానికి పెద్ద మొత్తంలో నగదు అందించేందుకు అవగాహన కుదిరినట్లు సమాచారం.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలి

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జాస్తి చలమేశ్వర్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వ్యవసాయాన్ని లాభసాటిగా చేసి రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా కొర్నేపాడులో రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గోశాలను ప్రారంభించారు. రైతులకు ఉచితంగా దేశీయ వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎదురవుతున్న సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. పెరుగుతున్న పెట్టుబడులు, తగ్గుతున్న ఆదాయం వల్ల రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. శాఖాహారం తినడం, ప్లాస్టిక్‌ను నిషేధించడానికి ప్రతి ఒక్కరూ ప్రాధాన్యమివ్వాలని సూచించారు. పర్యావరణాన్ని కాపాడటానికి ప్రభుత్వంతో పాటు ప్రజలూ విశేషంగా కృషి చేయాలన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 12.5 లక్షల ఎకరాల్లో ప్రకృతి విధానం ద్వారా వ్యవసాయం చేసేందుకు ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తోందన్నారు. ఇందుకోసం 1.63 లక్షల మంది రైతులకు రూ.37 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. కర్నూలులో రూ.675 కోట్లతో విత్తన యూనివర్సిటీ, బిల్‌గేట్స్ ఫౌండేషన్ సహకారంతో శాటిలైట్ మ్యాపింగ్ ద్వారా రైతులకు పలు ప్రయోజనాలు కలుగుతాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపి యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు, రైతు నేస్తం వ్యవస్థాపకులు వెంకటేశ్వరరావు, జెడ్‌పిటిసి ఉప్పుటూరి సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.



రైతులకు దేశవాళీ విత్తనాలు అందిస్తున్న మంత్రి సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి, పక్కన జస్టిస్ జాస్తి చలమేశ్వర్

కిడ్నీ వ్యాధితో గిరిజన మహిళ మృతి

ప్రజాశక్తి-ఎ.కొండూరు

కృష్ణాజిల్లా ఎ.కొండూరు మండలం గొల్లమందల తండాకు చెందిన భూక్యా చావళి (65) రెండు కిడ్నీలు చెడిపోయి ఆదివారం మృతిచెందింది. తన తల్లికి మూడేళ్ల క్రితం రెండుకాళ్లు వాపు వచ్చాయని, నడవలేని స్థితిలో ఉన్న ఆమెను హాస్పిటల్‌లో చూపించగా రెండు కిడ్నీలు చెడిపోయాయని డాక్టర్లు చెప్పినట్లు మృతురాలి కుమారుడు హరి పేర్కొన్నాడు. అప్పటి నుంచి విజయవాడ, గుంటూరు ఆసుపత్రుల్లో వైద్యం చేయించినా... వ్యాధి తగ్గకపోగా ఎక్కువైనట్లుగా ఇటీవల చేయించిన రక్త పరీక్షలలో క్రియాటిన్ 8.6 ఉన్నట్లు డాక్టర్లు చెప్పారని తెలిపాడు. డాక్టర్లు డయాలసిస్ చేయించాలని చెప్పినా ఆర్థిక స్థోమత లేక మందులే వాడుతున్నట్లు తెలిపారు.



ఏనుగుల దాడిలో మృతి చెందిన కుమార్

ఏనుగుల దాడిలో యువకుని మృతి

ప్రజాశక్తి- కొత్తూరు (శ్రీకాకుళం జిల్లా)

శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం రాయల పంచాయతీ టింపరగూడకు చెందిన యువకుడు ఏనుగుల దాడిలో మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. పొన్నుటూరు పంచాయతీలో అరటి, చెరుకు, సర్వే తోటల పరిసరాల్లో సంచరిస్తున్న ఏనుగులను చూసేందుకు శనివారం సాయంత్రం అంజనగూడకు చెందిన చంద్రబాబుతో కలిసి టింపరగూడకు చెందిన తాపీ మేస్త్రీ తింపాటిగూడకుమార్(30) వెళ్లాడు. ఏనుగులకు అత్యంత సమీపానికి కుమార్ వెళ్లడంతో అవి ఒక్కసారిగా యువకుడిపై దాడి చేసి చంపేశాయి. చంద్రబాబు తప్పించుకొని గ్రామానికి వెళ్లి గ్రామస్తులకు విషయాన్ని తెలిపాడు. గ్రామస్తుల సమాచారం మేరకు అటవీ శాఖాధికారులు శనివారం రాత్రంతా గాలింపు చేపట్టినా కుమార్ జాడ తెలియలేదు. ఆదివారం ఉదయం సర్వే తోట వద్ద కుమార్ విగతజీవిగా పడి ఉండడాన్ని గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పురస్కారం

విశాఖ నాకు తల్లి వంటిది

'మా' ప్రధాన కార్యదర్శి నరేష్



తల్లి తరపున వి-టీమ్ జీవనసాఫల్య పురస్కారం అందుకుంటున్న 'మా' ప్రధాన కార్యదర్శి నరేష్

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి, జిల్లాపరిషత్

విశాఖ నాకు తల్లివంటిదని మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్(మా) ప్రధాన కార్యదర్శి డాక్టర్ నరేష్ పేర్కొన్నారు. ఆదివారం గురజాడ కళాక్షేత్రంలో మహిళా దినోత్సవ వేడుక సందర్భంగా సీనియర్ నటి విజయనిర్మలకు జీవితసాఫల్య పురస్కారం అవార్డుకు ఎంపిక చేశారు. ఆమె రాకపోవడం వల్ల నరేష్ ఆ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తల్లి అనారోగ్యం కారణంతో హాజరుకాలేకపోయారని తెలిపారు. ప్రతి మనిషీ రెండుసార్లు పుడతారని, తల్లి కడుపునుంచి ఒకసారి, తన జీవితం ఎక్కడ ప్రారంభమైందో అక్కడ మళ్లీ పుడతారని తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా అమ్మకు ఈ పురస్కారం లభించడం తనకెంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. 200 చిత్రాల్లో కథానాయికగా విభిన్న పాత్రల్లో నటించి, 46 చిత్రాల దర్శకురాలిగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సృష్టించారని తెలిపారు. అమ్మ మంచి రైతని, తనకి వ్యవసాయం నేర్పిందని సగర్వంగా చెప్పారు. ఇటు కుటుంబాన్ని నడిపిస్తూ, సూపర్‌స్టార్ వెనక నిలబడి అమ్మ ఎప్పటికీ గ్రేట్ అని నరేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమీషన్ చైర్మన్ నన్నపనేని రాజకుమారి, దక్షిణాది సూపర్‌స్టార్ నటుడు శరత్‌కుమార్, దర్శకురాలు బి.జయ, ఎపి పర్యాటకఅభివృద్ధి సంస్థ డైరెక్టర్ పిఎస్.నాయుడు, టాలీవుడ్ నిర్మాత బి.ఎ.రాజు, గంటా నారాయణమ్మ ట్రస్టు చైర్మన్ గంటా శారద తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వి.శేషాచార్యులు

హోంగార్డుల వేతన పెంపునకు డిమాండ్

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)

రాష్ట్రంలో హోం గార్డులకు వేతనాలు పెంచాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోంగార్డుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్.గోవింద్, అమరావతి రాష్ట్ర హోం గార్డుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.శేషాచార్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం రాష్ట్ర హోంగార్డుల భవిషత్ కార్యాచరణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం వేతన పెంపుదల చేస్తామని 2017 నవంబరు 21న శాసనసభలో హోం మంత్రి రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ఏపీ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు హోం గార్డుల వేతనాలు పెంచాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఐదేళ్ల సర్వీస్ కలిగి అర్హత ఉన్న హోం గార్డులకు సీనియారిటీ ప్రకారం కానిస్టేబుల్‌గా ఉద్యోగోన్నతి కల్పించాలన్నారు. వారంతపు సెలవు కల్పించాలన్నారు. ఉచిత బస్‌పాస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. హోం గార్డులు మరణించిన సందర్భంలో వారి కుటుంబానికి లక్ష రూపాయల మంజూరు చేయాలని కోరారు.

తల్లిదండ్రుల ఆశయ సాధనకు కృషి

భూమా వర్ధంతి సభలో మంత్రి అఖిలప్రియ

ప్రజాశక్తి - ఆళ్ళగడ్డ



కర్నూలు జిల్లా ఆళ్లగడ్డలో భూమా ప్రథమ వర్ధంతి సభలో మాట్లాడుతున్న మంత్రి అఖిల ప్రియ

తల్లిదండ్రులు భూమా, శోభా నాగిరెడ్డిల ఆశయ సాధన కోసం నిరంతరం కృషి చేస్తామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ శోభా ఘాట్‌లో ఆదివారం కీర్తిశేషులు భూమా నాగిరెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ అమ్మ, నాన్నల అకాల మరణంతో ఎంతో కృంగిపోయిన తమకు నియోజకవర్గ ప్రజల ఆశీస్సులు, అభిమా నాలే నిలబెట్టాయన్నారు. అనుక్షణం జనం కోసమే తనతండ్రి తాపత్రయపడేవారని, అందుకే ప్రజలకు భూమా అంటే ధీమా ఉండేదన్నారు. తనతండ్రి చనిపోయే ముందు కూడా తనను గెలిపించిన నంద్యాల నియోజకవర్గ అభివృద్ధిపైనే ముఖ్యమంత్రితో చర్చించారన్నారు. నంద్యాల స్థాయిలో ఆళ్ళగడ్డను కూడా అభివృద్ధి చేస్తామని చెప్పారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కాల్వ శ్రీనివాసులు మాట్లాడుతూ.. భూమా కుటుంబానికి అండగా ఉంటామన్నారు. భూమా కుటుంబంతో తనకు ఎంతో గొప్ప అనుబంధం ఉందన్నారు. రాష్ట్ర గిడ్డంగుల శాఖ మంత్రి ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ.. జగన్ మొండితనం వల్లనే తాము వైసిపికి దూరమయ్యామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఎమ్మెల్యే ఎస్‌వి మోహన్‌రెడ్డి, నంద్యాల ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, ఈ కార్యక్రమంలో కర్నూలు ఎంపి బుట్టా రేణుక, టిడిపి జిల్లా అధ్యక్షుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, భూమా తనయ నాగ మౌనిక, కుమారుడు జగత్ విఖ్యాత్‌రెడ్డి, నేషనల్ విద్యాసంస్థల అధినేత ఇంతియాజ్ అహమ్మద్, మార్కెట్‌యార్డు చైర్మన్ బివి రామిరెడ్డి, రామతీర్థ క్షేత్రం చైర్మన్ అంబటి మహేశ్వరరెడ్డి, కొత్తకోట ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.



అక్షరం

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

4 విజయవాడ
సోమవారం 12 మార్చి 2018



'ఆడామగా వాగినప్పుడే
నాకర్థమై పోయింది..
మేము పాలిచ్చి పెంచిన జనంలో జగమే
మమ్మల్ని విభజించి పాలిస్తుందని ... '

– సావిత్రి

అంత తేలిక కాదు

ప్రభుత్వాలను కూల్చినంత తేలిక కాదు
ఎర్రని ఉదయాలను కూల్చడం–
మసీదులు కూల్చినంత మాటలు కాదు
యుగాల స్వప్న శిఖరాలను కూల్చడం–
మతం అగ్గితో మనుషుల్ని కాల్చినంత సులువు కాదు
తరాలుగా ఎగిసిపడే మానవాంతరంగాలను కూల్చడం–
ఓటుకు రేటు కట్టడమంత ఈజీ కాదు
ఆశల ఆకాశాలను కూల్చడం–
గొడ్డు కోసం మనుషుల్ని గొడ్డుల్లా చావబాది
చర్మాలు వలిచినంత సులభం కాదు
నింగి నుంచి నేలకు దిగి
నేల నుంచి నింగి దాకా ఎదిగిన
నక్షత్ర వృక్షాలను కూల్చడం–
పీఠాల కోసం దేశభక్తిని
విచ్ఛిన్నకారుల పక్కలో పండబెట్టడమంత పండగ కాదు
అమరుల నెత్తురుతో కాలం వేసిన బొమ్మను కూల్చడం–

నీకు విగ్రహమంటే మట్టీ మశానమే
మాకు విగ్రహమంటే
మట్టి మనుషుల మహదాకాంక్షల పరిమళం
దేవుడినైనా చంపగలవేమో కాని
వీరుడి విగ్రహాన్ని కూల్చలేవు!

– ప్రసాదమూర్తి
8499866699

విద్వేషంపై అక్షరాగ్రహం

దేశం ఇప్పుడు ముందెన్నడూ చూడని విద్వేషాన్ని చూస్తోంది. మానవాళికి మంచి దారులు చూపించిన మహోన్నతుల విగ్రహాలపై సాగుతున్న దాడుల పట్ల సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. దీనిపై కవిలోకం తీవ్రంగా స్పందిస్తోంది. విద్వేషం, విధ్వంసంపై కవిత్వం ధర్మాగ్రహం ప్రకటిస్తోంది. అలాంటి తాజాగా వెలువడ్డ కవిత్వంలోంచి కొన్ని కవితలు...

అనగనగా ఇలా జరిగెను!

బుల్ డోజర్‌ని భుజాన వేసుకుని
వాళ్ళు బయల్దేరారు
ఉషోదయాన్ని కూలదోయడానికి–
మరలూ నట్లూ గోచీలుగా బిగించి
పొద్దు తిరుగుడు పూల నూనె
వొళ్ళంతా దట్టించి
యంత్రాన్ని మల్లయోధుడిలా
ఇనబింబం మీదకు ఎగదోసారు
ఎర్ర బాలుడు కొంచెం కొంచెం
పైకి పైకి జరుగుతూ
ఆట పట్టించాడు
వాళ్ళు యంత్రాన్ని కొంచెం కొంచెం
పైకి జరుపుతూ వెంటపడ్డారు
మధ్యాహ్నానికి ఎండ కండువా తలకి చుట్టి
యవ్వన తాండవం చేశాడు ఎర్ర కుర్రోడు

యంత్రాన్ని ఇంకొంచెం పైకెత్తి
అతణ్ణి తాకాలని చూశారు
సాయంత్రానికి వీళ్ళని చూసి నవ్వుకుంటూ
ఈ పూటకి ఇక్కడ చాలు
మరోచోట కలలు రాల్చాలని
ఎర్రగా రెప్పలు వాల్చాడు నిప్పుల వీరుడు–
కూల్చేశాం కూల్చేశాం అని
కోలాటమాడారు వాళ్ళు
సినిమా హాళ్ళు దేశభక్తి గీతాలు పాడాయి
ఆవులు లేచి నిలబడ్డాయి–
తెల్లారి చూస్తే
అదే దిక్కున అదే వీరుడు
అదే ఎర్రెర్రగా.. అదే నవ్వుతో–
అప్పుడు చరిత్ర
బుల్ డోజర్ భుజాల మీద నిల్చొని
వాళ్ళ మొహాల మీద పోసింది!

– ప్రసాదమూర్తి
8499866699

కవిత్వం

వీరులు గుండెల్లో ఉంటారు



విగ్రహాలు కూల్చేస్తేనే
కూలిపోయే 'వ్యక్తులు' కాదు వాళ్ళు
కోటానుకోట్ల గుండెల్లో వెలుగొందిన సూర్యుళ్ళు

విగ్రహాలు పడగొట్టే పిరికితనం నీది...
విగ్రహాల్లో వీరుల్నీ చూసే తత్వం మాది
నువ్వు కూల్చేస్తే కూలిపోయే
సిద్ధాంతాలు కావు అవీ...
కూల్చబడిన చోట నుండే
పై పైకి ఎదిగే విగ్రహ వీరులు వాళ్ళు
నువ్వు పడగొట్టే కొద్ది
నవ సమాజ నిర్మాణం చేసే యోధులు వాళ్ళు
వాళ్ళు విగ్రహాలు కాదు
సజీవ మహోపాధ్యాయులు
వాళ్ళు ఉండేది మా గుండెల్లో ..!

– తంగిరాల సోని
96766 09234

వీధుల్లో పడగొట్టండి ... గుండెల్లోంచి పుట్టుకొస్తారు!



అన్నార్తులు ఉండని కాలాన్ని
కలగన్నాడు లెనిన్ ..
అందుకు అతడి విగ్రహాన్ని కూల్చేయాలి!
అణగారిన తరగతులు
అధికారంలోకి రావాలన్నాడు అంబేద్కర్ ..
అందుకు అతడి విగ్రహాన్ని పడగొట్టాలి !
పెత్తందారీ మూలాలను
గట్టిగా ప్రశ్నించాడు పెరియార్ ..
అందుకు అతడి విగ్రహాన్ని పడగొట్టాలి !

మధ్యయుగపు చీకటి ప్రేతాల్లారా,
మీరు
కూల్చేయండి
పడగొట్టండి
వీధుల్లో విధ్వంసకారులై చెలరేగండి !
మీకు ఏమి తెలుసో అదే చేయండి !!

వాళ్ళు మళ్ళీ మళ్ళీ మా గుండెల్లో
రెపరెపలాడే జెండాలై లేస్తారు !
మీ మూర్ఖత్వానికి, ఆధిపత్యానికి
సమాధి కట్టే చైతన్యాన్ని
దేశం మూలమూలలా ప్రసరిస్తారు !!

– శాంతిమిత్ర

నీడను కూడా తాకలేరు!

విగ్రహారాధన మా తత్వం కాదు
విగ్రహాలు పెట్టాలన్నా దోచాలన్నా మీరే!
విగ్రహం లేకపోతే మీరు మీ దేవుళ్ళని
మరుస్తామనే భయమో భక్తో ప్రాణభీతియో
గుళ్ళల్లో వెలుస్తాయి విగ్రహాలు!
మీరు కూలదోస్తున్న విగ్రహాల
పునాదుల్లో మా తత్వశాస్త్రం సజీవం
మాకేం భయం లేదు
మా గోసలకి
చేయూతనిచ్చినోళ్ళు
మా గుండెల్లో పదిలం
మా దిక్సూచీలు
పుస్తకాల్లో ఎంత దాచాలో
అంతకన్నా ఎక్కువే దాచారులే
దాష్టీకాలెన్ని జరిగినా
చెరిగిపోని చరిత్రకి వారసులు మా నేతలు
తిమ్మిని బమ్మిని చేయాలనుకున్నా
అభాసుపాలయ్యేది మీరే
అంతర్జాతీయ వేదికలపై
చిన్నబోయేది మీరే
చరిత్ర ఆటుపోట్లలో
ఆరితేరిన యోధానుయోధుల
నీడను కూడా తాకలేని
నిరక్షరకుక్షుల జాబితాలో మీరు!

– గిరిప్రసాద్ చెలమల్లు
94933 88201

కౌంట్ డౌన్
విగ్రహాలు కూల్చండి
వినోదాల తేలండి
ఉన్మాదం తలకెక్కగ ఉగ్రూతలూగండి
లెనిన్, పెరియార్, అంబేద్కర్
ఎవరైనా ఒక్కటే
మీ పైశాచిక సంతతికి
సమానత్వం కోసం
సమసమాజం కోసం
నిలబడడం అపరాధం
దోపిడీ పోవాలని
కుల జాడ్యం వదలాలని
బోధించుట బహునేరం
మౌఢ్యం తలకెక్కిన
తాలిబాన్ల అన్నలారా!
మదం మత్తున తూలే
అభినవ నాజీల్లారా!
విర్రవీగి విర్రవీగి
సమాధుల చేరేందుకు
ఘోరీలను తవ్వుకోండి
ప్రజాగ్రహం రగిలింది
దావాలనమై దహిస్తుంది
మీ పీఠం కదిలేందుకు
కౌంట్డౌన్ మొదలయిందిక
అంకెలు లెక్కెట్టుకొండిక !

– ఎవి రమణారావు

సామాజిక చింతనతోనే ఉత్తమ కథలు

కళలన్నవి పుట్టుకతో రావల్సిందేగాని నేర్పితే వచ్చేవి కావంటారు. ఆమాటకొస్తే విద్యలైనా, చివరకు మాట్లాడడం, నడవడం, సైకిలు తొక్కడం వంటి చర్యలైనా నేర్పితే వచ్చేవి కావు. నేర్వదలిచే వారికి ఆ ఇచ్ఛ ఉండాలి. నేర్చే ప్రయత్నం ఉండాలి. ఆ ప్రయత్నంలో నేర్పడానికి సిద్ధమైన వారి సహాయాన్ని వారు అంగీకరించాలి. అప్పుడే నేర్చుకోడం, నేర్పడం జరుగుతాయి. నేర్చేవారుంటే నేర్పగలవారు నేర్పుతూనే ఉంటారు. విద్యలు సరే. కళలో?

అశ్వారోహణం, గజారోహణం దగ్గర్నుంచి పువ్వుల్ని దండలుగా కూర్చడం, దొంగతనం చెయ్యడం వరకూ అన్నీ కళలే! అరవై నాలుగున్నాయి మనకి. ఇవన్నీ పుట్టుకతో వచ్చేవేనా? సంగీతం, చిత్రలేఖనం కూడా లలితకళలే! అభిరుచీ, ఆసక్తీ, ప్రతిభా ఉన్నవారు నేర్చుకుంటారు. సాహిత్యం ఒక లలితకళే అయినా, కథారచన ఆ లలిత కళల్లో భాగమే అయినా దాని గురించి ఇంకొకరి నుంచి తెలుసుకోవడం తప్పు కాదు. తెలియజెప్పడమూ తప్పు కాదు. ఎటొచ్చీ ఒక్క హెచ్చరిక మాత్రం అవసరం. ఏదైనా ఒకరు నేర్పితే వచ్చేది కాదు. రావడం ప్రధానంగా నేర్చుకునేవారి మీదే ఆధారపడి ఉంటుంది. కథలు రాయడమైనా అంతే!

దేశంలో దినదినాభివద్ధి చెందుతున్న అక్రమాలూ, అన్యాయాలూ, ఏ క్రమంలో పెరుగుతున్నాయో, వాటి నెదుర్కోవల్సిన రాజకీయ పక్షాల వైఫల్యాలు జనంలో నిరాశను ఏ క్రమంలో పెంచుతున్నాయో, అదే క్రమంలో కొత్తవాళ్ళు రచనకు పూనుకుంటున్నారా? అనిపిస్తుంది. కథలు రాయాలనే కోరిక కొత్తవారిలో ఇంతగా వ్యాప్తి చెందడానికీ, రాసిన కథలు పత్రికల్లో పడాలనే తహతహ వారిలో ఇంత తీవ్రంగా ఉండడానికీ, హేతువులు ఒకటి కన్నా ఎక్కువే ఉండొచ్చు. ఎంతో కొంత శాతం మినహాయిస్తే మిగిలిన వారంతా ఏం రాసినా తమ చుట్టూ ఉన్న పరిస్థితుల పట్ల అసంతప్తితో, అసహనంలో, అసహ్యంతో ఆవేశపడీ, ఆగ్రహించీ రాస్తున్నట్టే కనిపిస్తుంది. కారణాలు ఏవైనా కావచ్చు– ఈ రచయితల్లో నూటికి 70 మందికి కథంటే ఏమిటో తెలియదు. తెలిసిన 30 మందిలో 20 మందికి కథ సరిగా కట్టడం రాదు. కట్టడం వచ్చిన పదిమందిలో ఒకళ్ళిద్దరికి తప్పితే కథల మంచిచెడ్డల గురించి తెలియదు. ఆ తెలిసిన వారికైనా ఏ గుణాలవల్ల ఒక కథ మంచిదౌతుందో, వేనివల్ల ఇంకొకటి చెడ్డదవుతుందో – స్పష్టమైన అభిప్రాయాలున్నట్టు లేదు.

ఇందువల్ల, కొత్త రచయితల్లో కథలపట్ల ఇంతగా పెరుగుతున్న ఈ తపనా, అందుగురించి వాళ్లకవుతున్న వ్యయ ప్రయాసలూ – ఇవన్నీ వారికి గాని, మనకిగాని ఈయవలసిన సత్ఫలితాలను ఈయడం లేదు. వాళ్ళ చొరవా, ప్రయత్నం, శ్రమా సత్ఫలితాలివ్వాలంటే వారంతట వారుగా గాని, ఇతరులు తెలియచెప్పడంవల్లగాని కథను గురించి తెలుసుకోవడానికి కొంతకాలం, శ్రమా అవసరమవుతాయి.

తొలి ప్రయత్నంలోనే కథ రాయాలంటే అందరూ రాయలేరన్నది వాస్తవం. అలా రాయగలిగిన వారుంటే వారేదో ఆకాశం నుంచి ఊడిపడ్డవారు కారు. మొదటిదెంత వాస్తవమో రాయడం పుట్టుకతో వచ్చేదనడం అంత అవాస్తవం. కథలు దాదాపు ఎవరైనా రాసుకోవచ్చునేమో, అందరూ ఎవరికి వారు పాడుకున్నట్టు. కానీ – మంచి కంఠం, నిశితమైన రాగజ్ఞానం, తాళజ్ఞానం ఉన్నవారు పాడినప్పుడే ఇతరులు వినగలుగుతారు. అలానే పదిమందికి పట్టే విధంగా (లేదా పది కాలాలు నిలిచే విధంగా) రాయాలంటే అలా రాసేవారికి కొన్ని ప్రత్యేక లక్షణాలుంటాయి. తమకు జరిగే మంచి చెడ్డలకు లోకంలో ప్రతివారూ స్పందిస్తారు. ఆ స్పందన కొందరిలో ఇతోధికంగానూ, మరికొందరిలో సాధారణంగానూ ఉంటుంది. సాధారణతను మించి స్పందించే వారెవరైనా రచయితలయ్యే అవకాశం ఉంది. కొందరిలో ఈ స్పందన తమకు జరిగే మంచి చెడ్డలతో ఆగదు.



కథాలోచన

తమ వారికి జరిగే మంచి చెడ్డలకూ, తమవీ తమ వారివీ జీవితాలతో ముడిపడి ఉన్నవారి మంచి చెడ్డలకూ కూడా స్పందిస్తారు. అలా జీవితపు ముడుల సంగతి ఎక్కువగా తెలిసిన కొద్దీ – ప్రకృతిలో కనిపించే అనేకానేక సూత్రాలకూ, దాని గాంభీర్యతకూ, అజేయతకూ, దానితో నిరంతరం పోరాడుతున్న మనిషి జీవితంలోని వెలుగు చీకట్లకూ, అందువల్ల ఏర్పడ్డ మానవ సంబంధాల్లో పరస్పర ఘర్షణలకూ, వానిని క్రమ పరుచుకునేందుకు నిర్మించుకున్న వ్యవస్థలు మనిషి జీవితంపై నెరపే అనుకూల ప్రతికూల ప్రభావాలకూ, ఇలా తమ జీవితంలో ఆరంభించి దానితో ముడిపడి ఉన్న ఎన్నింటికో స్పందించే వారుంటారు. అలాంటి వాళ్ళు తక్కిన వాళ్ళ మీద మరింత మెరుగైన రచయితలు కావచ్చు.

కొందరు– ఎవరి డబ్బూ దస్కం వారిదే అన్నట్టు, ఎవరి కష్టసుఖాలూ, సమస్యలూ వారివే అనుకుంటారు. కొందరు డబ్బూ దస్కం ఎవరిది వారిదే అయినా కష్టసుఖాలూ, సమస్యలూ, పరిష్కారాలూ ఉమ్మడివనుకుంటారు. జీవితపు ముడుల సంగతి ఎక్కువగా తెలిసినవారు – జ్ఞానంతో సహా అన్నింటినీ తోటివారితో పంచుకోవడం భావ్యమనో, మంచిదనో అనుకుంటారు. పంచుకోగలిగినా, పంచుకోలేకున్నా మరికొందరు సాధ్యమైనన్నింటిని, సాధ్యమైన మేరకు, మందితో పంచుకుంటారు. ఇదంతా వారి వారి సాంఘిక స్వభావం మీద చాలావరకూ ఆధారపడి ఉంటుంది. సాంఘిక స్వభావం అసలు లేనివారు రచయితలు కావడానికి ప్రయత్నించరు. ఇంతో అంతో ఉన్నవారెవరైనా ప్రయత్నిస్తే రచయితలు కావచ్చు.

రచయితలు కాగలవారు సాధారణంగా రాయడానికి ముందు చదువుతారు. చదువువల్ల ద కృథం విశాలమైనట్టు కనిపించినా, చదువు వల్ల తాము మారినట్టనిపించినా, చదువు పట్లే కాకుండా రాతపట్ల కూడా ఆసక్తి పెరగ్గా చివరకు రచనకుండే శక్తి పట్ల నమ్మిక ఏర్పడ్డవారే, ప్రయత్నించినప్పుడు రచయితలయ్యే అవకాశం ఎక్కువ. అలా కాకుండా– ఫలానా శంకరనారాయణ రాసేడని ఒక ఆదినారాయణో, చెల్లెలు విమలమ్మ రాసిందని ఓ కమలమ్మో, అకస్మాత్తుగా కథ రాయబోతే ఎంత కొట్టుకున్నా వారి కలం ముందుకు సాగదు. పట్టుబలవంతాన ఎలాగో రాసి ముగిస్తే – అది ఏదో అవుతుంది గానీ కథ కాదు.

రాసిందానికి గుర్తింపో, డబ్బో రావడం వేరు. గొప్పలు కొట్టేయడానికీ, డబ్బులు పోగేసుకునేందుకూ రాయబోవడం వేరు. ఇవి రెండూ రచయిత కావడానికి సహజమైన ప్రేరణలు కావు. ఇలాంటి ప్రేరణలతో రచనకు దిగినవారు ఎవరోకాని రచయితలు కాలేరు. అయితే పేరుకోసం, డబ్బుకోసం రాయడం తప్పా? వాటికోసం రచనలు చేస్తున్నవారు లేరా? ఇవి విలువలకు సంబంధించిన ప్రశ్నలు. అందరి విలువలూ ఒకటి కావు. వాటికోసమే రాయదలచుకున్న వాళ్ళు వాటికోసమే రాయొచ్చు. తొలిదశలోనే వాటికోసం రాయదలచుకున్న వాళ్ళొక సంగతి గమనించాలి. అచ్చం పేరుకోసం, డబ్బుకోసం మాత్రమే రచనలు చేసేవారు చాలా తెలివైన వాళ్ళేకాక, ఎన్నో నేర్పులెరిగినవారై ఉంటారు. ఎన్నో ఒదులుకోగల వాళ్ళై, ఇంకెన్నిటినో పోగొట్టుకోవడానికి సిద్ధమవ్వాలి. అయితే వాళ్లైనా ఆదిలో సహజమైన ప్రేరణలతోనే రచనా వ్యాసంగం ఆరంభిస్తారు. కథమీద పట్టు దొరికేక హదయ వ్యాపారంగా మార్చుకుంటారు.


మన స్వభావం జీవితంలో మంచిచెడ్డలకి తీవ్రంగా స్పందించేదై ఉండాలి. అనుభవాలనో, ఆవేశాలనో లేక అభిప్రాయాలనో ఇతరులతో పంచుకునే స్వభావం ఉండాలి. సాహిత్యం ద్వారా ఆ పని జరుగుతుందన్న నమ్మకం, చేయగల శక్తీ ఉండాలి. ఆదిలో ఆ శక్తి లేకున్నా ఫరవాలేదు. ప్రయత్నించి దానిని సంపాదించవచ్చు. కొత్త కథకులకు కథ రాయడం గురించి తెలియాలంటే ముందుగా కథంటే ఏమిటో తెలియాలి. జరిగిన ఒక బలమైన సంఘటనను యథాతథంగా రాసినా, మార్పులవసరమైతే సహజత్వం చెడకుండా మార్చినా కథ అవుతుందనుకుంటారు కొందరు. జరిగింది రాసినా, కల్పించి రాసినా, రచనలో ఏం ఉంటే అది కథ కాగలదో, ఎప్పుడది కాలేదో తెలియాలి. ఉత్తరోత్తరా ఏమోగానీ, ఆరంభదశలో చిత్రరచనకూ, కథారచనకూ కొన్ని దగ్గర పోలికలున్నాయి. తద్వారా కథంటే ఏమిటో కొంత తెలుసుకోవచ్చు.

ఎప్పుడో, ఎక్కడో జరిగిన సంఘటననో, సన్నివేశాన్నీ కల్పించి రాయొచ్చు. ఎలా రాసినా ఆ సంఘటనకు సంబంధించిన వ త్తాంతంలో ఆసక్తికరమైన ఒక విశేషం ఉండాలి. చిత్రంలో అందలి బొమ్మ ద్వారానే దానిలో విశేషం వ్యక్తమైనట్టు రచనలో అందలి వ త్తాంతం ద్వారానే ఆ విశేషం వ్యక్తం కావాలి. అలా అంతర్గర్భిత విశేషాన్ని వ్యక్తీకరించే వ త్తాంతమే కథ కాగలదు. వ్యక్తీకరించడానికి ఏ విశేషమూ లేని వ త్తాంతం ఒత్తి వత్తాంతంగానే మిగిలిపోతుంది.

కథగా చెప్పదగ్గ ఈ సంఘటన జరిగినప్పుడు మనం అక్కడ ఉంటే – మన కళ్లకూ, చెవులకూ, తదితర ఇంద్రియాలకూ తెలియవచ్చేది కొంతా, ఆ సంఘటనతో ప్రమేయం ఉండే వ్యక్తుల గురించీ, పరిస్థితుల గురించీ ఊహించగలది కొంతా ఉంటాయి. ఈ భోగట్టా, ఈ ఊహ కలిస్తే తెలియవచ్చేది ఈ సంఘటనకు సంబంధించిన వృత్తాంతం. ఈ వృత్తాంతంలో మనని కదిలించేది ఉంటే దానిని కథగా చెప్పాలనుకుంటాం. అలా కదిలించేదేదైతే ఉందో అదే విశేషం. వత్తాంతంలా ఇది ఇంద్రియాలకూ, ఊహకీ తెలిసేది కాదు. హ దయాన్ని తాకేది. వివేచనకు మాత్రమే వ్యక్తమయ్యేది. కథను గుర్తించడానికి తెలియవల్సిన అంశాలన్నీ క్రోడీకరిస్తే – ప్రదేశాలూ, వాటి వర్ణనలూ, సంఘటనలూ పాత్రల చర్యలూ, వాటి సంభాషణలూ మొదలైనవన్నీ ఉన్నంత మాత్రాన ఓ రచన కథ కాదు.

ఈ కథా సామగ్రి అంతా క్రమబద్ధంగా అమరి ఉంటే వాటివల్ల ఒక వత్తాంతం తెలుస్తుంది. అది వత్తాంతమే కాని అదే కథ కాదు. వ త్తాంతంలో ఒక ఆసక్తికరమైన విశేషం ఇమిడి ఉండాలి. ఆ వత్తాంతం ద్వారానే ఆ విశేషం వ్యక్తమవ్వాలి. అలా ఈ వ త్తాంతంలో ఒక విశేషం ఇమిడి ఉండి ఆ విశేషాన్ని ఆ వత్తాంతమే వ్యక్తం చెయ్యగలిగినప్పుడు – అదే కథ అవుతుంది.

– కాళీపట్నం రామారావు
(కథాకథనం నుంచి)



వర్షపు చినుకులు రాలి పడుతుంటాయి. మన వెనగ్గా ఉన్న సూర్యుడి చూపులు మనల్ని దాటి వాటిపైన పడతాయి. దీంతో నీటి బిందువుల్లోంచి ఆ చూపుల కాంతి పరావర్తనం చెంది మన కళ్లముందు ఏడు రంగులుగా కనువిందు చేస్తుంది. ఆకాశంలో ఆ రంగుల విన్యాసం ఒక ప్రాకృతిక సౌందర్య రూపం. మరి అనిల్ డ్యాని ఏంటి ఎనిమిదో రంగు అంటాడు? ఇంద్రచాపంలో ఇమడలేని ఆ రంగు రహస్యాన్నెలా పట్టుకోవడం?

అతని పుస్తకం మొత్తం తిరగేస్తే కాగితాలనిండా పరావర్తనం చెందిన ఒక కొత్త కాంతి కాస్తంత కుదురుగానో, లేదా చెల్లాచెదురుగానో పరుచుకున్నట్టు కనిపిస్తుంది. మన వెనక సూర్యాడు, కొంటె నవ్వులు విసురుతుంటుంటే అనిల్ ఆ సూర్యుని నవ్వుల్లో దాక్కున్న కనపడని చీకటి రంగుని గాలి బుడగగా చేసి చిన్న పిల్లాడిలా పట్టుకుని పరిగెట్టుకొస్తున్నాడనిపిస్తుంది.

కన్నులు చూడని రంగుల రహస్యం

అవును.. చిక్కటి చీకటిలో కవి పరావర్తనం చెందుతున్న కొత్త జీవిత వెన్నెలలని తాకుతాడు. ఈ పుస్తకమంతా అలా తాకిన స్పర్శే సహజ సౌందర్యంగా కనిపిస్తుంది.

'చీకటి కప్పుకున్న రహదారి పక్కన
రెక్క విరిగిన పక్షులు విలపిస్తుంటాయి
పుట్టుక రహస్యం తెలియనప్పుడు,
దేహం ఒక్కసారే మరణించదు'

ఆలంబన లేకుండా విరిగిన రెక్కలతో రోడ్ల పాలైన జీవితాల్ని గురించి, అందునా రోజూ రోజూ మరణిస్తున్న దేహాల జన్మ రహస్యం చెబుతాడు. అవసరాలకు లోబడ్డతనంలో ఒంటిరెక్కతోనైనా విహరించాలనే దైన్యతని చిత్రిస్తాడు. సమాజంలో నిస్సహాయతకి గురై, అణిచివేతకి బలైన స్త్రీ మానసిక పరివేదనల్ని వివరిస్తాడు. ఇలాంటి కవితలు ఇంతకుముందు చదివి ఉండొచ్చు గాక! కాని ఇతను చెబుతున్నప్పుడు ఆమె బాధలన్నీ కొత్తగా కనిపిస్తాయి. ఆమెతనం చుట్టూ అతను విచిత్రమైన ప్రయాణం చేస్తాడు.

ఎంతో అభివృద్ధి చెందినదనుకుంటున్న ఆధునిక సమాజంలో స్త్రీని ఇంకా ఒక వస్తువుగానే చూస్తున్న విషాదం నిజమేగా? ఆమెని, ఆమెతనాన్ని చౌకబారు హాస్యం టీఆర్పీ రేటింగుల్లో చూసి మనం మురిసి పోవడంలేదూ? కవి అదే వినిపిస్తాడు. ఆమె దరిలేని సముద్రాల్ని ఈదుతుందంటాడు, పట్టుచీరల పార్లమెంటరీ సదస్సుల వెలుపల రోడ్లపక్కన సమాజాన్ని శుభ్రం చేస్తూ అగపడుతుందంటాడు. కొన్ని మరువలేని నిజాల్ని ఎప్పుడూ గుర్తుండిపోయేట్టు చెప్పడమే అనిల్ లక్షణంగా కనిపిస్తుంది. 'భూమిని మొత్తం తవ్విపోసి, ఆమెతనం నారుపోయాలంటాడు. ప్రతి వాక్యంలో ఫెమినిస్టులా తోచినట్టు అనిపిస్తాడు కానీ, ఈ వాక్యాల అంతర్మథనం వాదాల కవతల మనల్ని నిశ్చేష్టులను చేస్తుంది, ప్రశ్నిస్తుంది. సూర్యుడి వెలుగు ప్రపంచ తల్లులు స్రవించిన రక్తం అని చదవగానే మనసు కలతబారి పోతుంది. అతని ఊహాశక్తిలో కొత్త సన్నివేశాన్ని మనం ఆశ్చర్యంగా చూస్తాం.

కవి రంజాన్ పండగ మీద రాస్తాడు, రైతు గురించి రాస్తాడు, చదవలేక చనిపోతున్న పిల్లల గురించి రాస్తాడు, పండక్కి ఇంటికెళ్ళి మారిపోయిన పల్లెటూర్ని గురించి రాస్తాడు . ఒక్కో కవితలో ఒక్కో రిఫ్లెక్షన్! ప్రతిచోటా సమాజం నీటి బొట్టులో కనపడని రంగుల సంఘర్షణే!

'పళ్లాల నిండా పరుచుకున్న
జాడీ చివరీ ఆవకాయలో కారం లేదు
చేతికి పెరుగన్నం తిన్న జిడ్డూ లేదు
నేతి గారెల వాసన వంటగది నిండా
దాటిపోవడానికి చూరెక్కడా
పంచుకుందామంతే ఎంతకీ తెరవని పక్కింటి పెద్ద
టేకు తలుపు'

ఏమిటీ దైన్యం? పల్లెలు కూడా మారుతున్న దృశ్యం.

మనుషులు జవాబు చెప్పలేని జీతపు చిలకల్లా మారి, తమకు తామే పంజరాల్లోకి దూరిపోతున్న దైన్యం ఎంతో అద్భుతంగా చిత్రిస్తాడు, కవి ఎంతో లోతైన చూపు కలిగి సున్నితమైన పార్శ్వాలని తట్టి లేపుతాడు.

పుస్తకం

అనిల్ కొత్తగా పరిచయం చేయాల్సిన కవేం కాదు. ఇంతకుముందు తనతో పాటు ముగ్గురు కవులతో కలిసి మొదటి ప్రయత్నంగా 'తీరం దాటిన నాలుగు కెరటాలు' అని మన ముందుకొచ్చాడు. ఆధునిక కవిత్వం చదువుతున్నవాళ్లకి బాగా తెలిసినవాడు. కొత్తగా రాస్తున్న వాళ్లకైతే తెలుసుకోవాల్సినవాడు. కవి సంగమం నుంచి వెలువడిన మరో శక్తివంతమైన బాణం. ప్రవాహ ధోరణి కలిగిన భావ ప్రకటనలు చేస్తున్నపుడు కవిసంగమంలో తర్ఫీదు స్పష్టంగా కనిపిస్తుంది. జనరల్ బోగీ లాంటి కవితల్లో 'ఒక్క అక్షరమూ పట్టకుండా పూర్తిగా రాసేసిన ఉత్తరంలా ఉంది రైలు బోగీ' అంటాడు. ఇతను కవిత్వాంశాలను చూస్తున్న కొత్త చూపు అతని సరళమైన భాషతో, సూటిదనంతో ఇంకా కొత్తదనం సంతరించుకుంటుంది.

చాలా కవితల్లో సామాజిక వ్యవస్థ నిర్మించుకున్న రాజకీయాలు, అసమానతలు, విద్వేషమూ, పగ కోపమూ లాంటి పునాది రాళ్ళూ కనపడతాయి. క్యాపటలిస్టు కాలాన్ని పహారా కాసే ప్రపంచీకరణ, దానికి దాసోహం పలికే ప్రభుత్వ విధానాలు ఆ వాటాల్లో తడిచి ముద్దయ్యే నగరాలు ఇలా అన్నిటిని ఈ పుస్తకం చదివిస్తుంది. ఈ కవిత్వమంతా నిండిన ఆకలి సమాజం మీదున్న కసి. ఆ కసిదీరా గుంపులో నిలబడి ఏదో ఒక జీవన వేదనని బిగ్గరగా అరచి చెప్పాలనే సంవేదనా ప్రతి కవితలోనూ కనబడుతుంది.

అనిల్, పర్వతం మీదనుంచి కిందకి పడి నిట్టనిలువుగా చీలిన లోయ పుట్టినప్పటి మొదటి ఏడుపంత శబ్దమంతటినీ చెవులు పిక్కటిల్లేలా ప్రతిధ్వనిస్తాడు. కాలం మారేకొద్దీ కొత్తగా రాసే కవులొస్తారు. వాళ్ళు అప్పటిద్దాకా ఉన్న ధ్వనిని, దృశ్యాన్నీ సరికొత్తగా ఆవిష్కరిస్తారు. అప్పుడా నిత్యనూతన కవిత్వ మూర్తిమత్వం ఆయా కాలాన్ని, దాని అస్తిత్వాన్ని ప్రశ్నిస్తుంది. పరీక్షకు నిలబెడుతుంది. అలాంటి సాహసోపేత ప్రయాణం మొదలెట్టిన అనిల్ ఏ మాయా వెలుతురులోనో కంటబడకుండా దాక్కున్న చిక్కటి సరికొత్త రంగుల వలయంలోకి మనల్ని విసిరేస్తాడు. కాలౌచిత్యాన్ని గౌరవిస్తూ అతను మరిన్ని మంచి కవితలు రాయాలి. ఈ తొలి సంపుటం ఇరుసంధ్యల నడుమ వెలుతురు కన్ను చూడని కొన్ని అనేకానేక రంగుల నిగూఢ రహస్యం.

– శ్రీరాం పుప్పాల
99634 82597

కాటన్ కాలం

మార్చిలోనే ఎండలు మండిపోతున్నాయి.. ఈసారి ఎండలు ఎప్పటికన్నా ఎక్కువగా ఉంటాయట కూడా. మరి ఈ కాలంలో నూలు వస్త్రాలు ధరిస్తేనే కాస్తయినా ఉపశమనం. వేసవిలో సౌకర్యవంతంగా ఉండే మంగళగిరి కాటన్ చుడీలు ఇవి. చూడటానికి అందం... శరీరానికి చల్లదనం... నిప్పులు కురిసే వేసవిలో ఇంతకన్నా ఇంకేం కావాలి మనకు? మరి మీరూ ఈ వెరైటీలను ప్రయత్నిస్తారా?





బిడ్డకు కడుపునిండా పాలివ్వాలంటే?!

బిడ్డకు తల్లిపాలు పట్టించడం చాలా అవసరం. తల్లిపాలు తాగడంవల్ల పుట్టిన బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుంది. కనుక బిడ్డకు కనీసం ఆరు నెలలు నిండే వరకైనా తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాలని వైద్యులు సూచిస్తుంటారు. అయితే కొంత మంది స్త్రీలకు బిడ్డకిచ్చే పాలు తక్కువగా వస్తాయి. ఇలాంటి వారు కొన్ని చిట్కాలు పాటించి, బిడ్డకు సరిపడా పాలను పట్టించవచ్చు.

బిడ్డకు పాలు సమృద్ధిగా అందాలంటే తల్లి బలమైన పోషకాహారం తీసుకోవాలి. మంచి ప్రోటీన్లు, క్యాల్షియం,



విటమిన్లు, ఐరన్ ఎక్కువగా ఉండే ఆహారం తినాలి. ప్రోటీన్లు ఎక్కువగా లభ్యమయ్యే పాలు, గుడ్లు, మాంసం, చేపలు ఎక్కువగా తీసుకోవాలి. అదేవిధంగా విటమిన్-ఎ ఎక్కువగా ఉండే క్యారెట్, గుమ్మడి వంటి కాయగూరలు తినాలి. పోషకాలు ఎక్కువగా ఉండే ఉడికించిన బఠాణీలు, బీన్స్, మొలకెత్తిన గింజలు తీసుకోవాలి. ఫొలెట్ అధికంగా లభ్యమయ్యే ఆకుకూరలు ఎక్కువగా తినాలి. పండ్లు, పప్పుధాన్యాలను ఎక్కువగా తీసుకోవాలి. ఈ ఆహారాలను తీసుకుంటే తల్లి నుంచి బిడ్డకు కావలసినన్ని పాలు లభిస్తాయి.

బిడ్డకు పాలిచ్చే తల్లులు మసాలాలు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోకూడదు. వీరి కోసం వండే ఆహార పదార్థాల్లో మసాలాలు తగ్గించాలి. అలాగే సువాసననిచ్చే కొత్తిమీర, దాల్చిన చెక్క ఉపయోగించరాదు. ఇటువంటివి వాడితే ఆ సువాసన ఘాటు బిడ్డకు ఇచ్చే తల్లిపాల రుచిని మారుస్తుంది. దీంతో బిడ్డ పాలు సరిపడినన్ని తాగలేదు. ముఖ్యంగా బిడ్డకు పాలిచ్చే మహిళలు మద్యం సేవించడం, పొగాకు తీసుకోవడం వంటి అలవాట్లు ఉంటే.. వాటికి దూరంగా ఉండాలి. ఇవి పాల ఉత్పత్తిని తగ్గించడమే కాకుండా వాటి ప్రభావం బిడ్డపై పడే ప్రమాదం లేకపోలేదని వైద్యులు పేర్కొంటున్నారు. ★

కుంకుడుతో మేలెంతో...

ఆధునికత పెరిగే కొద్దీ ఆడంబరాలకు పోతూ మంచి ఆరోగ్య విధానాలను మనం మరిచిపోతున్నాం. ఖరీదైన షాంపూలు వాడుతూ.. ప్రకృతి సిద్ధంగా లభించే కుంకుడు కాయలు, శీకా కాయలను మరచి పోతున్నాం. మన అమ్మ, అమ్మమ్మలు, తాతయ్యలు వీటిని వాడబట్టే నిగనిగలాడే జుట్టు వారి సొంతమైంది. ప్రస్తుతం మనం షాంపూల మీద ఆధారపడబట్టి చిన్న వయస్సులోనే నెరిసిన జుట్టు, బట్టతల వస్తున్నాయి. మార్కెట్లో ఎన్నిరకాల షాంపూలు వచ్చినాగానీ.. కుంకుడులకు సాటిరావంటారు నిపుణులు.



- తలస్నానానికి కుంకుడుకాయలను వాడటమే మంచిది. దీనివల్ల వెంట్రుకలు ఆరోగ్యంగా ఉండటమే కాక పేలు, చుండ్రులాంటి సమస్యలు రావు.
- కుంకుడుకాయలను బాగా ఎండబెట్టి, పొడిచేసుకుని నిల్వ చేయొచ్చు. దీనివల్ల తలస్నానం చేసిన ప్రతిసారీ కుంకుడు కాయలను కొట్టుకునే శ్రమ తప్పుతుంది.
- ఎండబెట్టిన కమలాతొక్కలు, నిమ్మతొక్కలు, మందారాకులు, మందారపూలు, మెంతులను పొడిచేసి కుంకుడు పొడిలో కలపవచ్చు. వీటన్నింటినీ కలిపిన పొడితో తలస్నానం చేస్తే వెంట్రుకలు నల్లగా ఉంటాయి. త్వరగా నెరవవు. జుట్టు ఊడదు. జుట్టు రఫ్‌గా తయారవ్వకుండా మెత్తగా ఉంటుంది.
- వీటిలో ఎటువంటి రసాయనాలు కలువవు. కనుక జుట్టు నల్లగా నిగనిగలాడుతుంది. కుంకుడుకాయలతో తలస్నానం చేయడంవల్ల కురులు పట్టులా మెరుస్తాయి.
- బంగారు ఆభరణాలను కుంకుడురసంలో నానబెట్టి, మెత్తని బ్రష్‌తో మృదువుగా రుద్దితే... అవి శుభ్రపడి.. ధగధగా మెరుస్తుంటాయి.
- కుంకుడు కాయలను ఇంగ్లీషులో సోప్‌నట్స్ అని కూడా పిలుస్తారు. ఇవి కిరణాషాపుల్లో దొరుకుతాయి. ★

మీకోసం

గోధుమపిండిలో రెండు మగ్గిన అరటిపళ్ళు.. కప్పు పెరుగు కలిపితే చపాతీలు మెత్తగా ఉంటాయి.



జీవన సౌరభం

జీవితంలో ఎదురయ్యే ప్రతి అవరోధం ఒక పాఠం. దానినుంచి నేర్చుకొని ముందుకు వెళితేనే విజయం.

సరికొత్త సూపర్ స్ప్లెండర్

ఫ్యాషన్



ఇప్పుడు హీరో మోటోకార్ప్ విపణిలోకి సరికొత్త 2018 హీరో సూపర్ స్ప్లెండర్ బైకును లాంచ్ చేసింది. 2018 హీరో సూపర్ స్ప్లెండర్ కమ్యూటర్ 125 బైక్‌లో 124.7సీసీ కెపాసిటీగల సింగల్ సిలిండర్ పెట్రోల్ ఇంజన్ ఉంటుంది. 2017లో విడుదలైన హీరో గ్లామర్ బైకులో కూడా ఇదే ఇంజన్ ఉంది. సరికొత్త వెర్షన్ సూపర్ స్ప్లెండర్ బైకును యువతను లక్ష్యంగా చేసుకుని సంస్థ ప్రవేశపెట్టింది. బైక్ సాంకేతికంగా పరిశీలిస్తే 124.7 సీసీ కెపాసిటీగల ఇంజన్ 7,500 ఆర్‌పిఎమ్ ఇంజన్ వేగం వద్ద 11.2 బిహెచ్‌పి పవర్, 6,000 ఆర్‌పిఎమ్ వద్ద 11ఎన్‌ఎమ్ టార్క్ ఉత్పత్తి చేస్తుంది. అంతేకాదు, ఈ బైకులో హీరో పేటెంట్ పొందిన ఇంజన్ ఐడిల్ స్టాప్ అండ్ స్టార్ట్ సిస్టమ్ (I3S) ఉంది. హీరో గ్లామర్ తరహాలోనే 2018 హీరో సూపర్ స్ప్లెండర్ బైకులో 4-స్పీడ్ గేర్‌బాక్స్ అందించారు. దీని మొత్తం బరువు 124 కిలోలుగా ఉంది. మునుపటి వెర్షన్‌తో పోల్చుకుంటే బరువు మూడు కిలోల వరకు పెరిగింది. కొత్త ఇంజన్ మినహాయిస్తే, స్పోర్టివ్ శైలిలో ఉన్న సరికొత్త సీటు వచ్చింది. మునుపటి సూపర్ స్ప్లెండర్‌తో పోల్చుకుంటే విశాలంగా, అత్యంత సౌకర్యవంతంగా ఉంటుంది. సూపర్ స్ప్లెండర్ సైడ్ ప్యానళ్లనూ రీడిజైన్ చేశారు. మునుపటి బైకులోని టెయిల్ సెక్షన్‌లో ఉన్న హెక్సాగోనల్ టెయిల్ ల్యాంప్ స్థానంలో ఇంటిగ్రేటెడ్ ఎల్‌ఇడి టెయిల్ లైట్ సెటప్ ఉంది. ఎల్లప్పుడూ ఆన్‌లో ఉండే ఆటోమేటిక్ హెడ్‌ల్యాంప్ ఆన్, సైడ్ స్టాండ్ ఇండికేటర్, విశాలమైన రియర్ టైర్, లాకింగ్ ఫెసిలిటీగల సైడ్ యుటిలిటి బాక్స్ వంటి ఫీచర్లు ఉన్నాయి. ★




సాహసనారి వినీత ముని

ఓవైపు ఆకాశంలో చంద్రుడు. మరోవైపు అప్పుడప్పుడే ఉదయిస్తున్న సూర్యుడు. భూమికి 5,638 మీటర్ల ఎత్తులో ఉన్న ప్రసిద్ధి చెందిన కారాకోరమ్ కొండలపై సూర్యకిరణాలు వెచ్చగా విస్తరిస్తుంటే.. చల్లని మేఘాలు మన మేనిని తాకి వెళ్తుంటే ఆ అనుభూతిని వర్ణించడానికి మాటలు చాలవు. జీవితంలో ఒక్కసారి అయినా చూడాలనుకుంటాం. కానీ అలాంటి అనుభూతిని అనేకమార్లు సొంతం చేసుకున్న ధీశాలి వినీత ముని.



ముంబై సబర్బన్‌లో పుట్టిన ఈ వనిత... అరుణాచల్‌ప్రదేశ్ నుంచి సిక్కిం, నేపాల్, గర్వాల్, కుమావోన్, స్పితి, లడఖ్ మీదుగా జమ్మూకాశ్మీర్ వరకు ఎన్నో పర్వతాలను అధిరోహించింది. 1997లో ఏడు నెలల్లో 4,500 కిలోమీటర్లు నడిచిన మహిళా బృందంలో ఆమె ఒకరు. 2014లో హిమాలయన్ క్లబ్‌లోని రస్సా గ్లేసియర్‌లోని రస్సా కంగ్రి (6,250 మీటర్ల ఎత్తు) శిఖరాన్ని అధిరోహించిన మొట్టమొదటి పర్వతారోహకురాలు కూడా. ఈ యాత్ర ద్వారా ఆమె ఎన్నో అవార్డులను అందుకుంది. 50 ఏళ్ల వినీత ముని మౌంటెనీర్స్ ఇన్‌స్ట్రక్టర్. 23 సార్లు హిమాలయాల యాత్ర చేసింది. ఈమె కేవలం పర్వతారోహకురాలు మాత్రమే కాదు... మంచి ఆర్టిస్టు, ఫొటోగ్రాఫర్. అడ్వర్టైజింగ్ ఏజెన్సీ కూడా నడుపుతోంది. 'ఆండెస్, ఆల్ప్స్ పర్వతాలను ఎందుకు ఎక్కకూడదు అని అప్పుడప్పుడు నేను అనుకుంటా. కానీ హిమాలయాలను చూడటానికి, అక్కడి ప్రకృతిలో మమేకం కావడానికి ఈ జీవితకాలం సరిపోదు' అంటుంది వినీత. బాల్యంలో వినీతకు ఫొటోగ్రఫీ అంటే ఇష్టం ఏర్పడింది. ప్రముఖ పొట్రెయిటిస్ట్ బెల్లీ హౌమ్‌జీ దగ్గర శిక్షణ తీసుకుంది. అయితే పర్వతారోహణపై మక్కువ ఏర్పడిన తరువాత ఫొటోగ్రఫీ సెకండరీ అయిపోయింది. 15 ఏళ్లకే సహ్యాద్రి కొండలను అధిరోహించింది. నెహ్రూ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్‌లో శిక్షణ తీసుకుంది. ఆ తరువాత ఎప్పుడూ వెనుకకు తిరిగి చూసుకోలేదు. 1980లో వినీత ముంబైలోని పర్వతారోహక బృందం ఎక్స్‌ప్లోరర్స్ అండ్ అడ్వెంచరర్స్‌లో చేరింది. పర్వతారోహకుడు, ఫొటోగ్రాఫర్ అయిన దివ్యేష్‌ను పెళ్లి చేసుకుంది. 'మా పుట్టినరోజులకు, పెళ్లి రోజుల్లో గిఫ్ట్ ఇచ్చిపుచ్చుకోవడానికి బదులుగా పర్వతారోహణే చేస్తాం' అని చెబుతుంది వినీత.

ఆమె ఈ ఘనతనంతా ఒక్కరోజులోనో, ఒక్క సంవత్సరంలోనో సాధించలేదు. ఎన్నో ఏళ్లుగా మౌంటెనీరింగ్‌లోనే ఉన్న ఆమె ఎదుర్కొన్న సమస్యలు అనేకం. '1984లో ముంబైలోని దుధ దగ్గరలోని ఓ పర్వతాన్ని ఎక్కుతుండగా జరిగిన ప్రమాదంలో దవడతోపాటు అనేక ఎముకలు విరిగిపోయాయి. 'మా అమ్మ భయాలు నిజమయ్యాయి. అయినా మా అమ్మానాన్న ఎప్పుడూ నన్ను ఆపలేదు. 2010లో చీలమండలకి శస్త్రచికిత్స జరిగింది. అయితే ఒక్కోసారి నా శరీరాన్ని అధికంగా బాధిస్తున్నానేమో అనిపిస్తుంది. కానీ ఇలాంటి సవాళ్లను ఎదుర్కోవడానికి నా శరీరానికి పద్ధతి ప్రకారం శిక్షణ ఇస్తున్నా. ఇప్పుడు నాకు 50ఏళ్లు. కానీ పర్వతారోహణలో యువకులకు తీసిపోను. ఇన్నేళ్లలో ఏమాత్రం నెమ్మదించలేదు. ట్రెక్కింగ్‌కు వెళ్లినప్పుడు, పర్వతారోహణ చేసినప్పుడు ఒక్కోసారి అలసట అనిపిస్తుంది. దాన్ని అధిగమించేందుకు మంచి పోషకాహారం తీసుకుంటా. 70 ఏళ్లప్పుడూ ఇంతే ఆరోగ్యంగా ఉండి, పర్వతారోహణ చేయాలని ఆశిస్తా' అంటోంది వినీత. ఆమె ఆకాంక్ష నెరవేరాలని కోరుకుందాం. ★

HINDI PAPER-I

S.S.C. MODEL PAPER

ద్వితీయ భాష

(PART-A&B)

Time: 2.45 Hours - Max Marks: 80

Part - A

Marks : 60

सूचना : 1. प्रश्न पत्र पढने के लिए 15 मिनिट का समय निर्धारित है।
2. भाग - 'A' के लिए 2 घंटे का समय निर्धारित है।
3. भाग - 'A' प्रश्नों के उत्तर, उत्तर पुस्तिका में लिखिए।।

I. प्रत्येक प्रश्न का उत्तर सूचना के अनुसार लिखिए। प्रत्येक उपभाग (1, 2, 3, 4) के लिए पाँच अंक निर्धारित हैं।

1. निम्न लिखत गद्यांश पढ़कर दिये गये प्रश्नों के उत्तर एक वाक्य में लिखिए। 5 x 1 = 5

"मालूम है। इसलिए हम इसकी सिर्फ़ थोड़ी - सी मात्रा अपने ग्रह पर ले जा रहे हैं। हमारे ग्रह के जल में एक विशेष प्रकार के विषाणुओं के मिल जाने के कारण वह ज़हरीला हो गया है। उसके उपयोग से हमारे ग्रह पर महामारी फैल गई है, जिससे वहाँ के लोग मरने लगे हैं। हमने तो उन विषाणुओं को नष्टकर दिया है, लेकिन जल में घुले ज़हर को अभी तक पहचान नहीं पाए हैं। जल को विषहीन बनाने में समय लगेगा। पानी के अभाव में हमारे लोग मर रहे थे। अपने अस्तित्व के लिए हमने निर्णय लिया कि हम जल्द-से-जल्द अन्य किसी ग्रह की खोज कर वहाँ का पानी अपने ग्रह पर ले जाँएगे। अपने ग्रह के लोगों का जीवन बचाएँगे। हमारी नज़र आपके नीले ग्रह पर पड़ी, जो हमसे अधिक नज़दीक था। हम यहाँ उतर गए। हम लोगों ने यहाँ पर विशाल जलभंडारों को देखा और निर्णय किया कि जब तक हमारे ग्रह पर पानी शुद्ध नहीं हो जाता, तब तक हम लोग यहीं से जल को अपने ग्रह पर ले जाएँगे। हम लोग लगभग एक सप्ताह से जल को विशेष यान की सहायता से ले जा रहे हैं। हम लोग अपना मिशन चुपचाप पूरा करना चाहते थे।"

प्रश्न :
1. उपर्युक्त गद्यांश किस पाठ से दिया गया है?
2. अंतरिक्षयात्री के ग्रह के जल क्यों जहरीला हो गया है?
3. नीले ग्रह क्या है?
4. अंतरिक्ष यात्री के ग्रह के लोगों ने क्या निर्णय किया?
5. अंतरिक्ष यात्री के ग्रह के लोग किस के अभाव में मर रहे थे?

2. निम्न लिखत गद्यांश पढ़कर दिये गये प्रश्नों के उत्तर विकल्पों में से चुनकर लिखिए। 5 x 1 = 5

नदी में रोज नया पानी आता रहता है। एक प्रान्त से दूसरे प्रान्त में वह बहता है। पर उसका रंग-रूप, व्यक्तित्व और सौन्दर्य अक्षुण्ण ही रहता है। इसी तरह संस्कृति की भी बात है। भारतीय में दुनिया भर की संस्कृतियों का असर दिखायी पड़ता है, लेकिन वह भारतीय ही रही है। भारतीय शब्द में आर्य प्रारम्भ का सूचक अवश्य है, किंतु वैदिक या महाभारत काल में उसे सीमित नहीं किया जा सकता।

कई लोग भारतीय शब्द पर आपत्ति उठाते हैं। वे भारतीय संस्कृति का स्वभाव नहीं जानते। उनके लिए नाम बदल देने की कोई जरूरत नहीं है। किन्तु पुराना नाम छोड़ने में अवश्य संकुचितता का दोष आ जाता है। मानवता का अंतिम कल्याण ही भारतीय संस्कृति का आदर्श है। भारतवर्ष उसका केन्द्र है, मध्य बिन्दु है और उसका कार्यक्षेत्र अखिल विश्व है।

प्रश्न :
1. इस देश की संस्कृति में दुनिया भर की संस्कृतियों का असर दिखायी पडता है। ( )
A) जपान B) अमेरिका
C) भारत D) चीना
2. रोज नया पानी इस में आता रहता है। ( )
A) तालाब B) नदी
C) नाल D) सागर
3. भारतीय संस्कृति का आदर्श यह है। ( )
A) मानवता का अंतिम कल्याण
B) विश्वनाश
C) विश्व युद्ध
D) पाकिस्तान पर बम लगाना
4. कई लोग इस शब्द पर आपत्ति उठाते हैं। ( )
A) रूस B) चीन
C) पाकिस्तान D) भारतीय
5. उपर्युक्त गद्यांश के लिए उचित शीर्षक यह होगा।
A) चीनी संस्कृति B) भारतीय संस्कृति ( )
C) अमेरिका की संस्कृति D) विषम संस्कृति

3. निम्न लिखत पद्यांश पढ़कर दिये गये प्रश्नों के उत्तर एक वाक्य में लिखिए। 5 x 1 = 5

झम-झम-झम-झम मेघ बरसते हैं सावन के,
छम-छम-छम गिरती बूँदें तरुओं से छन के ।
चम-चम बिजली चमक रही रे उर में घन के,
थम-थम दिन के तम में सपने जगते मन के ॥
दादुर टर-टर करते झिल्ली बजती झन-झन,
'म्यव-म्यव' रे मोर 'पीउ' 'पीउ' चातक के गण ।
उड़ते सोनबालक, आर्द - सुख से कर क्रंदन,
घुमड़-घुमड़ गिर मेघ गगन में भरते गर्जन ॥

प्रश्न :
1. उपर्युक्त पद्यांश के कवि कौन है?
2. कवि ने किस ऋतु का वर्णन किया है?
3. दादुर क्या करते हैं?
4. सावन के मेघ कैसे बरसते हैं?
5. मेघ कहाँ गर्जन भरते हैं?

4. निम्न लिखत पद्यांश पढ़कर दिये गये प्रश्नों के उत्तर विकल्पों में से चुनकर लिखिए। 5 x 1 = 5

भेद-भाव अपने दिल से, साफ़ कर सकें
दूसरों से भूल हों तो, माफ़ कर सकें
झूठे से बचे रहें सच का दम भरें
दूसरों की जय से पहले खुद की जय करें ॥

1. बच्चे इन्हें अपने दिल से साफ़ कर सकें। ( )
A) शत्रु भाव B) मित्र भाव
C) भेद भाव D) स्नेह भाव
2. दूसरों से भूल होतो .... कर सकें। ( )
A) साफ़ B) माफ़
C) प्यार D) नफ़रत
3. लडकें इस से बचे रहना चाहते हैं। ( )
A) सच से B) झूठे से
C) न्याय से D) अन्याय से
4. बच्चे हमेशा इस का दम भरे रहना चाहते हैं। ( )
A) सच B) असच
C) न्याय D) अन्याय
5. दूसरों की जय से पहले बच्चे किन की जय करने चाहते हैं? ( )
A) माँ - बाप की B) खुद की
C) अध्यापकों की D) इन सब की

II. निम्न लिखित प्रश्नों के उत्तर दो या तीन वाक्यों में लिखिए। 6 x 3 = 18

5. कविवर डॉ. रामधारी सिंह दिनकर जी का परिचय दीजिए।
6. मानव जीवन में वर्षा का क्या महत्व है?
7. भारत में हिन्दी दिवस क्यों मनाया जा रहा है?
8. भ्रष्टाचार अम्मूलन में पाठशाला का क्या महत्व है?
9. शांति की परिभाषा क्या हो सकती है? अपने शब्दों में बताइए।
10. राजा सत्यसिंह के राज्य में अकाल की स्थिति क्यों उत्पन्न हुई होगी?

III. निम्न लिखित प्रश्नों में से किसी एक प्रश्न का उत्तर छः या आठ पंक्तियों में लिखिए। 1 x 6 = 6

11. रहीम के दोहों का भाव अपने शब्दों में लिखिए।
12. मीराबाई के अनुसार जन्म - जन्म की पूँजी क्या है? समझाइए।

IV. निम्न लिखित प्रश्नों में से किसी एक प्रश्न का उत्तर छः या आठ पंक्तियों में लिखिए। 1 x 6 = 6

13. सारे भारतवासी अब्दुल कलाम को आदर्श मानते हैं। क्यों?
14. अपनी पाठ्यपुस्तक में से मानवीय मूल्यों को प्रतिबिंबित कहानी के बारे में लिखिए।

V. निम्न लिखित प्रश्नों में से किसी एक प्रश्न का उत्तर लिखिए। 1 x 5 = 5

15. पुस्तक खरीदने के लिए रूपये मांगते हुए अपने पिताजी के नाम एक पत्र लिखिए।
16. उल्लास यात्रा पर जाने की अनुमति और रूपये माँगते हुए अपने पिता के नाम एक पत्र लिखिए।

VI. निम्न लिखित प्रश्नों में से किसी एक प्रश्न का निबंध लिखिए। 1 x 5 = 5

17. किसी एक त्यौहार पर निबंध लिखिए।
18. "मोबाइल फ़ोन" पर एक छोटा सा निबंध लिखिए।

PART - B

विशेष सूचनाएँ :-
1. सभी प्रश्नों केलिए समान अंक निर्धारित है।
2. प्रश्नों के उत्तर सामने दिये हुए कोष्टक में ही लिखिए।
3. काटे हुए या बदले हुए उत्तरों को अंक नहीं दिये जायेंगे।
1. प्रश्न क्रमांक 1 से 20 तक के उचित उत्तर का 'कैपिटल अक्षर' सामने दिये हुए कोष्टक में लिखिए।
20 x 1 = 20

1. बिजली की रोशनी रात के तम को दूर करती है। (रेखांकित शब्द का अर्थ पहचानिए।) ( )
A) दुपहर B) अंधेरा
C) प्रकाश D) उजाला
2. मोहन बड़ा परिश्रमी है। (रेखांकित शब्द का शब्द भेद पहचानिए।) ( )
A) संज्ञा B) क्रिया
C) विशेषण D) सर्वनाम
3. मेरे पास अरबी की अच्छी पुस्तक है। (रेखांकित शब्द का बहुवचन रूप है।) ( )
A) पुस्तक B) पुस्तकों
C) पुस्तकाएँ D) पुस्तकें
4. जंगल में लगी अग्नि से सारे पशु भयभीत हो गये। (रेखांकित शब्द का पर्याय पहचानिए।) ( )
A) आग B) पृथ्वी
C) आसमान D) बादल
5. पेड़ .... बंदर बैठा हुआ है। (रिक्त स्थान की पूर्ति उचित शब्द से कीजिए। ( )
A) के नीचे B) के अंदर
C) में D) बीच
6. अशुद्ध वर्तनी वाला शब्द पहचानिए। ( )
A) आत्मनिर्भरता B) आँचल
C) भेद D) दृश्य
7. उसका मन गदगद होगया। ('गदगद होना' इस मुहावरे का अर्थ पहचानिए।) ( )
A) आँसू बहाना B) रोना
C) अचरज में पडना D) अति प्रसन्न होना
8. 'जिस का कोई आकार न हो' - (इस का एक शब्द क्या है?) ( )
A) आकार B) साकार
C) निराकार D) प्राकार
9. एक हजार नौ सौ चौहत्तर - इसे अंकों में पहचानिए।
A) 1964 B) 1974 ( )
C) 1984 D) 1954
10. कश्मीर की सुंदरता देख कर मैं चकित रह गया। (इस वाक्य में भाववाचक संज्ञा पहचानिए।) ( )
A) कश्मीर B) सुंदरता
C) चकित D) रह गया
11. अरविंद दूध पीता है। - यह कौन सा काल है?( )
A) भूत B) भविष्यत
C) वर्तमान D) संदिग्ध वर्तमान
12. वह 'कुपुत्र' है। (रेखांकित शब्द में उपसर्ग पहचानिए।)
A) कु B) कुप C) त्र D) पुत्र ( )
13. इस में सोचने .... क्या बात है? (उचित कारक चिह्न से रिक्त स्थान की पूर्ति कीजिए।) ( )
A) का B) के C) को D) की
14. इन में से पुनरिक्त शब्द का सही उदाहरण है।( )
A) माता-पिता B) साथ-साथ
C) लग-भग D) दिन-रात
15. जंगलों में विविध प्रकार के पशु-पक्षी रहते हैं। (रेखांकित शब्द का समास पहचानिए।) ( )
A) द्विगु B) द्वंद्व
C) कर्मधारय D) अव्ययी भाव
16. लक्ष्मीबाई ने बडी वीरता से लडी। (इस वाक्य में रेखांकित शब्द का प्रत्यय पहचानिए।) ( )
A) वी B) वीर C) ता D) रता
17. महोदय! सादार प्रणाम। (रेखांकित शब्द का स्त्री लिंग रूप पहचानिए।) ( )
A) महोदया B) महोदयी
C) महोदयनी D) महोदायिन
18. आचार्य विनोबा भावे अत्यंत साधु पुरुष थे। (रेखांकित शब्द का संधि विच्छेद पहचानिए।) ( )
A) अ+अंत B) अति+अंत
C) अत्य+अंत D) अत्यं+अंत
19.मैं अणे बढ़ गया और वह पीछे रहा गया। (रचना के आधार पर वाक्य भेद पहचानिए।) ( )
A) मिश्र वाक्य B) सुंयक्त वाक्य
C) सरल वाक्य D) शिथिल वाक्य
20. गोदावरी बड़ी विशाल नदी है। (रेखांकित शब्द का विलोम पहचानिए।) ( )
A) संकीर्ण B) लंबा C) चौडा D) बड़ा

★

Part- B - Answers

1.B	2.C	3. D	4.A
5.A	6. A	7.D	8.C
9.B	10.B	11.C	12.A
13.D	14.B	15. B	16.C
17.A	18.B	19. B	20.A

TELUGU PAPER-II

S.S.C. MODEL PAPER

ప్రథమ భాష

(PART-A&B)

Time: 2.45 Hours - Max Marks: 40

విద్యార్థులకు సూచనలు:

1. పార్టు - 'ఎ' ప్రశ్నలకు సమాధాన పత్రంలో జవాబులు రాయాలి.
2. పార్టు - 'బి' ప్రశ్నలకు ప్రశ్నాపత్రములోనే జవాబులు రాసి, సమాధాన పత్రానికి జతచేయాలి.
3. మొదటి 15 నిమిషాలు ప్రశ్నాపత్రం చదువుకోవడానికి వినియోగించాలి.
4. ప్రతి ప్రశ్నకు కోరిన విధంగా జవాబులు రాయాలి. అంతర్గత ఎంపిక వ్యాసరూప ప్రశ్నలకు మాత్రమే అని గమనించాలి.

పార్ట్ -ఎ

I. అవగాహన - ప్రతిస్పందన : (12 మార్కులు)

అ) 1. క్రింది పద్యాలలో ఒక దానికి ప్రతి పదార్థం రాయండి. 1X4=4

నీరము తప్తలోహమున నిల్చి యనామకమై నశించు నా
నీరము ముత్యమట్లు నళినీదళ సంస్థితమై తనర్చు నా
నీరమె శుక్తి లోఁబడి మణిత్వము గాంచు సమంచిత ప్రభన్
పౌరుష వృత్తులిట్లధము మధ్యము నుత్తము గొల్చు వారికిన్.

(లేదా)

వడిగొని జేకులుప్పతిల వాలిన కేసరముల్ దలిర్పఁబు
ష్పొడి దలమెక్కి తేనియలు పొంగి తరంగలుఁగా ఁజెలంగిపైఁ
బడు నెలదేఁటి దాఁటులకుఁ బండువులై నవ సౌరభంబులు
గ్గడువుగ నుల్లసిల్లె ఘనకైరవపుండము నిండు వెన్నెలన్.

ఆ) 2. కింది పద్యాలలో ఒక దానికి పాద భంగం లేకుండా పూరించి, భావాన్ని రాయండి. 1X4=4

శివ రాజంతట మేల్మొనుంగుఁదెరలో.............మాతా! తప్పు సైరింపుమీ!

(లేదా)

తన దేశంబు స్వభాష నైజమతమున్ ....దేవా! భక్త చింతామణీ!

ఇ) కింది గద్యమును చదివి ప్రశ్నలకు జవాబులు రాయండి. 1X4=4

చదువుకొన్న వాళ్ళంతా తమ కష్టఫలాన్ని తింటూ పట్నాలలో సౌఖ్యాలు అనుభవిస్తూ, కులుకుతూ ఉండటం చూసి పల్లెటూళ్ళు కన్నీరు నిడుస్తున్నవి. గ్రామోద్ధరణం అంటూ పత్రికల్లో రాసుకొంటే పని కాదు. ఉపన్యాసాలిస్తే పని కాదు. రోడ్ల వెంట మోటారు కార్లలో నాలుగు సార్లు తిరిగి నాలుగు వందల భత్యాలు కొడితే పనికాదు. అవన్నీ రూపాయిని పదహారు చేత గుణించినట్లే వ్యర్థాలు. కాగితం మీద కోట్లు కోట్లు సంఖ్యలు వేసుకొని ఇంత ధనం ఉంది నాకు అని సంతోషించడం ఎట్లో అవన్నీ అట్లే. ఈ ఊహా ఆ క్షణంలో తట్టింది నాకు. ఆశ్చర్యం కలిగింది. ప్రజా సముదాయం కోరే ప్రత్యక్షఫలం ఆడంబరం కాదు.

ప్రశ్నలు:
3) పల్లెటూళ్ళు కన్నీరు కార్చడానికి కారణం ఏమిటి?
4) ఏయే పనుల వల్ల 'గ్రామోద్ధరణ' కల నెరవేరదు?
5) 'గ్రామోద్ధరణం' పేరుతో చేసే పనులను రచయిత దేనితో పోల్చాడు?
6) రచయిత చేసిన ఏ ఊహ ఆశ్చర్యాన్ని కలిగించింది?

II స్వీయ రచన (8 మార్కులు)

ఈ) క్రింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాల్లో సమాధానాలు రాయండి 4X2=8

7) 'ధన్యుడు' – పాత్య బాగ రచయితను గురించి రాయండి
8) 'ప్రబంధం' – ప్రక్రియను వివరించండి.
9) శివాజీ యవనకాంత పట్ల చూపిన ఆదరాభిమానాలు ఎలాంటివి?
10) గోరంత దీపాలు కథలో కుర్రవాడు కృతజ్ఞతను ఎలా చూపాడు?

ఉ) క్రింది ప్రశ్నలకు పది (లేక) పన్నెండు వాక్యాల్లో సమాధానాలు రాయండి. 5X2=10

11) భిక్ష పాఠం ఆధారంగా వ్యాసుని పాత్ర స్వభావాన్ని వివరించండి?

(లేదా)

'మాణిక్యవీణ' కవితలో మానవ జీవన ప్రస్థానాన్ని కవి ఎలా విశేషించాడు.

12) రాజధానిగా అమరావతి గొప్పతనాన్ని గురించి రాయండి.

(లేదా)

శిశువుల పెంపకంలో పక్షులు – మానవులకు మధ్యన ఉన్న పోలికల్ని తెల్పండి?

పార్ట్ -బి

విద్యార్థులకు సూచనలు: (10 మార్కులు)
1) ఇచ్చిన ప్రశ్నలకు తగిన జవాబులను బ్రాకెట్లలో గుర్తించండి.
2) పార్టు-'బి' కి సంబంధించిన సమాధానాలు ఈ ప్రశ్నా ప్రతంలోనే రాసి, పార్టు-ఎ సమాధాన పత్రాన్ని జతచేసి ఇవ్వవలెను.
20X1/2=10

1. అవుపాలు లేని పండుగ దండగ ( )
(గీత గీసిన పదానికి అర్థం గుర్తించండి)
1. పిండి వంటలు 2. గారెలు
3. అరిసెలు 4. పూజలు

2. ముత్తైదువకు సూడిగములు ప్రాణ సమములు ( )
(గీత గీసిన పదానికి అర్థం గుర్తించండి)
1. పూలు 2. గాజులు
3. మెట్టెలు 4. మంగళ సూత్రాలు

3. తెగువ నేర్చిన మగువలు పుట్టినిల్లు భారత భూమి. ( )
(గీత గీచిన పదానికి పర్యాయ పదాలు గుర్తించండి)
1. స్త్రీ, వీరుడు 2. కొమ్మ, రెమ్మ
3. సాధ్వి, శక్తి 4. పడతి, ఇంతి

4. అజ్ఞానపు తమస్సు నుంచి విజ్ఞానపు వెలుగులోకి ప్రయాణం విద్య ( )
(గీత గీసిన పదానికి పర్యాయ పదాలు గుర్తించండి)
1. తామర - అంధ్యము 2. పద్మం - రాత్రి
3. ఇరులు - కాంతి 4. చీకటి - తమము.

5. సర్వమూ వదిలి వేసిన వాడు. ( )
(వ్యుత్పత్త్యర్థం గుర్తించండి)
1. ఋషి 2. ముని
3. సన్యాసి 4. తాపసి

6. గృహాన్ని ధరించేది. ( )
(వ్యుత్పత్త్యర్థం గుర్తించండి)
1. ఇంతి 2. మగువ
3. పురంధ్రి 4. పతివ్రత.

7. ఉత్తరాన హిమాలయాలు భారతదేశానికి పెట్టని గోడ వంటివి
(గీత గీచిన పదానికి ప్రకృతిని గుర్తించండి) ( )
1. కుడ్యము 2. కుడ్డెము
3. కుడ్య 4. కుడెము

8. రాముని కాలవగ భాగ్యము కలుగు ( )
(గీత గీసిన పదానికి వికృతిని గుర్తించండి)
1. భాగ్గెం 2. భాగము
3. బాగ్గెం 4. బాగము

9. బుద్ధి కుశలతలో ఉపాధ్యాయుడు బృహస్పతి సమానుడై ఉండాలి ( )
(గీత గీసిన పదాలకు నానార్ధ పదం గుర్తించండి)
1. గురువు 2. ఆచార్యుడు
3. అర్చకుడు 4. మేధావి

10. వింటి నారి స్వభావం తెలిసిన వాడే విలుకాడు ( )
(గీత గీసిన పదాలకు నానార్ధ పదం గుర్తించండి)
1. శీలం 2. కులం
3. గుణం 4. గోత్రం

11. 'పల్లెటూళ్ళు' ప్రశాంత జీవిత సౌఖ్యానికి పుట్టినిళ్ళు( )
(గీత గీసిన పదం ఏ సంధి)
1. ఉకార సంధి 2. టుగాగమ సంధి
3. సరళాదేశ సంధి 4. సవర్ణదీర్ఘ సంధి

12. 'అణ్వాయుధాలు' ప్రపంచ శాంతికి అడ్డుగోడలు ( )
(గీత గీసిన పదాన్ని విడదీయండి)
1. అణ్వా + ఆయుధాలు 2. అణ్వ + ఆయుధాలు
3. అణు + ఆయుధాలు 4. అణ్వు + ఆయుధాలు

13. 'రామ బాణము' నకు సాటిరాగల అస్త్రము మరొకటి లేదు
(గీత గీసిన పదం ఏ సమాసం) ( )
1. పంచమీ తత్పురుష సమాసం
2. షష్ఠీ తత్పురుష సమాసం
3. ద్వితీయాతత్పురుష సమాసం
4. బహువ్రీహి సమాసం

14. 'బాలుర నుండి గోపాలుర వరకు' దేశ మాతను పూజించాలి
(గీత గీసిన విగ్రహ వాక్యానికి సమాస పదం గుర్తించండి)
1. బాల గోపాలుడ 2. గోపాల బాలుడు ( )
3. ఆ బాల గోపాలం 4. ఆబాల గోపాలురు.

15. 'స - భ - ర - న - మ - య - వ' గణాలు ఏ పద్య పాదానికి చెందినది ( )
1. శార్దూలం 2. ఆట వెలది
3. మత్తేభం 4. చంపకమాల

16. 'వేద పురాణ శాస్త్ర పదవీ నదవీ యసియైన పెద్దము'
(ఏ పద్య పాదమో గుర్తించండి) ( )
1. తేటగీతి 2. ఉత్పలమాల
3. ద్విపద 4. మత్తేభం

17. దెసలను కొమ్ములొయ్య సతి దీర్ఘము లైన కరంబులన్ బ్రియం
(పద్య పాదంలో గీత గీసిన పదం ఏ గణమో గుర్తించండి)
1. 'న' గణం 2. 'య' గణం ( )
3.'మ' గణం 4. 'భ' గణం

18. 'అమందానంద కందళిత హృదయార విందం' ( )
(పై వాక్యంలోని అలంకారాన్ని గుర్తించండి)
1. ఛేకాను ప్రాసం 2. యమకం
3. ఉపమాలంకారం 4. వృత్యనుప్రాసం

19. 'ఉపమేయాన్ని ఉపమానంగా ఊహించడం' ఏ అలంకార లక్షణం ( )
1. ఉపమాలంకారం 2. రూపకాలంకారం
3. ఉత్ప్రేక్షాలంకారం 4. అతిశయోక్తి

20. 'అర్థము సమాన పదము నందు కాకుండా వేరొకచోట ఉండుట' ( )
(పై నిర్వచనం ఏ సమాన లక్షణం)
1. అవ్యయీభావ సమాసం
2. ద్విగు సమాసం
3. బహువ్రీహి సమాసం
4. ద్వంద్వ సమాసం.

పార్టు-బి జవాబులు

1.	(1)	పిండి వంటలు	2.	(2)	గాజులు
3.	(4)	పడతి, ఇంతి	4.	(4)	చీకటి, తమము
5.	(3)	సన్యాసి	6.	(3)	పురంధ్రి
7.	(1)	కుడ్యము	8.	(3)	బాగ్గెం
9.	(1)	గురువు	10.	(3)	గుణం
11.	(2)	టుగాగమసంధి	12.	(3)	అణు + ఆయుధాలు
13.	(2)	షష్ఠీ తత్పురుష సమాసం	14.	(3)	ఆబాలగోపాలం
15.	(3)	మత్తేభం	16.	(2)	ఉత్పలమాల
17.	(4)	'భ'గణం	18.	(4)	వృత్త్యనుప్రాసం
19.	(3)	ఉత్ప్రేక్షాలంకారం	20.	(3)	బహువ్రీహి

ఉద్యోగాలు

సీఐఎస్ఎఫ్‌లో 447 ఉద్యోగాలు

సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) 447 ఖాళీల భర్తీకి అర్హులైన పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు-ఖాళీలు: కానిస్టేబుల్/ డ్రైవర్–344, కానిస్టేబుల్/ డ్రైవర్ కమ్ పంప్ ఆపరేటర్–103.

వేతనశ్రేణి: రూ.21,700–రూ.69,100.

అర్హతలు: పదోతరగతి/ తత్సమాన విద్యతోపాటు డ్రైవింగ్ లైసెన్స్ (మోటార్ సైకిల్ విత్ గేర్, లైట్ మోటార్ వెహికల్, హెవీ మోటార్ వెహికల్/ ట్రాన్స్‌పోర్ట్ వెహికల్). అలాగే డ్రైవింగ్‌లో కనీసం మూడేళ్ల అనుభవం ఉండాలి.

శారీరక ప్రమాణాలు (ఫిజికల్ స్టాండర్డ్స్): జనరల్/ ఓబీసీ/ ఎస్సీ కేటగిరీకి ఎత్తు–167 సెం.మీ., ఛాతీ–80 సెం.మీ. (సాధారణం)–85 సెం.మీ. (గాలి పీల్చినపుడు), ఎస్టీ కేటగిరీకి ఎత్తు–160 సెం.మీ., ఛాతీ–76 సెం.మీ. (సాధారణం)–81 సెం.మీ. (గాలి పీల్చినపుడు).

మెడికల్ స్టాండర్డ్స్ (ఆరోగ్య ప్రమాణాలు): బరువు–ఎత్తు, వయసుకు అనుగుణంగా ఉండాలి. దృష్టి సామర్థ్యం–నియర్ విజన్ ఎన్6, ఎన్6, డిస్టెన్స్ విజన్ 6/6, 6/6. కలర్ బ్లైండ్‌నెస్ ఉండకూడదు. అలాగే నిబంధనల మేర తగిన శారీరక, మానసిక ఆరోగ్యం, దృఢత్వం ఉండాలి. టాటూ (పచ్చబొట్లు) ఉండకూడదు.

వయసు: 21–27 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.

ఎంపిక: రాతపరీక్ష, ఫిజికల్ ఎఫీషియెన్సీ టెస్ట్ (పీఈటీ), ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్ (పీఎస్‌టీ), డాక్యుమెంటేషన్, ట్రేడ్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్.

రాతపరీక్ష విధానం: దీన్ని ఆబ్జెక్టివ్ విధానంలో 100 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో జనరల్ అవేర్‌నెస్/ జనరల్ నాలెడ్జ్, నాలెడ్జ్ ఆఫ్ ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్, అనలిటికల్ ఆప్టిట్యూడ్, ఎబిలిటీ టు అబ్జర్వ్ అండ్ డిస్టింగ్విష్, బేసిక్ ఇంగ్లీష్/ హిందీ నాలెడ్జ్ (పదో తరగతి స్థాయి) అంశాల నుంచి 100 ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష వ్యవధి రెండు గంటలు. ఇందులో జనరల్/ మాజీ సైనికోద్యోగ కేటగిరీలకు 35 శాతం, ఎస్సీ/ ఎస్టీ/ ఓబీసీకి 33 శాతం మార్కులు రావాలి.

దేహ దారుఢ్య పరీక్ష (ఫిజికల్ ఎఫీషియెన్సీ టెస్ట్: పీఎస్‌టీ): ఇందులో పరుగు–800 మీటర్ల దూరాన్ని 3 నిమిషాల 15 సెకన్లలో పరిగెత్తగాలి. లాంగ్ జంప్–11 అడుగుల దూరాన్ని 3 ప్రయత్నాల్లో, హై జంప్–3 అడుగుల 6 అంగుళాలను 3 ప్రయత్నాల్లోపు అధిగమించాలి.

ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్ (పీఎస్‌టీ): హైట్ బార్, పీఈటీలో ఉత్తీర్ణులైన అభ్యర్థులను దీనికి ఎంపిక చేస్తారు. ఇందులో అభ్యర్థుల శారీరక ప్రమాణాలను పరిశీలిస్తారు. నిబంధనలకు అనుగుణంగా ఉన్నవారిని డాక్యుమెంటేషన్‌కు ఎంపిక చేస్తారు.

డాక్యుమెంటేషన్: ఇందులో అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలించి ట్రేడ్ టెస్ట్‌కు ఎంపిక చేస్తారు.

ట్రేడ్ టెస్ట్ (డ్రైవింగ్ టెస్ట్): ఇందులో అభ్యర్థుల డ్రైవింగ్ సామర్థ్యంపై పరీక్షలు ఉంటాయి. లైట్ వెహికల్, హెవీ వెహికల్ డ్రైవింగ్, మోటార్ మెకానికజమ్, వెహికల్ రిపెయిర్ నైపుణ్యాలను పరీక్షిస్తారు. మొత్తం 130 మార్కులకు దీన్ని నిర్వహిస్తారు. ఇందులోనూ ఉత్తీర్ణులైన అభ్యర్థుల మెరిట్ జాబితా ఆధారంగా మెడికల్ ఎగ్జామినేషన్ నిర్వహించి తుది ఎంపిక నిర్వహిస్తారు.

దరఖాస్తు ఫీజు: జనరల్/ ఓబీసీ–రూ.100, మిగిలిన కేటగిరీలకు ఫీజు లేదు.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.

దరఖాస్తు చివరి తేదీ: మార్చి 19, 2018.

పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు

వెబ్‌సైట్: cisfrectt.in

తాగునీటి కోసం మహిళల ఆందోళన

ప్రజాశక్తి-సీతమ్మధార, విశాఖ

ఎన్నో ఏళ్లుగా తాము తాగునీటి కోసం పడుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ మహిళలు రోడ్డెక్కారు. ఆదివారం విశాఖ నగరంలోని అక్కయ్యపాలెం జగ్గారావు బ్రిడ్జి వద్ద జివిఎంసి 32వ వార్డుకు చెందిన మహిళలు రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. ఐదు నెలలుగా తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నామని వారు వాపోయారు. కనీసం బోర్లు కూడా పని చేయడం లేదని, వేసవి పేరుతో జివిఎంసి నీటి సరఫరాను 20 నిమిషాలకు మాత్రమే పరిమితం చేశారని, అవి ఎటూ సరిపోవడం లేదని వ్యాఖ్యానించారు. మహిళల నిరసనతో ట్రాఫిక్ స్తంభించింది.

ఖాళీ బిందెలతో నిరసన



తాగునీటి కోసం విశాఖలోని అక్కయ్యపాలెం బ్రిడ్జి వద్ద రోడ్డుపై బైఠాయించి ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

విగ్రహాల ధ్వంసం అమానుషం

కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నటరాజ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో/విజయవాడ

వర్గ, సామాజిక తత్వవేత్తలు, ప్రపంచ మేథావులు అయిన లెనిన్, అంబేద్కర్, పెరియార్‌ల విగ్రహాల్ని ధ్వంసం చేయడం అమానుషమని కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె నటరాజ్ విమర్శించారు. విగ్రహాల ధ్వంసానికి వ్యతిరేకంగా ఆదివారం కెవిపిఎస్, దళిత సంఘాల ఆధ్వర్యంలో విజయవాడలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నటరాజ్ మాట్లాడుతూ బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు మతోన్మాదంతో రెచ్చిపోతున్నాయని ధ్వజమెత్తారు. ఫ్యూడల్, పెట్టుబడిదారి వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేసి, శ్రామికుల రాజ్యం కోసం లెనిన్ కలలుగన్నారన్నారు. కులం, మతం పునాదులపై ఒక జాతిని, నీతిని నిర్మించడం అసాధ్యమని అంబేద్కర్ చెప్పారన్నారు. దేవుని ఆరాధనకు తరగతుల వారీగా ఫాసిస్టులు నియమించిన హద్దుల్ని పెరియార్ చెరిపేశారన్నారు. అటువంటి గొప్ప అభ్యుదయవాదుల విగ్రహాల్ని కూల్చడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు అభివృద్ధి నిరోధకులన్నారు. దేశంలో అశాంతిని రేపుతూ, ప్రజల మధ్య కలహాలు సృష్టిస్తూ అల్లకల్లోలం చేస్తున్నారన్నారు. ఈ అరాచకాల్ని అరికట్టడానికి ప్రజలందరూ నడుం బిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు జి క్రాంతి కుమార్, నాగరాజు, ఉపాధ్యాయ సంఘం నాయకులు జి కిరణ్ కుమార్, రైల్వే ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘం నేతలు కె రమేష్, సుకుమార్, కోటేశ్వరరావు, దళిత నాయకులు జి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'హోదా' కోసం మానవహారం

ప్రజాశక్తి- యంత్రాంగం

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాపంగా ఆందోళన కార్యక్రమాలు ఆదివారం కూడా కొనసాగాయి. అనంతపురంలో విన్నూత రీతిలో నిరసన తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం పాతూరులో అఖిలపక్షం ఆధ్వర్యంలో దీక్ష చేపట్టారు. గుంటూరులో కమ్మజన సేవాసమితి హాస్టల్ విద్యార్థినులు ప్రదర్శన, లక్ష్మీపురంలోని మదర్ థెరిస్సా విగ్రహం వద్ద మానవహారం నిర్వహించారు. ఉప రాష్ట్రపతి పదవికి వెంకయ్యనాయుడు తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా సాధన జెఎసి ఆధ్వర్యాన విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జెఎసి కన్వీనర్ టి.శ్రీరామ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఐదేళ్లు కాదు... పదేళ్లు ఇవ్వాలని విభజన సమయంలో రాజ్యసభలో డిమాండ్ చేసిన బిజెపి నేత ఎం.వెంకయ్యనాయుడు ఆ తర్వాత మాట మార్చి ఎపి ప్రజలను మోసగించారని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అనంతపురం జిల్లాలో సిపిఎం చేపట్టిన బస్సుయాత్ర నాల్గో రోజూ కొనసాగింది. రాయదుర్గంలో సిపిఎం రాయలసీమ సబ్‌కమిటీ కన్వీనర్ జి.ఓబులు మాట్లాడుతూ ప్రత్యేక హోదా అంశాన్ని పక్కదోవ పట్టించేందుకు కేంద్రంలో టిడిపి, రాష్ట్రంలో బిజెపి మంత్రులు రాజీనామాలు చేశారని విమర్శించారు. టిడిపి, బిజెపి నాయకులకు చిత్తశుద్ధి ఉంటే ప్రత్యేక హోదా కోసం ప్రజలతో కలసి పోరాడాలన్నారు. ఈ యాత్రలో సిపిఎం ఉత్తర ప్రాంత జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ పాల్గొన్నారు. హోదాపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును నిరసిస్తూ అనంతపురం జిల్లా కేంద్రంలో లోక్‌సత్తా పార్టీ యువజన విభాగం నాయకులు అమర్‌యాదవ్ గుండు గీయించుకుని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. కర్నూలు జిల్లాలో సిపిఎం చేపట్టిన జీపుజాతా నాలుగో రోజూ కొనసాగింది. ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో నిర్వహించిన జీపుజాతాలో సిపిఎం పశ్చిమ ప్రాంత కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



గుంటూరులో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థినులు



అనంతపురం జిల్లా రాయదుర్గంలో బస్సుయాత్రలో మాట్లాడుతున్న సిపిఎం రాయలసీమ సబ్‌కమిటీ కన్వీనర్ జి.ఓబులు

పోరాటం ఉధృతం చేస్తాం : డాక్టర్ గంగారావు

ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం పోరాటాన్ని ఉధృతం చేస్తామని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ బి.గంగారావు అన్నారు. అనకాపల్లిలోని కార్మిక, కర్షక నిలయంలో ఆదివారం జరిగిన సిపిఎం విశాఖ జిల్లా ప్లీనం సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర విభజన చట్టంలోని అంశాలను, ఎన్నికల సమయంలో బిజెపి ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. విభజన హామీలు అమలైతే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, అందుకోసం ప్రతి పౌరుడు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. ఉభయ ప్రభుత్వాల పాలనలో రైతుల ఆత్మహత్యలు పెరిగిపోయాయన్నారు. మరో పక్క పరిశ్రమలు గణనీయమైన సంఖ్యలో మూత పడడం ద్వారా కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏప్రిల్‌లో హైదారాబాద్‌లో జరగనున్న సిపిఎం అఖిల భారత మహాసభలు సందర్భంగా ప్రభుత్వాల మోసాలపైనా, సిపిఎం ప్రత్యామ్నాయ విధానాలపైనా నెల రోజుల పాటు ప్రచారోద్యమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు, బి.ప్రభావతి, డి.వెంకన్న, ఎం.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కోసం పోరాడాలి

సిఐటియు రాష్ట్ర నాయకులు కె.ధనలక్ష్మి

ప్రజాశక్తి - కావలి (నెల్లూరు)

కార్మిక వర్గం తమ హక్కులను కాపాడుకొంటూ, ఉద్యోగ భద్రత కోసం పోరాడాలని సిఐటియు రాష్ట్ర నాయకులు కె.ధనలక్ష్మి పిలుపు నిచ్చారు. నెల్లూరు జిల్లా కావలిలో ఆదివారం సిఐటియు కార్యాలయంలో వి.మల్లికార్జునరావు అధ్యక్షతన పట్టణంలోని కార్మిక సంఘాల జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బడ్జెట్‌లో వాటా సాధించి, మెరుగైన జీతాలు పొంది, పి.ఎఫ్, ఇ.ఎస్.ఐ.సౌకర్యాలతో పాటు రిటైర్‌మెంట్ పెన్షన్ సౌకర్యాలు పొందాలంటే రాష్ట్రానికి ప్రత్యేకహోదా అవసరమన్నారు. హామీలు అమలు చేసేందుకోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ కావలిలో ఎక్కడాలేని విధంగా పట్టణంలో ప్రైవేటు సంస్థకు టెండర్లు ఇవ్వటాన్ని సిఐటియు తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. కార్మికుల జీతాలను కాంట్రాక్టర్లకు అప్పగించే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం మానుకోవాలన్నారు. ఈ విధానానికి వ్యతిరేకంగా 2 సంవత్సరాల నుండి రాష్ట్ర యూనియన్ పోరాడుతున్నదన్నారు. దీనితో పాటు ఒప్పందం జరిగన 151జిఒను వెంటనే అమలు చేయాలన్నారు. వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.

వ్యవసాయ కార్మికులందరికీ 'ఉపాధి' కల్పించాల్సిందే : వ్యకాస

- 21న చలో అసెంబ్లీ

ప్రజాశక్తి- పార్వతీపురం (విజయనగరం జిల్లా)



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

అన్ని గ్రామాల్లో వ్యవసాయ కూలీలందరికీ పనులు కల్పించాలని, పనిచేసిన చోటే మధ్యాహ్న భోజనం అమలు చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. విజయనగరం జిల్లా పార్వపురంలోని సుందరయ్య భవనంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి పనులు కల్పించకపోవడంతో గ్రామాల నుంచి లక్షలాది మంది కూలీలు వలసపోతున్నారని తెలిపారు. వలసల నివారణకు తీసుకొచ్చిన ఉపాధి చట్టాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. వేతనాలను సకాలంలో చెల్లించకపోవడంతో కూలీలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రతి కుటుంబానికీ 200 రోజులు పనులు కల్పించాలని, రోజుకు రూ.500 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. చేసిన పనులకు వారం రోజుల్లో పోస్టాఫీసుల ద్వారా బిల్లులు చెల్లించాలని కోరారు. రెండు పూటలా పనులు చేయించే ఆలోచన మానుకోవాలనన్నారు. సమ్మర్ అలవెన్స్ 50 శాతం కలపాలని, ప్రసూతి మహిళలకు 90 రోజుల పని దినాలకు ఉచితంగా వేతనాలు ఇవ్వాలని, చిన్న, సన్నకారు రైతులు, దళిత, గిరిజనుల భూములను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదం, వడదెబ్బకు ఉపాధి కూలీ మృతి చెందితే కుటుంబానికి రూ.పది లక్షల నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఈ డిమాండ్ల సాధనకు ఈ నెల 21న తలపెట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీరామ్మూర్తి అధ్యక్షత వహించారు.

రాష్ట్రానికి బిజెపి, టిడిపి ద్రోహం : రఘువీరారెడ్డి

ప్రజాశక్తి-మాచర్ల (గుంటూరు)

ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్రానికి ద్రోహం చేసింది బిజెపి, టిడిపిలేనని, వాటిని కోర్టు ముందు నిలబెడతామని పిసిసి అధ్యక్షులు రఘువీరారెడ్డి అన్నారు. గుంటూరు జిల్లా మాచర్లకు ఆదివారం వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. విభజన హామీలు, హోదా విషయం ప్రజల అజెండాగా మారాయని, ప్రజలు ఓట్లేయాలంటే ఆ సమస్య పరిష్కారం చేయాల్సిందేనని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు బిజెపికి ఉరి శిక్ష వేస్తారని, టిడిపి, వైసిపిలు వారి విధానాలను నిర్ణయించుకోవాలన్నారు. రాష్ట్రపతి ఎన్నికలప్పుడే ఆ రెండు పార్టీలు హోదా డిమాండ్‌ను ప్రధాని ముందు ఉంచాల్సిందన్నారు. ఈ నేపథ్యంలో టిడిపి, వైసిపి, బిజెపికి వ్యతిరేకంగా ప్రజలు ఏకతాటిపైకి రావాలన్నారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యేలు పిన్నెల్లి లక్ష్మారెడ్డి, యర్రం వెంకటేశ్వరరెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మక్కెన మల్లికార్జునరావు ఉన్నారు.

తక్షణమే సామాజిక రక్షణ చట్టం

తెలంగాణా ఎంబిసి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఆశయ్య డిమాండ్

ప్రజాశక్తి - గాంధీనగర్ (విజయవాడ)

రజక సంక్షేమ ఫెడరేషన్‌కు రూ.వెయ్యి కోట్లు కేటాయించి, యుద్ధ ప్రాతిపదికన ఖర్చు చేయాలని తెలంగాణ ఎంబిసి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఆశయ్య అన్నారు. రజకుల సమస్యలు పరిష్కారం కోరుతూ విజయవాడ ధర్నా చౌక్ వద్ద ఎపి రజక వృత్తిదారుల సంఘం తలపెట్టిన 72 గంటల నిరాహార దీక్ష ఆదివారానికి రెండో రోజుకు చేరింది. దీక్షలకు మద్దతు తెలిపిన ఆశయ్య మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 5 శాతం ఉన్న రజక వృత్తిదార్ల ఓట్లతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు వృత్తిదార్ల పట్ల వివక్ష చూపించడం విచారకరమన్నారు. చంద్రబాబు జిల్లాలో రజక వృత్తిదార్లపై ఉన్నత వర్గాలు దాడులు చేస్తున్నా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తక్షణమే సామాజిక రక్షణ కల్పిస్తూ చట్టం చేయాలన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న దోబీ పోస్టులను భర్తీ చేయాలని, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేశారు.. 50 ఏళ్ల వయసు నిండిన వృత్తిదార్లకు పింఛన్ మంజూరు చేయాలనీ, వృత్తిదార్ల పిల్లలకు రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో ఉచిత విద్యనందించాలనీ డిమాండ్ చేశారు. . జీఓ 343, 6 లను అమలు చేసి అన్నివిధాలా ఆదుకోవాలన్నారు. అర్హులైన వృత్తిదార్లకు ఇళ్ల స్థలాలు కేటాయించి గృహ నిర్మాణం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సి.గురు శేఖర్, అధ్యక్షుడు ఎం.భాస్కరరావు, కె.శ్రీనివాసరావు, వి.వెంకటేశ్వరరావు, ఎం.రాజు తదితరులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరం వద్ద మాట్లాడుతున్న ఆశయ్య

ఇళ్ల నిర్మాణ సమస్యపై సిపిఎం పాదయాత్ర



విశాఖలో పాదయాత్ర చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- గాజువాక, విశాఖ

గాజువాక హౌస్ కమిటీ సమస్యను పరిష్కరించాలంటూ సిపిఎం ఆధ్వర్యాన జివిఎంసి 63వ వార్డు అజమాబాద్ నుంచి ఆదివారం పాదయాత్ర ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం నగర కార్యదర్శి డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ గాజువాక ఇనాం భూ బాధితులకు ప్రభుత్వమిచ్చిన పట్టాల్లోని షరతులను తక్షణం తొలగించాలని డిమాండ్ చేశారు. సమస్య తీవ్రతతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు నోరు మెదపకపోవడం దారుణమన్నారు. ఐదేళ్ల వరకూ క్రయ, విక్రయాలకు అవకాశం లేదని, అవసరమైతే పట్టాను రద్దు చేసే అవకాశముందని ప్రభుత్వం పేర్కొనడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ నిబంధనల ఫలితంగా జివిఎంసి అధికారులు గృహ నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎన్.రాజేంద్ర ప్రసాద్, జి.సుబ్బారావు, రాంబాబు పాల్గొన్నారు.

ప్రజ్ఞ

జవాబులు

1.వికాస్ కృష్ణన్, 2.సిరిల్ రామా ఫోసా
3.12వ స్థానం, 4.ముంబయి
5.లూనార్ హెబిటేట్స్

అతిసార

ఇంకా అదుపులోకి రాని అతిసార

- 200 మందికి పైగా చికిత్స
- పలు కాలనీల్లో ఆగిన పల్స్‌పోలియో

ప్రజాశక్తి- గుంటూరు సిటీ ప్రతినిధి

గుంటూరులో అతిసార వ్యాధి ఇంకా పూర్తి స్థాయిలో అదుపులోకి రాలేదు. ప్రస్తుతం నగరంలోని ఫీవర్ ఆసుపత్రిలో ఆరుగురు, రమేష్ ఆసుపత్రిలో 15 మంది, జిజిహెచ్‌లో 99 మంది, వీరేగాక పలు ఆసుపత్రుల్లోనూ పది మెడికల్ క్యాంపుల్లోనూ చికిత్స పొందుతున్నారు. మొత్తం మీద 200 మందికి పైగానే అతిసార వ్యాధికి చికిత్స పొందుతున్నారు.

నీటి కోసం పాట్లు

అతిసార ప్రబలిన ప్రాంతాల్లో సూపర్ క్లోరినేషన్ పనుల దృష్ట్యా తాగునీటి సరఫరాను అధికారులు నిలిపేయడంతో నగర ప్రజలు నీటికోసం ఇబ్బందులు పడ్డారు.

ఆనందపేట, ముగ్దుం నగర్, గొలుసు కొండలరావు నగర్, విజయశాంతి నగర్, లాంచెస్టర్ రోడ్డు, ఎల్ఆర్ కాలనీ, ఇందిరా ప్రియదర్శిని కాలనీ, చంద్రబాబు నాయుడు కాలనీ, వర్కర్స్ కాలనీ వాసులు శనివారం రాత్రంతా నీటి కోసం పడిగాపులుకాశారు. కొన్ని ట్యాంకర్లను వేడుకలకు, రాజకీయనేతల అనుచరగణానికి తరలించినట్లు ఆరోపణలొస్తున్నాయి.



గుంటూరు జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న అతిసార బాధితులు

పల్స్ పోలియో వాయిదా

గుంటూరులో పలువార్డుల్లో ఆదివారం రెండో విడత పల్స్‌పోలియోను వాయిదా వేశారు. పాత గుంటూరులోని 3 నుంచి 17 వార్డులు, 51, 52 వార్డుల్లో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశారు. ఈ నెలలో మరో తేదీన పల్స్‌పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తామని అధికారులు మైకుల ద్వారా ప్రచారం చేశారు. తగినంత సిబ్బంది లేకపోవటం, అతిసార వ్యాధి తగ్గుముఖం పట్టకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

సంక్షిప్తం

2019 నాటికి పోలవరం పూర్తి కాదు

మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ

ప్రజాశక్తి- అనకాపల్లిటౌన్(విశాఖపట్నం)

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు వల్ల 2019 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యే అవకాశం లేదని మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ అన్నారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం ప్రభుత్వం ఇప్పటివరకు రూ.500 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ ప్రాజెక్టుకు గత రాష్ట్ర ప్రభుత్వం రూ.5,500 కోట్లు ఖర్చు చేయగా, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం 6,598 కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. ఎన్నికల ముందు బిజెపి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా రాష్ట్రానికి ప్రత్యేకహోదా, విశాఖకు రైల్వేజోన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైల్వేజోన్ ఇవ్వడానికి ఒడిశాతో రాష్ట్రంతో ఇబ్బందులు ఉన్నాయని కేంద్రం చెప్పడం హాస్యాస్పదమన్నారు. దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం అన్యాయం చేస్తుందని విమర్శించారు. సోమవారం నుండి ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాల్లో టిడిపి, వైసిపి, కాంగ్రెస్ పార్టీలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టి అన్ని పార్టీల మద్దతు కూడగొట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వలసల నివారణకు వెలుగొండ ప్రాజెక్టే శరణ్యం

ప్రజాశక్తి-కనిగిరి(ప్రకాశం)


వలసల నివారణకు వెలుగొండ ప్రాజెక్ట్ పూర్తి కావటమొక్కటే శరణ్యమని సిపిఎం కనిగిరి ప్రాంతీయ కార్యదర్శి పీసీ.కేశవరావు తెలియజేశారు. వెలుగొండ ప్రాజెక్ట్‌కు రూ.1500 కోట్ల నిధులు కేటాయించాలని రెండోరోజైన ఆదివారం స్థానిక పులివెంకటరెడ్డి పార్కు వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షలకు సిపిఎం కనిగిరి ప్రాంతీయ కమిటీ నాయకులు పిల్లి తిప్పారెడ్డి అధ్యక్షత వహించారు. దీక్షలను నాయకులు ఎస్.అచ్చిరెడ్డి నిమ్మరసం ఇచ్చి, విరమింపజేశారు.

సమస్య పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం

బైక్ ర్యాలీలో జూడాల హెచ్చరిక

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

తమ సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని జూనియర్ డాక్టర్ సంఘం హెచ్చరించింది. తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ప్రభుత్వ జూనియర్ వైద్యులు ఆదివారం కర్నూలు నగరంలో భారీ బైక్ ర్యాలీని నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ వైద్యులకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సంఘీభావం తెలిపింది. జూడాలు బైక్ ర్యాలీ పెద్దపార్కు, కోట్ల కూడలి మీదుగా కొండారెడ్డి బురుజు వరకు నిర్వహించారు. కొండారెడ్డి బురుజువద్ద మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం ఈ ర్యాలీ మెడికల్ కళాశాల పురుషుల హాస్టల్ వరకు కొనసాగింది. ఈ ర్యాలీ గురించి ఎపిజూడాల జాయింట్ సెక్రెటరీ, కర్నూలు జూడా సంఘం వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ధీరజ్ కుమార్, జూడాలు డాక్టర్ నరేంద్ర, డాక్టర్ హరీష్, డాక్టర్ ప్రజ్ఞారెడ్డిలు మట్టాడారు. పిజి వైద్యులకు, హౌస్ సర్జన్‌లకు 2016 నుంచి ఇంతవరకు ప్రభుత్వం అరియర్స్ చెల్లించలేదని తెలిపారు. 2016 లోనే జీతాలు పెంచాల్సి ఉండగా 2018 వచ్చినా వేతనాల పెంపు గురించిన ఊసే లేదని అన్నారు. జీతాల పెంపు కోసం వేసిన రివ్యూ కమిటీ నెలరోజులైనా సమీక్ష నిర్వహించలేదన్నారు. రాష్ట్ర పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని శాంతియుతంగా బైక్ ర్యాలీ నిర్వహించామని తెలిపారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యన్ మెడికల్ అసోసియేషన్ కర్నూలు కార్యదర్శి డాక్టర్ మల్లికార్జున సంఘీభావం తెలిపి మాట్లాడారు. సీనియర్ వైద్యులు బాల మద్దయ్య, పిబి కన్న, అల్లారెడ్డి, రామచంద్రనాయుడు, రామశివనాయక్‌లు పాల్గొన్నారు.



విశాఖ జిల్లా పెదబయలులో జరిగిన జీపు జాతాలో మాట్లాడుతున్న గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు బి.సన్నిబాబు

మన్యంలో ఉత్సాహంగా గిరిజన జాతా

ప్రజాశక్తి-విశాఖ ఏజెన్సీ విలేకర్లు

బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దని, గిరిజన యూనివర్సిటీని ప్రారంభించాలని, విశాఖకు రైల్వేజోన్, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఎపి గిరిజన జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యాన చేపట్టిన గిరిజన జీపుజాతా ఆదివారం విశాఖ ఏజెన్సీలో అత్యంత ఉత్సాహభరితంగా సాగింది. ఉదయం అరకు లోయలో ప్రారంభమైన జాతా డుంబ్రిగుడ, హుకుంపేట, పాడేరు, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా పాడేరులో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. డుంబ్రిగుడలో గిరిజన విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించగా, పెదబయలులో భారీ ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ కూడలి వద్ద మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో గిరిజన జెఎసి అధ్యక్షులు పి.అప్పలనర్స, ఉపాధ్యక్షులు కూడా భూషణరావు, నాయకులు కుడుముల కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌జెడి నేతపై అభ్యంతరకర వ్యాఖ్యలు

బీహార్ బీజెపి చీఫ్‌పై కేసు

న్యూఢిల్లీ: బీహార్‌లో ఉప ఎన్నిక జరుగుతున్న అరారియా లోక్‌సభ స్థానం నుండి పోటీ చేస్తున్న ఆర్‌జెడి అభ్యర్థి సర్ఫ్‌రాజ్ ఆలం గెలిస్తే ఈ ప్రాంతం అంతా ఐఎస్‌ఐ అడ్డాగా మారుతుందని నోరు పారేసుకున్న బిజెపి బీహార్ చీఫ్ నిత్యానంద్ రాయ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన ఆరోపణలపై ఈ కేసు నమోదు చేసినట్లు నర్పట్ గంజ్ పోలీస్ స్టేషన్ ఇన్ఛార్జ్ సునీల్‌సింగ్ చెప్పారు. అరారియాలో ఆదివారం నాడు పోలింగ్ జరిగిన విషయం తెలిసిందే. అధికార జెడి(యు) మహా కూటమి నుండి తప్పుకుని బిజెపితో జత కట్టిన తరువాత తొలిసారిగా జరుగుతున్న ఈ ఉప ఎన్నికలు ముఖ్యమంత్రి నితీష్‌కు, ఉపముఖ్యమంత్రి సుశీల్ మోడీకి అగ్నిపరీక్ష వంటిదేనని పరిశీలకులు చెబుతున్నారు.



ఆందోళన ।

మక్కల్ నీది మెయ్యం పార్టీ వ్యవస్థాపకుడు, సినీనటుడు కమలహాసన్ తమిళనాడు రాష్ట్రంలో శాంతిభద్రతలు దిగజారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశాడు.

మెడికల్‌స్కామ్‌లో రాష్ట్రపతి కార్యాలయానికి అందిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి లేఖ

న్యూఢిల్లీ : అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి నారాయణ శుక్లాపై చర్యలు తీసుకోవడానికి సంబంధించి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా రాసిన లేఖ రాష్ట్రపతి కార్యాలయానికి అందిందని, అది పరిశీలనలో ఉన్నదని ప్రభుత్వం తెలిపింది. సంబంధిత ప్రశ్నకు సమాచార హక్కు చట్టం ద్వారా ఈ సమాధానం లభించింది. వైద్య కళాశాలలో ప్రవేశాల కుంభకోణంతో జస్టిస్ నారాయణ శుక్లాకు సంబంధమున్నదని అంతర్గత విచారణ కమిటీ అభియోగాలు చేసిన నేపథ్యంలో ఆయనపై విచారణ జరపాలంటూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి లేఖ రాశారు. అడ్వకేట్ పరాస్‌నాథ్ సింగ్ సమాచార హక్కు చట్టం కింద అడిగిన ప్రశ్నకు పైవిధంగా సమాధానమిచ్చింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా ఫిబ్రవరి 2న లేఖ రాయగా, అది రాష్ట్రపతి సచివాలయానికి ఫిబ్రవరి 5న అందింది. వైద్య కళాశాలలో ప్రవేశాలపై ఉత్తరప్రదేశ్ అడ్వకేట్ జనరల్ చేసిన ఫిర్యాదుతో సహా రెండు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో జస్టిస్ మిశ్రా ఒక అంతర్గత విచారణ కమిటీని నియమించారు. మద్రాస్ హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఇందిరా బెనర్జీ, సిక్కిం హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్‌కె అగ్నిహోత్రి, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి పికె జైస్వాల్‌తో కమిటీని మిశ్రా నియమించారు. సుప్రీం కోర్టు ఉత్తర్వులతో సంబంధం లేకుండా 2017-18 విద్యా సంవత్సరానికి లక్నోకు చెందిన జిసిఆర్‌జి మెడికల్ కళాశాలలో ప్రవేశాలకు అనుమతినిస్తూ జస్టిస్ శుక్లా నేతృత్వంలోని ధర్మాసనం తీర్పునిచ్చింది. అంతర్గత విచారణ కమిటీ సమర్పించిన నివేదికలో జస్టిస్ శుక్లాపై పలు ప్రతికూల వ్యాఖ్యలు ఉన్నాయి. ప్రస్తుతం జస్టిస్ శుక్లా సెలవుపై వెళ్ళారు.

ఒకే రోజు 20 మంది 'వ్యాపం' అధికారుల బదిలీ : సిబిఐ చర్య

న్యూఢిల్లీ: వ్యాపం కుంభకోణంపై దర్యాప్తు జరుపుతున్న ప్రత్యేక విభాగంలోని 20 మంది అధికారులను కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) ఒకే రోజు బదిలీ చేయటం తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ కుంభకోణంలో ఇంకా 50కి పైగా కేసులు పెండింగ్‌లో వుండగానే 20మందికి పైగా అధికారులను బదిలీ చేయటంపై ప్రతిపక్ష కాంగ్రెస్ విస్మయం వ్యక్తం చేసింది. ఈ దర్యాప్తులన్నీ కట్టిపెట్టి ప్రత్యేక విభాగాన్ని రద్దు చేయాలని కాంగ్రెస్ కేంద్రానికి చురకలంటించింది. 2016లో దేశవ్యాప్తంగా సంచలనం కలిగించిన వ్యాపం కుంభకోణంపై దర్యాప్తు చేసేందుకు దాదాపు 100 మంది అధికారులతో సిబిఐ ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటుచేసింది. తాజా బదిలీలతో ఈ ప్రత్యేక విభాగంలోని అధికారుల సంఖ్య గత ఆర్నెల్లలో 70 శాతం మేర తగ్గిందని మీడియా తన వార్తా కథనాలలో పేర్కొంది. వ్యాపం కుంభకోణానికి సంబంధించిన అనేక కేసులను సిబిఐ దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ కుంభకోణంపై 1995 నుండి ఫిర్యాదులందుతున్నప్పటికీ 2012 మేలో ఈ అక్రమాలు పూర్తి స్థాయిలో వెలుగులోకి వచ్చాయి. తాజా బదిలీల వార్త వెలుగులోకి వచ్చిన వెంటనే కాంగ్రెస్ ప్రతినిధి కెకె మిశ్రా మీడియాతో మాట్లాడుతూ వ్యాపం ప్రత్యేక విభాగాన్ని సిబిఐ మూసివేస్తే మంచిదని అన్నారు. కాగా తమ సంస్థలో ఇవన్నీ 'రొటీన్'గా జరిగే బదిలీలేనని, ప్రత్యేక విభాగాన్ని మూసివేసే ప్రసక్తి లేదని సిబిఐ సీనియర్ అధికారి ఒకరు స్పష్టం చేశారు. ఈ కుంభకోణంలో ఇప్పటికే 100కుపైగా కేసులు నమోదు చేసి నిందితులపై ఛార్జిషీట్లు దాఖలు చేశామని, విచారణ కొనసాగుతున్నదని ఆయన వివరించారు.

మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు పునరుజ్జీవం : జ్యోతిరాదిత్య సింధియా

న్యూఢిల్లీ : హిందీ ప్రాంతంలో కాంగ్రెస్ పునర్జీవనానికి బలమైన సంకేతాలు కనిపిస్తున్నాయని ఆ పార్టీ సీనియర్ నేత జ్యోతిరాదిత్య సింధియా అన్నారు. ఇటీవల ఈశాన్య రాష్ట్రాలలో జరిగిన ఉప ఎన్నికలలో పార్టీ ఘోర వైఫల్యాన్ని చవిచూసినప్పటికి 2019లో మధ్యప్రదేశ్‌లో జరగనున్న అత్యంత కీలకమైన సాధారణ ఎన్నికల్లో పార్టీ పునర్జీవం పొందుతుందని చెప్పారు. మధ్యప్రదేశ్‌లోని మంగౌలి, కొలరాస్ అసెంబ్లీ నియోజక వర్గాలలో ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో పార్టీ సునాయాసంగా విజయాన్ని సాధించింది. ఈ నేపథ్యంలో జ్యోతిరాదిత్య మాట్లాడుతూ రాష్ట్రంలోని 14 ఏళ్ళ బిజెపి పాలనను అంతమొందించాలని ప్రజలు నిర్ణయించుకున్నారన్నారు. రాష్ట్రంలో ఈ సంవత్సరాంతాన సాధారణ ఎన్నికలు జరగనున్నాయి. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా సింధియా ముందంజలో ఉన్నారు. రాష్ట్రంలోని శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు భావసారూప్యత గల పార్టీలన్నీ చేతులు కలపాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రముఖ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సింధియా మాట్లాడుతూ త్రిపుర, నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు దిగ్భ్రాంతికి గురిచేశాయన్నారు. మేఘాలయలో కాంగ్రెస్ అతి పెద్ద పార్టీగా ఆవిర్భవించిందన్నారు.

అమానవీయంగానే దళితుల స్థితి

డిఎస్ఎంఎమ్

న్యూఢిల్లీ : దేశంలో దళితుల పరిస్థితి ఇంకా అమానవీయంగానే ఉందని డిఎస్ఎంఎమ్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉత్తరప్రదేశ్‌లోని బలియా జిల్లాలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు 40 ఏళ్ళ దళిత మహిళను సజీవంగా దహనం చేయడానికి ప్రయత్నించిన సంఘటన పట్ల తీవ్ర నిరసనను వ్యక్తం చేసింది. ప్రైవేటు వ్యాపారస్తుల నుంచి తీసుకున్న రుణానికి వడ్డీ చెల్లించకపోవడంతో దళిత మహిళపై దుండగులు దాడికి పాల్పడ్డారని పేర్కొంది. వార్తా పత్రికల కథనం మేరకు ఆ మహిళకు 80 శాతం గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నది. ఆమె పరిస్థితి విషమంగా ఉంది. నిందితులు సుద్దు సింగ్, సోను సింగ్‌లను కఠినంగా శిక్షించాలని డిఎస్ఎమ్ఎమ్ డిమాండ్ చేసింది. ఎస్సీ, ఎస్టీలపై దౌర్జన్యాల నిరోధక చట్టం కింది నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరింది. ఆమె వైద్య ఖర్చులను ప్రభుత్వం భరించాలని తెలిపింది. ఆమె కుటుంబానికి తగిన నష్ట పరిహారం కూడా చెల్లించాలని డిమాండ్ చేసింది.

తప్పుడు హామీలతో ప్రజల తరలింపు

హడావిడిగా ముగిసిన రవిశంకర్ కార్యక్రమం

న్యూఢిల్లీ : ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు రవిశంకర్ శనివారం శ్రీ నగర్‌లో నిర్వహించిన కార్యక్రమం అనుకున్న సమయానికన్నా ముందే ముగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో రవి శంకర్ మనస్తాపం చెందారని వార్తా కథనాలు వెలువడ్డాయి. ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు తమకు పలు తాయిలాలను హామీలుగా ఇచ్చారని ప్రజలు చెప్పారు. ఒక స్వచ్ఛంద సంస్థ నుంచి క్రికెట్ కిట్‌లు ఇప్పిస్తామని చెప్పి తమను కార్యక్రమానికి రావలసిందిగా ఆహ్వానించారని అనేకమంది యువకులు చెప్పారు.. పలువురు మహిళలు మాట్లాడుతూ రవిశంకర్ కార్యక్రమానికి తాము హాజరయ్యేందుకు కుట్టు మిషన్లతో పాటు, నైపుణ్యాల కేంద్రాల నుంచి సర్టిఫికెట్‌లు ఇప్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. కాని అటువంటిదేమీ జరగలేదన్నారు. మరికొంతమంది మాట్లాడుతూ రవిశంకర్‌కు జమ్మూ కాశ్మీర్ పట్ల నిజమైన ప్రేమ ఉంటే ప్రజలపై పెల్లెట్లు, బుల్లెట్ల దాడి జరగకుండా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు రావాలన్నారు.

కూచిభొట్ల స్మారకార్థం భార్య సునయన పాదయాత్ర

కన్సాస్ : భారత్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ శ్రీనివాస్ కూచిభొట్ల భార్య సునయన దుమాలా శాంతియాత్ర నిర్వహించారు. శ్రీనివాస్ కూచిభొట్ల స్నేహితులు, సహోద్యోగులు పలువురు వందల సంఖ్యలో శాంతి యాత్రలో పాల్గొన్నారు. గత ఏడాది అమెరికాలోని కన్సాస్ నగరంలో జాతిపరమైన వైషమ్యాల కారణంగా శ్రీనివాస్ కూచిభొట్ల హత్యకు గురైన సంగతి తెలిసిందే. కూచిభొట్ల 34వ పుట్టిన రోజును పురస్కరించుకుని సునయన నేతృత్వంలో శుక్రవారం శాంతియాత్ర జరిగింది. అమెరికాకు చెందిన ఒక నావికాధికారి జరిపిన కాల్పులకు శ్రీనివాస్ కూచిభొట్ల మృతి చెందాడు. ఈ దాడిలో అతని స్నేహితుడు అలోక్ మేడసానికి తీవ్ర గాయాలయ్యాయి. "మనిషి యొక్క ఒక చర్య, ద్వేషం ఒక అమాయకుడి ప్రాణాన్ని బలిగొన్నాయి." అంటూ సునయన ప్రదర్శనలో పాల్గొన్న ప్రజలనుద్దేశించి అన్నారు. కూచిభొట్ల, మేడసాని ఇద్దరు కూడ ఇంజనీర్లే. కూచిభొట్ల గౌరవార్థం 3 కిలోమీటర్లు శాంతియాత్ర సాగింది. గార్మిన్ ప్రధాన కార్యాలయం నుంచి బార్ వరకు ఈ పాదయాత్ర కొనసాగింది.

షమి భార్య జహన్ వ్యాఖ్యలు నమోదు

కోల్‌కతా : ఇండియా ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమి, అతని భార్య హసిన్ జహన్ మధ్య జరిగిన సంభాషణలకు సంబంధించిన ఆడియో క్లిప్పు ఒకటి కోల్‌కతా పోలీసులకు లభించింది. అత్యాచార, హత్య అభియోగాలతో షమీపై కేసు నమోదైన ఒక రోజు తరువాత ఆ వీడియో క్లిప్పు పోలీసులకు అందింది. కాగా శనివారం మహిళా ఫిర్యాదుల విభాగానికి చెందిన సభ్యులు జహన్‌ను ఆమె నివాసం వద్ద కలుసుకున్నారు. ఆమె వ్యాఖ్యలను నమోదు చేశారు. ఈ నేపథ్యంలో తమ ఎదుట హాజరు కావలసిందిగా కోరుతూ షమీకి నోటీసు జారీ చేస్తామని పోలీసు వర్గాలు తెలిపాయి. షమి భార్య హసిన్ జహన్ గురువారం తన భర్త, అతని కుటుంబ సభ్యులపై కోల్‌కతా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

ముంబయిచేరుకున్న రైతు ర్యాలీ

నేడు అసెంబ్లీ ముట్టడి



ముంబయి: మహారాష్ట్రలోని నాశిక్ నుండి ఐదు రోజుల క్రితం ముంబయికి బయల్దేరి 35 వేల మంది రైతుల భారీ ర్యాలీ ఆదివారం నాడు ముంబయి నగరానికి చేరుకుంది. వీరంతా సోమవారం నాడు రాష్ట్ర శాసనసభను ముట్టడించనున్నారు. ఇదిలా వుండగా శాసనసభ వెలుపల రైతులను కలిసి వారి డిమాండ్లను వినేందుకు రాష్ట్ర మంత్రి గిరిష్ మహజన్ హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. సోమవారం ఉదయం నగరంలోని కెజె సోమయ్య గ్రౌండ్‌కు బయల్దేరటానికి ముందు వారు ముంబయి-థానే సరిహద్దు ప్రాంతంలో మకాం చేశారు. సోమవారం నాటి రైతుల ర్యాలీ నేపథ్యంలో నగరంలో ట్రాఫిక్ స్థంభించే అవకాశాలున్నాయని పోలీసులు ఇప్పటికే ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలలో ప్రయాణించాలని సూచించారు. ట్రాఫిక్ రద్దీని ఎదుర్కొనేందుకు తాము విస్తృతమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు పోలీసు అధికారులు చెప్పారు. వ్యవసాయ రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని, అటవీ భూములను గత కొన్నేళ్ళుగా సాగు చేసుకుంటున్న రైతులకు బదిలీ చేయాలని వామపక్ష అనుబంధిత అఖిల భారత కిసాన్‌సభ (ఎఐకెఎస్) ఈ విధానసభ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చింది. వ్యవసాయ రుణాల మాఫీ, భూమి హక్కుల బదిలీ వంటి అంశాలకు తమకు జీవన్మరణ సమస్యగా మారాయని భారీ సంఖ్యలో ఎఐకెఎస్‌తో జత కలిసిన ఆదివాసీలు చెబుతున్నారు. ఆదివారం తాను ఇక్కడ రాష్ట్ర మంత్రి గిరిష్ మహజన్‌ను కలిసినపుడు రైతుల సమస్యలను ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారని ఎఐకెఎస్ అధ్యక్షుడు అశోక్ ధవాలే చెప్పారు. తాము తమ ముట్టడి కార్యక్రమాన్ని ప్రశాంతంగా కొనసాగిస్తామని, నగర వాసులకు ఎటువంటి ఇబ్బందీ కలిగించమని ఆయన హామీ ఇచ్చారు. తాము తొలుత 25 వేల మంది రైతులతో ప్రారంభించిన ఈ కార్యక్రమంలో ఇప్పుడు 50 వేల మందికి పైగా వున్నారని, సోమవారం నాటి కార్యక్రమంలో ఇది మరింత పెరగవచ్చని ఆయన వివరించారు. అయితే తాము నగర ప్రజలను ఏ విధంగానూ ఇబ్బంది పెట్టబోమని ఆయన స్పష్టం చేశారు. పదోతరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా ఉదయం 11 గంటల తరువాత తాము తమ ర్యాలీని ప్రారంభిస్తామని ఆయన చెప్పారు. మంగళవారం సాయంత్రం ఈ ర్యాలీని ప్రారంభించిన రైతులకు మార్గమధ్యంలో అనేకమంది రైతులు జత కలిసారు. వీరు తమతో తెచ్చుకున్న పరిమిత స్థాయి ఆహారపదార్థాలతోనే తమ ర్యాలీని కొనసాగిస్తూ రాత్రి సమయాల్లో బహిరంగ ప్రదేశాల్లోనే విశ్రమించేవారు. తిరిగి సూర్యోదయానికి ముందే ర్యాలీని ప్రారంభించిన రైతులు మధ్యాహ్నం వరకూ నిర్విరామంగా కొనసాగించేవారు. ఐదు రోజుల ఈ సుదీర్ఘ ప్రయాణంలో అందరూ ఉత్సాహంతో పాల్గొన్నారని, ఎవరూ ఏ సమయంలోనూ, ఏ దశలోనూ నిరుత్సాహ పడలేదని ప్రదర్శకుల్లో ఒకరైన జిదాబాయ్ గైక్వాడ్ అనే మహిళా రైతు చెప్పారు. భూమి యాజమాన్య హక్కులు తమ పేర బదిలీ చేస్తే తాము పనిచేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటామని తాను ముఖ్యమంత్రికి చెప్పదల్చుకున్నట్లు ఆమె మీడియాకు వివరించారు. సంపూర్ణ వ్యవసాయ రుణమాఫీతో పాటు స్వామినాథన్ కమిషన్ నివేదికను యథాతథంగా అమలు చేయాలన్నది తమ ప్రధాన డిమాండ్ అని ఎఐకెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజిత్ నవాలే చెప్పారు. శుక్రవారం రాత్రి రైతులను కలిసిన శివసేన నేత ఏకనాథ్ షిండే వారికి తమ మద్దతునుప్రకటించారు. వీరితో పాటు నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ, రాజ్‌థాకరే నేతృత్వంలోని మహారాష్ట్ర నవనిర్మాణ సేనలు కూడా రైతులకు తమ మద్దతును ప్రకటించాయి.

వ్యవ'సాయాని'కి విధానాల మార్పు అవసరం

మోడీ, ఫడ్నవిస్ సర్కార్లకు ఎఐకెఎస్ సూచన

రైతు ర్యాలీలో పాల్గొంటున్న రైతులకు వందనం

ఇండియా న్యూస్ నెట్‌వర్క్, న్యూఢిల్లీ: నానాటికీ సంక్షోభంలో కూరుకుపోతున్న వ్యవసాయ రంగాన్ని ఆదుకునేందుకు విధానాలలో మార్పు అవసరమని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) కేంద్రం, మహారాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. కిసాన్‌సభ మహారాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జరుగనున్న శాసనసభ ముట్టడి కార్యక్రమానికి, దీనికి ముందు నిర్వహించిన చారిత్రాత్మక లాంగ్ మార్చ్‌కి తన సంఘీభావాన్ని ప్రకటించింది. సోమవారం నాటి ముట్టడి అనంతరం రైతుల డిమాండ్ల పరిష్కారం అయ్యే వరకూ ఈ కార్యక్రమం సచివాలయం ముందు నిరవధిక ధర్నా రూపంలో కొనసాగుతుందని కిసాన్‌సభ కేంద్ర కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నెల 5వ తేదీన నాశిక్‌లో 30 వేల మంది రైతులతో ప్రారంభమైన లాంగ్ మార్చ్ కార్యక్రమంలో పాల్గొంటున్న వారి సంఖ్య 10 వ తేదీ నాటికి 50 వేలకు చేరిందని, సోమవారం నుండి కొనసాగనున్న నిరవధిక ధర్నా కార్యక్రమంలో రాష్ట్రం మొత్తం నుండి దాదాపు లక్ష మందికి పైగా రైతులు పాల్గొనున్నారని ఎఐకెఎస్ తన ప్రకటనలో వివరించింది. అధికారం చేపట్టిన నాటి నుండి కేంద్రంలోని మోడీ సర్కారు, రాష్ట్రంలోని ఫడ్నవిస్ ప్రభుత్వం సామ్రాజ్యవాద, నయా సరళీకరణ విధానాల అమలులో దూకుడు పెంచాయని విమర్శించింది. వ్యవసాయం, రిటైల్ వ్యాపార రంగాలలో వందశాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతించిన మోడీ సర్కారు బడా వ్యాపారులు కారుచౌకగా వ్యవసాయో త్పత్తులను కొనుగోలు చేయటం కోసం కాంట్రాక్ట్ వ్యవసాయ పద్ధతులను, వ్యవసాయ మార్కెట్‌లను ఇ-కొనుగోళ్లకు అనుసంధానం చేసే ప్రక్రియను ప్రారంభించిందని ఆందోళన వ్యక్తంచేసింది. రైతుల సమ్మతి లేకుండా బలవంతపు భూసేకరణకు ఆర్డినెన్స్ తెచ్చేందుకు చేసిన ప్రయత్నాలురైతుల ఐక్య పోరాటాలతో నిలిచిపోయాయని గుర్తు చేసింది. రైతులను రుణ విముక్తులను చేయాలని, పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలన్న డిమాండ్‌తో కిసాన్ సభ చేపట్టిన లాంగ్‌మార్చ్ కార్యక్రమం ఇతర రైతు సంఘాలతో కలిసి కొనసాగిస్తున్న పోరాటంలో భాగమేనని స్పష్టం చేసింది. వ్యవసాయ రుణాల సంపూర్ణ మాఫీ, అటవీ హక్కుల చట్టం పటిష్ట అమలు, వ్యవసాయ రంగంపై స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫార్సుల అమలు, బలవంతపు భూసేకరణకు తెరదించటం వంటి చర్యలతో పాటు రైతులకు, వ్యవసాయ కార్మికులకు నెలసరి పెన్షన్‌ను కనీస వేతన విధానాలను అమలుచేయాలని, ఉపాధి హామీ పథకాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలన్నవి ప్రస్తుత పోరాటంలోని ప్రధాన డిమాండ్లని కిసాన్ సభ తన ప్రకటనలో వివరించింది.

పెరిగిన చొరబాట్లు

- దేశీయ భద్రతపై పార్లమెంటరీ కమిటీ నివేదిక



న్యూఢిల్లీ : దేశంలో 2016లో అంతర్గత భద్రత నియంత్రణలోనే ఉన్నదంటూ హోం మంత్రిత్వ శాఖ అభిప్రాయాన్ని పార్లమెంటరీ కమిటీ తిరస్కరించింది. ఈ కమిటీకి కాంగ్రెస్ నేత పి. చిదంబరం నేతృత్వం వహిస్తున్నారు. ఆ సంవత్సరమంతా జమ్మూ కాశ్మీర్ అట్టుడికిపోయిందని కమిటి పేర్కొంది. అదే సంవత్సరంలో చొరబాటు ప్రయత్నాలు అత్యధికంగా జరిగాయని తెలిపింది. శాంతి భద్రతల పరిస్థితి అంతా నియంత్రణలోనే ఉన్నదన్న హోం మంత్రిత్వ శాఖ అభిప్రాయంతో తాము ఏకీభవించడం లేదని గత గురువారం పార్లమెంట్‌కు సమర్పించిన నివేదికలో పార్లమెంటరీ కమిటీ పేర్కొంది. 2016లో జమ్మూ కాశ్మీర్‌లో పెద్దసంఖ్యలో ఉగ్రవాద దాడులు జరిగాయని, చొరబాట్ల సంఖ్య కూడా పెరిగిందని పార్లమెంటరీ కమిటీ వెల్లడించింది. 2015లో 121 చొరబాటు యత్నాలు జరిగితే 2016లో 364 చొరబాటు యత్నాలు జరిగాయని తెలిపింది. ఉగ్రవాదులలో కొత్త వైఖరి చోటు చేసుకున్నదని, పారా మిలటరీ, సాయుధ బలగాలకు చెందిన శిబిరాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నారని నివేదిక తెలిపింది. గత ఏడాది 82 మంది భద్రతా సిబ్బంది మృతి చెందారని పేర్కొంది. అదే సమయంలో 2016లో చోటు చేసుకున్న పలు ఉగ్రవాద దాడులు దేశ భద్రతా వ్యవస్థలోని పలు లోపాలను ఎత్తి చూపాయని ఆ నివేదిక తెలిపింది. ఆర్థిక వనరుల కొరత కారణంగానే దేశంలో ఉగ్రవాదం, తీవ్రవాదంపై జరిపిన పోరాటంలో పలువురు పారామిలటరీ సిబ్బందితో పాటు పోలీసులను కోల్పోయామని దేశీయ (హోం) వ్యవహారాలపై ఏర్పడిన పార్లమెంటరీ కమిటీ తెలిపింది.

చొరబాటు యత్నాలను పూర్తిగా నిలువరించేందుకు హోం మంత్రిత్వ శాఖ చర్యలు తీసుకోవాలని పార్లమెంటరీ కమిటీ సిఫార్సు చేసింది. జమ్మూ కాశ్మీర్‌లో వివిధ రూపాలలో కొనసాగుతున్న ఉగ్రవాద కార్యకలపాలను నివారించాలని సూచించింది. సైనిక స్థావరాలు, శిబిరాల వద్ద భద్రతను పటిష్టం చేయాలని తెలిపింది. వాటిపై దాడులు పునరావృతం కాకుండా చూడాలని పార్లమెంటరీ కమిటీ నివేదిక పేర్కొంది.

ఉప ఎన్నికల్లో చరిత్ర సృష్టించండి

ప్రజలకు అఖిలేష్ పిలుపు

న్యూఢిల్లీ : ఉత్తర ప్రదేశ్ ఉప ఎన్నికలో చరిత్ర సృష్టించాలని సమాజ్‌వాది పార్టీ నేత, మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. వచ్చే ఏడాది రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న దృష్ట్యా ఉప ఎన్నికల్లో విప్లవాత్మకమైన ఫలితాలు సాధించేందుకు అందరూ కలిసికట్టుగా వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. రాష్ట్రంలో రెండు కీలక పార్లమెంటరీ నియోజక వర్గాలకు ఆదివారం ఉప ఎన్నికలు జరిగాయి. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రాతినిధ్యం వహించిన గోరఖ్‌పూర్, ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రధాన్ మౌర్య ప్రాతినిధ్యంలోని ఫుల్పూర్ నియోజక వర్గానికి ఆదివారం ఉప ఎన్నికలు జరిగాయి. వీరిద్దరూ రాష్ట్రంలోని ఉన్నతస్థాయి పదవు లకు ఎన్నిక కావడంతో వారి నియోజక వర్గాలలో ఎన్నికలు జరపాల్సిన అవసరం ఏర్పడింది. అఖిలేష్ యాదవ్ హిందీలో తన వ్యాఖ్యలను ట్వీట్ చేశారు. "రాష్ట్రంలో చరిత్రను, మార్పును సృష్టించేరోజు ఇది. ప్రతి ఒక్కరూ బయటకు రండి. మన ఐక్యత ఎంత బలమైనదో చూపిం చండి. దేశ, రాష్ట్ర భవిష్యత్ కోరుతూ వేసే ఓటు ఫలితాలు విప్లవాత్మకంగా, నిర్ణయాత్మకంగా ఉండాలి." అని ఆయన ట్వీట్ చేశారు. ఈ ఎన్నికలకు కొద్ది రోజుల ముందు తన చిరకాల ప్రత్యర్థి బిఎస్‌పి నేత మాయావతితో ఎన్నికల ఒప్పందంచేసుకున్న సంగతి తెలిసిందే.



15న దినకరన్ కొత్త పార్టీ

చెన్నై : మదురై జిల్లాలో ఈ నెల 15న జరిగే ఒక కార్యక్రమంలో తాను స్థాపించబోయే కొత్త పార్టీ పేరును ప్రకటిస్తానని ఎఐఎడిఎంకె బహిష్కృత నేత టిటివి దినకరన్ ఆదివారం తెలిపారు. అదే రోజున పార్టీ జెండా ఆవిష్కరణ కూడా ఉంటుందన్నారు. దినకరన్ నేతృత్వంలోని ఎఐఎడిఎంకె వర్గానికి పార్టీ గుర్తును, తగిన పేరను కేటాయించాలని ఢిల్లీ హై కోర్టు ఎన్నికల కమిషన్‌ను ఆదేశించిన రెండు రోజుల తరువాత ఈ పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఇప్పటి వరకు దినకరన్ తన వర్గానికి ఎఐఎడిఎంకె (అమ్మ) పార్టీగా పిలుస్తున్నారు. ఎఐఎడిఎంకెకు చెందిన రెండు ఆకుల గుర్తును తమకు కేటాయించాలని అంతకుముందు చేసిన విజ్ఞప్తిని ఎన్నికల కమిషన్ తిరస్కరించింది. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీకి మాత్రమే గుర్తును, పేరును కేటాయిస్తామని తెలిపింది.

ప్రత్యేకం

ఇదెలా సాధ్యం?

- 7 లక్షల ఉద్యోగాలు పోయాయి
- నిజాల్ని దాస్తోన్న కేంద్ర సూక్ష్మ, చిన్నమధ్య తరహా పరిశ్రమల శాఖ
- లోక్‌సభకు తెలిపిన సమాచారంపై అనుమానాలు

న్యూఢిల్లీ : ఏదైనా రంగంలో ఉత్పత్తి పెరిగిందంటే...అందులో ఉపాధి పొందుతున్న కార్మికుల సంఖ్య పెరగాలి. కానీ ఖాదీ పరిశ్రమలో దీనికి విరుద్ధంగా జరిగింది. దేశవ్యాప్తంగా 7లక్షల మంది ఖాదీ పరిశ్రమల్లో ఉపాధి కోల్పోయారని, అదే సమయంలో ఖాదీ ఉత్పత్తి, అమ్మకాలు పెరిగాయని లోక్‌సభకు అందజేసిన నివేదికలో 'కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ' పేర్కొన్నది. పొంతనలేని లెక్కలతో ఈ శాఖ లోక్‌సభకు అందజేసిన సమాచారంపై నిపుణులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేవలం చరఖాల ఆధునీకరణ వల్లనే లక్షలాది మంది ఉపాధి కోల్పోయారని ఆ శాఖ చెప్పటం...వాస్తవాల్ని మరుగుపర్చటమేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆ వివరాలేవీ లోక్‌సభకు ఇచ్చిన నివేదకలో పొందుపర్చలేదని వారు తప్పుబట్టారు.

2015-16 నుంచి 2016-17 మధ్య దేశంలో ఖాదీ ఉత్పత్తి 32 శాతం పెరిగింది. ఖాదీ అమ్మకాలు 33 శాతం పెరిగాయి. కానీ ఇదే సమయంలో పరిశ్రమల్లో 7లక్షల మంది ఉపాధి కోల్పోయారు. లక్షలాది మంది ఈ రంగాన్ని వదిలేస్తున్నారని లోక్‌సభకు అందజేసిన నివేదికలో సంబంధిత శాఖ పేర్కొన్నది. ఇందులోని సమాచారంపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేవలం చరఖాల ఆధునీకరణ వల్లనే లక్షలాది మంది బయటకు వెళ్ళారని కేంద్ర మంత్రిత్వ శాఖ పేర్కొనటాన్ని వారంతా తప్పుబడుతున్నారు. ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ (కేవీఐసీ) చెప్పినదాని ప్రకారం, దేశవ్యాప్తంగా ఖాదీ తయారీ రంగంలో లక్షలాది మంది ఉపాధి కోల్పోతున్నారు. వీటి గణాంకాల్ని 2015-16 ఏడాదికి సంబంధించిన సమాచారంలో పొందుపర్చలేదు. అనేక మంది ఉపాధి కోల్పోవడానికి కొత్త మోడల్‌లో వచ్చిన చరఖాలు కొంతవరకు కారణమయ్యాయి. సాంప్రదాయ చరఖాలను నడిపేవారిని ఇవి దెబ్బతీశాయి. అయితే ఉపాధి కోల్పోయిన వారి సంఖ్య ఎంత, ఖాదీ తయారీరంగంపై దాని ప్రభావం వంటి వివరాలేవీ ఖాదీ, కేవీఐసీ బహిర్గతం చేయటం లేదు. అలాగే సంబంధిత కేంద్ర మంత్రిత్వ శాఖ కూడా సరైన వివరాల్ని వెల్లడి చేయటం లేదు. ఉత్తరాఖండ్, యూపీ, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో 3.2లక్షల మంది ఉపాధి కోల్పోయారు. బీహార్, ప.బెంగాల్, జార్ఖండ్, ఒడిశా రాష్ట్రాల్లో, అండమాన్, నికోబార్‌లో మొత్తం 1.2 లక్షల మంది ఖాదీ పరిశ్రమ నుంచి బయటకొచ్చారు.

ఉపాధి కల్పన...ఉత్తదేనా ?

ప్రధానమంత్రి ఉపాధి కల్పన (పీఎంఈజీపీ) పథకం కింద ప్రతీ ఏటా ఉపాధి పొందుతున్నవారి సంఖ్య కూడా తగ్గుతోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉపాధి రంగాన్ని మెరుగుపర్చటం కోసం తీసుకొచ్చిన పథకమే 'పీఎంఈజీపీ'. దీనికింద లబ్దిదారులకు సబ్సిడీతో కూడిన సూక్ష్మరుణాల్ని అందజేస్తారు. ఈ పథకంపై తాజా గణాంకాల్ని లోక్‌సభలో సంబంధిత మంత్రిత్వశాఖ విడుదల చేసింది. దీని ప్రకారం, రుణ సహాయాన్ని పొందిన ప్రాజెక్టుల సంఖ్య క్రమంగా తగ్గింది. 2016-17లో 53 వేల ప్రాజెక్టులకు రుణ సాయం అందితే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జనవరి మధ్య కేవలం 31 వేల ప్రాజెక్టులకు మాత్రమే రుణసాయం దక్కింది. అలాగే, 2015-16లో 3.2 లక్షల మంది కొత్తగా ఉపాధి పొందితే, 2016-17లో ఆ సంఖ్య 4.1లక్షలకు పెరిగింది. కానీ 2017-18నాటికి వచ్చేసరికి ఇప్పటిదాకా కేవలం 2.5 లక్షలమంది మాత్రమే పీఎంఈజీపీ పథకం ద్వారా ఉపాధి పొందారు.

సంక్షిప్తం

మారిషస్, మడగాస్కర్‌లో రాష్ట్రపతి ఐదురోజుల పర్యటన

న్యూఢిల్లీ : హిందూ మహాసముద్రంలోని మడగాస్కర్, మారిషస్ ద్వీపాల్లో ఐదు రోజుల పర్యటన నిమిత్తం ఆదివారం రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ భారత్ నుండి బయలుదేరారు. మారిషస్ స్వాతంత్రం వచ్చి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చేసుకుంటున్న ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా రామ్‌నాథ్ కోవింద్ పాల్గొంటారు. రాష్ట్రపతితో పాటు కేంద్ర మంత్రులు అశ్వినీ కుమార్ చౌబే, ఢిల్లీ బిజెపి అధ్యక్షుడు, ఎంపీ మనోజ్ తివారీ, హుకుమ్ దేవ్ నారాయణ్ యాదవ్, ఆర్ రాధాక ష్ణన్, విజిలా సత్యనాథ్, భారత్ లాల్, రుచి ఘన్‌శ్యామ్, జైదీప్ మజుందార్, మనోజ్ యాదవులు కూడా వెళ్లారు.

రాజకీయాల గురించి ఇక్కడ మాట్లాడను : రజనీ

సిమ్లా : సినీనటుడు, రాజకీయ వేత్త రజనీ కాంత్ శనివారం హిమాలయాకు వెళ్ళిన సంగతి తెలిసిందే. అక్కడ మీడియా రజనీని పార్టీ గురించి ప్రశ్నించగా ఆయన సమాధానం చెప్పడానికి నిరాకరించారు. తాను ఇక్కడ యాత్రికుడిగా వచ్చానని, ఈ పర్యటన అద్భుతంగా సాగుతుందనీ తెలిపారు. కాబట్టి సాధారణ జీవితానికి కొంచెం భిన్నంగా దైనందిక జీవితం గడపడానికి వచ్చానని తెలిపారు. ఇక్కడ రాజకీయాల గురించి మాట్లాడటం తనకు ఇష్టం లేదని తెలిపారు.

యుపిలో జీవిత ఖైదీ నేరస్తుడి హత్య

లక్నో : ఉత్తరప్రదేశ్‌లోని షమిల్ జిల్లాలోని బిడోలి గ్రామానికి సమీపంలో ధర్మేందర్ అనే నిందితుడిని ముగ్గురు వ్యక్తులు కాల్చి హత్య చేశారని పోలీసులు ఆదివారం తెలిపారు. మూడు హత్య కేసుల్లో నేరస్తుడుగా ఉన్న ధర్మేందర్ జీవిత ఖైదును అనుభవిస్తున్నాడు. పెరోల్‌పై విడుదలైన ధర్మేందర్‌ను అర్జున్, అతని కొడుకులు రాజేందర్, సహేందర్ గత రాత్రి కాల్చి చంపారని, వీరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని సూపరిటెండెంట్ ఆఫ్ పోలీస్ అజయ్ పాల్ శర్మ తెలిపారు.

237 మంది అక్రమ వలసదారులను రక్షించిన లిబియా

ట్రిపోలీ: లిబియా వైపు అక్రమంగా ప్రయాణిస్తూ ప్రమాదానికి గురైన బోటులో వున్న దాదాపు 237 మందిని తమ నౌకాదళ సిబ్బంది సురక్షితంగా తీరానికి చేర్చారని లిబియా ప్రభుత్వం ప్రకటించింది. లిబియా వైపు రెండు బోట్లలో అక్రమంగా తరలి వస్తున్న దాదాపు 237 మంది ప్రయాణీకులను లిబియాలోని అజ్ జవాఇయా తీర ప్రాంతంలో నీట మునగకుండా సురక్షితంగా తీరానికి చేర్చినట్లు అధికార అనడోలు వార్తా సంస్థ వెల్లడించింది. 44 మంది మహిళలు, ఏడుగురు చిన్నారులతో వున్న ఈ వసలదారుల బృందంలో అధికశాతంమంది ఆఫ్రికాకు చెందిన వారేనని, ఒకరిద్దరు బంగ్లాదేశ్‌కు చెందిన వారుండవచ్చని ఈ ప్రకటనలో వివరించారు. వారికి వైద్య సదుపాయంతో పాటు అవసరమైన మానవతా సాయం కూడా అందచేస్తున్నామని ఈ ప్రకటనలో తెలిపారు.



ఘర్షణ
శ్రీలంకలో ముస్లీంలు మెజారిటీగా ఉన్న ప్రాంతంలో తిరిగి ఘర్షణలు ప్రారంభం కావటంతో ముందు జాగ్రత్తగా సైన్యాన్ని మోహరించారు.

కనీసం తుపాకులు కూడా అమ్మడం లేదు

అమెరికాపై టర్కీ ధ్వజం

ఇస్తాంబుల్: అమెరికా తమకు కనీసం తుపాకులు కూడా అమ్మడం లేదని, అందుకే రష్యా నుండి వాయు రక్షణ వ్యవస్థ అయిన ఎస్-400ను కొనుగోలు చేయాలని నిర్ణయించుకున్నట్లు టర్కీ విదేశాంగమంత్రి మేవ్‌లుట్ కావుసొగ్లు తెలిపారు. తమకు ఎలాంటి వాయు రక్షణాత్మక వ్యవస్థ లేదని, తాము నాటోలో సభ్యులం అయినప్పటికీ అమెరికా నుండి కనీసం తుపాకులు కూడా కొనుగోలు చేసుకోలేకపోతున్నామని చెప్పారు. టర్కీ నిర్ణయం పట్ల అమెరికా గుర్రుగా ఉంది. రష్యా నుండి ఆయుధాలను కొనుగోలు చేస్తే ఆంక్షలు పెడతామని బెదరిస్తోంది. దీనిపై మేవ్‌లుట్ మాట్లాడుతూ రష్యాతో ఒప్పందంపై సంతకాలు జరిగాయని, భవిష్యత్‌లో కూడా కొనుగోళ్లు జరుపుతామని చెప్పారు. రష్యాతో ఆయుధ రంగంలో ఉమ్మడి పెట్టుబడులు, సాంకేతిక బదిలీపై కలిసి పని చేస్తామని తెలిపారు. అమెరికా బెదిరింపులకు లొంగేది లేదని చెప్పారు. అమెరికా ఆంక్షలు పెడితే మిగిలిన దేశాల కంటే భిన్నంగా ఎలా స్పందించాలో తమకు తెలుసునని అన్నారు. తమ మిత్రులు తమకు ఆయుధాలు అమ్మనప్పుడు మరొకరి నుండైనా కొనుగోలు చేసుకోవాలి కదా అని అన్నారు. అమెరికా కాంగ్రెస్ ఆమోదిస్తుందని ట్రంప్ ప్రభుత్వం గ్యారంటీ ఇస్తే వారి వద్ద నుండి కూడా రక్షణాత్మక వ్యవస్థలను కొనుగోలు చేస్తామని, అయితే దీనర్థం రష్యా, ఇతర యూరోపియన్ దేశాల నుండి ఆయుధాలను కొనుగోలు చేయబోమని కాదని స్పష్టం చేశారు. ఆ దేశం నుండి గ్యాస్ కొనద్దు, ఈ దేశం నుండి ఆయుధాలు కొనవద్దని అమెరికా ఆంక్షలు పెడుతోందని, అలా చేయకూడదని, బలవంతులయినంత మాత్రన వారు చెప్పేదంతా సరైంది కాదని మేవ్‌లుట్ అన్నారు.

ఏప్రిల్‌లో ట్రంప్ లాటిన్ అమెరికా పర్యటన

వైట్‌హౌస్ వెల్లడి

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏప్రిల్ నెలలో తొలిసారిగా లాటిన్ అమెరికా పర్యటనకు వెళ్తున్నారని వైట్ హౌస్ ప్రకటించింది. ఈ పర్యటనలో ఆయన పెరూ, కొలంబియా దేశాలను సందర్శిస్తారని వైట్ హౌస్ ఒక ప్రకటనలో వెల్లడించింది. పెరూ రాజధాని లీమాలో జరిగే అమెరికా దేశాల సదస్సుకు ట్రంప్ హాజరవుతారని, అనంతరం ఆయన అధ్యక్షుడు పెడ్రో పాబ్లో కుక్జిన్‌స్కీతో భేటీ అవుతారని ఈ ప్రకటనలో పేర్కొన్నారు. అదే విధంగా కొలంబియాలో ఆయన అధ్యక్షుడు జువాన్ మాన్యుయెల్ శాంటోస్‌తో భేటీ అవుతారని ఈ ప్రకటనలో వివరించారు. లాటిన్ అమెరికా దేశాలలో తొలిసారిగా పర్యటించనున్న ట్రంప్ అనేక ద్వైపాక్షిక, బహుళపక్ష, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొంటారని ఈ ప్రకటనలో వివరించారు.

బ్రిటన్‌లో దౌత్య కార్యాలయంపై దాడిని ఖండించిన ఇరాన్

టెహ్రాన్: బ్రిటన్‌లో తమ రాయబార కార్యాలయంపై జరిగిన దాడిని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. బ్రిటన్‌లో తమ దౌత్యవేత్తల భద్రతకు హామీ ఇవ్వాల్సిన బాధ్యత బ్రిటన్ అధికారులదేనని ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. లండన్‌లోని తమ రాయబార కార్యాలయంపై కొందరు సాయుధుల గుంపు మారణాయుధాలతో దాడి చేసి తమ దేశానికి వ్యతిరేకంగా నినాదాలు చేసిందని ఇరాన్ దౌత్యవేత్త హమీద్ బైది నెయాద్ సోషల్ నెట్‌వర్క్‌లో తెలిపారు. ఈ దాడిలో తమ అధికారులందరూ క్షేమంగానే వున్నారని, దాడి చేసిన వారు దౌత్య కార్యాలయ భవనం లోపలికి ప్రవేశించలేకపోయారని ఆయన వివరించారు.

అధ్యక్ష పదవిపై

పరిమితిని తొలగించిన చైనా

రాజ్యాంగ సవరణకు పార్లమెంట్ ఆమోదముద్ర

బీజింగ్: చైనా రాజ్యాంగంలో అధ్యక్ష పదవి నిర్వహణపై ఉన్న కాలపరిమితులను తొలగించే రాజ్యాంగ సవరణను చైనా పార్లమెంట్ ఆదివారం నాడు ఆమోదించింది. దీనితో ప్రస్తుత అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ అధ్యక్ష పదవిలో మూడోసారి కూడా కొనసాగేందుకు మార్గం సుగమమైంది. ఇక్కడి గ్రేట్ హాల్ ఆఫ్ అసెంబ్లీలో జరిగిన పార్లమెంట్ ప్రత్యేక సమావేశానికి హాజరైన మొత్తం 2,963 ప్రతినిధుల్లో రెండు ఓట్లు వ్యతిరేకంగా పడ్డాయి. ముగ్గురు సభ్యులు గైర్హాజరయ్యారు. ఈ ప్రతిపాదనకు పార్లమెంట్ ఆమోదముద్ర వేయటంతో ప్రస్తుత అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ మూడోసారి పదవిలో కొనసాగేందుకు వీలు ఏర్పడింది. గతంలో ఆధునిక చైనా వ్యవస్థాపకుడు మావోజెడాంగ్ 1949 నుండి 1976లో మరణించే వరకూ చైనా అధ్యక్షుడిగా కొనసాగిన విషయం తెలిసిందే. గత అధ్యక్షుడు హు జింటావో వారసుడిగా 2012లో చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన సీ జిన్‌పింగ్ మరుసటి ఏడాది చైనా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అధికార చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి పదవితో పాటు ఆయన చైనా సర్వ సైన్యాధిపతిగా (సెంట్రల్ మిలటరీ కమిషన్ ఛైర్మన్)కూడా వ్యవహరిస్తారు. వాస్తవానికి చైనా అధ్యక్ష పదవి కన్నా ప్రధానకార్యదర్శి పదవే అత్యంత శక్తివంతమైనదయినప్పటికీ ప్రపంచ దేశాలతో వ్యవహరించేటపుడు అధ్యక్షుడిగానే ముందుకొస్తున్న విషయం తెలిసిందే. చైనా తొలి అధ్యక్షుడిగా వ్యవహరించిన మావో జెడాంగ్ 1954లో అధికారిక బాధ్యతలు చేపట్టిన ఐదేళ్లకు తన వారసుడిగా లియు షావ్‌కీని నియమించారు. అయితే తరువాత మావో ప్రతిపాదించిన సాంస్కృతిక విప్లవంలో ఆయన పదవి నుండి తప్పుకున్నారు. ఆ తరువాత మరోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన మావో 1975 వరకూ ఆ పదవిలో కొనసాగారు. తరువాత అధ్యక్షుడిగా వ్యవహరించిన డెంగ్ జియావో పింగ్ 1982లో అధ్యక్ష పదవీకాలంపై పరిమితులు విధిస్తూ చట్ట సవరణ చేశారు. ఐదేళ్లకోసారి జరిగే పార్టీ మహాసభల్లో అప్పటికి పదవిలో కొనసాగే అధ్యక్షులు తమ వారసుల పేర్లను ప్రకటించే వారు. గతంలో అధ్యక్షులుగా వ్యవహరించిన హుజింటావో, జియాంగ్ జెమిన్‌లు ఇదే విధంగా వ్యవహరించారు. అయితే గత అక్టోబర్‌లో జరిగిన పార్టీ మహాసభల్లో ప్రస్తుత అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ తన వారసుడి ప్రస్తావనే తీసుకురాలేదు. దానితో 2023 తరువాత కూడా ఆయనే అధ్యక్షుడిగా కొనసాగుతారన్న ఊహాగానాలు తెరపైకి వచ్చాయి. అక్టోబర్ పార్టీ మహాసభల తరువాత గత నెలలో ఈ ప్రతిపాదన అధికారికంగా తెరపైకి రావటంతో ప్రపంచ వ్యాప్తంగా సంచలనం చెలరేగింది. ఈ ప్రతిపాదనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వాగతించారు. సీ జిన్‌పింగ్ 'ఈ శతాబ్దంలోనే అత్యంత శక్తివంతమైన నేత' అని ఆయన అభివర్ణించారు. సీ



జిన్‌పింగ్ హయాంలోనే చైనా ప్రతిష్టాత్మకమైన బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్ ప్రాజెక్టును ప్రారంభించింది. దేశ, విదేశాలలో మౌలిక వసతుల అభివృద్ధి కోసం వందల కోట్ల డాలర్ల పెట్టుబడులను వెచ్చించింది. సీ పాలనలోనే చైనా ఆసియాలో అత్యంత ప్రభావ వంతమైన దేశంగా మారింది.

వాణిజ్య యుద్ధాలతో ప్రపంచ సంక్షోభం

• అమెరికాకు చైనా హెచ్చరిక

వాణిజ్య యుద్ధాల కారణంగా ప్రపంచం సంక్షోభంలోకి వెళ్తుందని చైనా వాణిజ్యశాఖా మంత్రి జోంగ్ షాన్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ స్టీల్ దిగుమతులపై అమెరికా పన్నులు పెంచడం ప్రపంచ పురోగతికి నష్టం చేస్తుందని అన్నారు. అయితే తాము అమెరికాతో వాణిజ్య యుద్ధాలకు దిగబోమని స్పష్టం చేశారు. వాణిజ్య యుద్ధాల్లో విజేతలు ఉండరని చెప్పారు. దీని వల్ల అమెరికా, చైనాతోపాటు ప్రపంచానికి కూడా నష్టమని పేర్కొన్నారు. అమెరికా వాణిజ్య ఆంక్షలతో తమను టార్గెట్ చేస్తే తమ న్యాయబద్ధమైన హక్కులు, ప్రయోజనాలను ఎలా కాపాడుకోవాలో తెలుసునన్నారు ఎటువంటి సవాళ్లనైనా చైనా ఎదుర్కొనగలదని, తన ప్రయోజనాలను రక్షించుకోగలదని అన్నారు. అయితే అమెరికా, చైనా చర్చలు కొనసాగించాలని అన్నారు. అమెరికా తన వాణిజ్య లోటు లెక్కలను 20 శాతం అధికంగా చూపిస్తోందని, అయితే హై టెక్ సరుకులపై ఎగుమతి నియంత్రణలను అమెరికా సడలిస్తే లోటు చాలా వరకు తగ్గిపోతుందని జోంగ్ తెలిపారు.

అమెరికాతో చర్చలకు సిద్ధం : పుతిన్

మాస్కో: ఎటువంటి అంశాలపైనైనా అమెరికాతో చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నామని, వాషింగ్టన్ కూడా ఇదే వైఖరిని అనుసరించాలని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పేర్కొన్నారు. క్షిపణి సంబంధిత అంశాలు కానీ, సైబర్‌స్పేస్ గానీ లేదా ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే చర్యలకు గురించి కానీ, అన్ని అంశాలపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని ఎన్‌బిసికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పుతిన్ చెప్పారు. అమెరికా, రష్యా కూర్చొని సరైన దిశలో చర్చలు జరపాలని అన్నారు. ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు కూడా ఇదే ఉద్దేశ్యంతో ఉన్నారని తనకు అనిపిస్తోందని, కానీ కొన్ని శక్తులు ఆయన్ను అడ్డుకుంటున్నాయని చెప్పారు. ఏ సమయంలోనైనా చర్చలకు రష్యా సిద్ధంగా ఉందని, అమెరికా కూడా సిద్ధంగా ఉందని ఆశిస్తున్నానని అన్నారు. ఈ దిశగా అమెరికాలోని రాజకీయ ప్రముఖులు ప్రజాభిప్రాయాన్ని కూడగడితే ఆ సమయం వస్తుందని అన్నారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రష్యా ప్రభుత్వం జోక్యం చేసుకుందన్న ఆరోపణలను పుతిన్ తోసిపుచ్చారు. వేల కొద్ది మైళ్ల దూరంలో ఉన్న రష్యా ఏ విధంగా అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేస్తుందని ప్రశ్నించారు. ఆధారాలు లేకుండా విచారణకు రష్యా చట్టాలు అంగీకరించవని, అమెరికా ప్రభుత్వం ఏమైనా ఆధారాలు అందిస్తే విచారణ జరిపిస్తామని చెప్పారు. తనకు గానీ, తన అధికారులకు గానీ అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో జోక్యం చేసుకోవాల్సిన అవసరమేముందని ప్రశ్నించారు.

పిల్లల ఇంటర్నెట్ వినియోగంపై పరిమితి

బ్రిటీష్ ప్రభుత్వ ప్రతిపాదన

లండన్: ఇంటర్నెట్‌పై పిల్లలు గడిపే సమయంపై చట్టపరమైన పరిమితి విధించాలని ప్రభుత్వం భావిస్తోందని బ్రిటన్ సాంస్కృతిక శాఖ తెలిపింది. పన్నెండు నుంచి పదిహేనేళ్లలోపు పిల్లలు వారంలో 20 గంటల పాటు ఇంటర్నెట్‌పై గడుపుతున్నారని బ్రిటీష్ చిల్డ్రన్ కమిషనర్ అన్నే లాంగ్‌ఫీల్డ్ నివేదిక ఇచ్చారు. ఇంటర్నెట్‌ను అధికంగా ఉపయోగించడం వల్ల పిల్లల మానసిక ఆరోగ్యం దెబ్బతింటుందని గ్రహించిన బ్రిటీష్ ప్రభుత్వం గడిపే సమయంపై పరిమితి విధించాలని భావిస్తోంది. 13 ఏళ్ల వయస్సు పై బడిన వారికి మాత్రమే అనుమతి ఇవ్వాలని సోషల్ మీడియా సైట్లపై నియంత్రణ పెట్టాలని, పోర్నోగ్రాఫిక్ సైట్లకైతే 18 ఏళ్లు పైబడిన వారికి మాత్రమే, అదీ క్రెడిట్ కార్డు ద్వారా మాత్రమే ఆవకాశమివ్వాలనే నియంత్రణలు పెట్టాలనే ప్రతిపాదనలు వస్తున్నాయి. బ్రిటన్ ఇంటర్నెట్ వినియోగదారుల్లో మూడో వంతు 18 ఏళ్ల వయస్సులోపు వారేనని లాంగ్ ఫీల్డ్ నివేదిక చెబుతోంది. మరో నివేదిక 10 నుండి 12 ఏళ్లలోపు పిల్లల్లో 75 శాతం మంది సోషల్ మీడియా అకౌంట్లు కల్గి ఉన్నారని వెల్లడిస్తోంది. సోషల్ మీడియా అధికంగా ఉపయోగించడం పిల్లలకు స్మోకింగ్, ఊబకాయం కన్నా ప్రమాదకరమని బ్రిటీష్ ప్రభుత్వ ఆరోగ్య కార్యదర్శి జెర్మీ హంట్ హెచ్చరించారు. పిల్లలకు వారి వయస్సుకు తగిన సమాచారం మాత్రమే ఇంటర్నెట్‌లో వారికి అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

మొదటి పేజీ తరువాయి

రమేష్, రవీంద్ర

రవీంద్రకుమార్‌ను ప్రకటించడంతో మస్తానరావు, రామయ్య తీవ్ర నిరాశకు గురయ్యారు. కుటుంబ సభ్యులతో చంద్రబాబు ఇంటికి బయలుదేరిన వర్ల రామయ్య ప్రకాశం బ్యారేజీ మీద నుండి తిరిగి ఇంటికి వెళ్లిపోయారని వార్తలొచ్చాయి. ఎంతోకాలంగా పార్టీని అంటిపెట్టుకుని పనిచేస్తున్న బీదా మస్తానరావు కూడా తీవ్ర నిరాశలోకి వెళ్లిపోయారు. రెండు రోజులుగా దీనిపై కుస్తీ పడుతూ వచ్చిన టిడిపి, ఆదివారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. తనకూ సీటు ఇవ్వాలని యనమల రామకృష్ణుడు ఎప్పటి నుండో కోరుతున్నారు. అయనకు కూడా ఈసారి నిరాశే మిగిలింది. అభ్యర్థుల ప్రకటన అనంతరం ఆయన కూడా అసంతృప్తిగానే బయటకు వెళ్లారని తెలిసింది. అయితే సిఎం రమేష్ రాయలసీమలోనూ, చంద్రబాబు కోటరీలోనూ కీలకంగా ఉండటంతో ఆయన ఎంపిక ఏకగ్రీవమైంది. ప్రత్యేక హోదా విషయంలోనూ ఆయన పోరాడాడని మీడియాకు లీకులిచ్చినప్పటికీ ఆయన ఆర్థికంగానూ, వ్యాపారపరంగానూ కీలక నేతకు బినామీగా ఉండటమే కారణమని టిడిపి సీనియర్ నాయకుడొకరు తెలిపారు. టిడిపిలో ఎప్పటి నుండో పనిచేస్తూ ఎంతోమంది రాజ్యసభ కోసం ఎదురు చూస్తున్నారని, వారికెవరికీ సీటు ఇవ్వకుండా సిఎం రమేష్‌నే మరోసారి కొనసాగించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. దీనిపై అధిష్టానం పునరాలోచించాలని కోరుతున్నారు. బీదా మస్తానరావు కూడా చంద్రబాబు కోటరీలో కీలకమైన వ్యక్తే అయినప్పటికీ ఆయనకు సీటు ఇవ్వకపోవడం వెనుక కుల సమీకరణలు అడ్డుగా ఉన్నాయంటున్నా, అది నిజం కాదని టిడిపి సీనియర్లే చెబుతున్నారు. చంద్రబాబుపై కేసులున్న సమయంలో ఆయన తరఫున నూతనంగా ఎంపిక చేసిన కనకమేడల రవీంద్రకుమార్ గట్టిగా వాదించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి సిఎంగా ఉన్న సమయంలోనూ రవీంద్రకుమార్ దాదాపు అన్ని కేసుల నుండి చంద్రబాబును బయటపడేశారు. దీంతో అతనికి కూడా చంద్రబాబు ఖాతాలోనే సీటు ఇచ్చారనే వార్తలొస్తున్నాయి. అయితే ఇప్పటి వరకూ ఒక ఎస్సీకిగానీ, బిసికిగానీ సీటు ఇవ్వొచ్చని వార్తలు రావడం, అనంతరం రెండుసీట్లు అగ్రకులాల వారికే కేటాయించడంపై ఎస్సీ, బిసిలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. అయితే వర్ల రామయ్యకు సీటు ఖరారైందని వార్తలు రావడంతో ఆయన పలు ఛానళ్లలో చంద్రబాబుకు శుభాకాంక్షలు కూడా తెలిపారు. అభ్యర్థిత్వానికి సాధారణ పరిశీలనలోకి మాత్రమే వర్ల పేరును తీసుకుందని, అంతమాత్రాన ఎంపిక చేసినట్లు కాదని టిడిపి వర్గాలు పేర్కొన్నాయి.

కాలుష్య పరిశ్రమలపై చర్యలేవీ ?

కాలుష్య కారక రసాయన రహిత (వైట్ కేటగిరీ) 59 పరిశ్రమలు ఉన్నాయి. వాటిలో అత్యంత ప్రమాదకర స్థాయిలో కాలుష్యాన్ని కలిగించే పరిశ్రమలు అత్యధికంగా విశాఖ జిల్లాలో 325, చిత్తూరు జిల్లాలో 309, ప్రకాశంలో 254 పరిశ్రమలున్నాయి. అయితే పలు పరిశ్రమలు పిసిబి నిబంధనల ప్రకారం సరైన ఇటిపి నిర్వహించకపోవడం, వాయు కాలుష్యాన్ని కలిగించడం, వ్యర్థాల నిర్వహణలో లోపాలు ఉండటాన్ని అధికారులు గుర్తించారు. ఈమేరకు ఆ పరిశ్రమలకు నోటీసులు అందజేశారు. అయితే నోటీసులు జారీ చేయడం వరకే పిసిబి పరిమితమవుతోంది. ఆ పరిశ్రమలపై తనిఖీలు నిర్వహించడం, నిరంతర పర్యవేక్షణ చేయడం వంటివి అమలు జరగడంలేదు. దీంతో అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. పలు జిల్లాల్లో అధికార పార్టీకి చెందిన వారి పరిశ్రమల జోలికి అధికారులు వెళ్లడంలేదు.

పరిశ్రమలకు సులభంగా అనుమతులివ్వడం వల్లే ఈ సమస్య వస్తోందని పలువురు విశ్లేషకులు చెబుతున్నారు. తొలుత ఆన్‌లైన్‌లోనే సదరు పరిశ్రమ నెలకొల్పేందుకు ఏయే నిబంధనలు ఉండాలో వివరించి, వాటికి కొంత సమయమిచ్చి ఆ గడువులోగా నిబంధనలు పాటించాలని చెబుతూ 21 రోజుల్లోనే అనుమతులిచ్చేస్తున్నారు. ఇక గడువు ముగిసినా, ఆ పరిశ్రమలు నిబంధనలకు నీళ్ళొదిలినా పట్టించుకోవడంలేదు. ఆ పరిసర ప్రాంతాల నుంచి ఫిర్యాదులొస్తే తప్ప పిసిబి అధికారులు వాటివైపు కన్నెత్తికూడా చూడడంలేదు. దీనివల్లే ఎక్కువ శాతం పరిశ్రమలు ఇష్టానుసారంగా కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయన్న విమర్శలొస్తున్నాయి.

సిబ్బంది కొరత కూడా కారణమే

పిసిబిలో సిబ్బంది, అధికారుల కొరత ఉండటంతో తనిఖీలు నామమాత్రంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం పిసిబిలో 163 పోస్టుల్ని భర్తీ చేయాలి. ఇందులో ముఖ్యంగా సైంటిఫిక్, టెక్నికల్ సిబ్బందిని భర్తీ చేసేందుకు అనుమతివ్వాలని పిసిబి ప్రభుత్వాన్ని కోరినా ఇప్పటివరకు ఎలాంటి స్పందనా లేదు. పరిశ్రమల కోసం పెట్టుబడుల్ని ఆహ్వానిస్తున్న ప్రభుత్వం అందుకు తగినవిధంగా అనుమతులిచ్చేందుకు తగిన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని పిసిబి అధికారులు అభిప్రాయపడుతున్నారు.

సౌర విద్యుత్‌దే భవిత

మొదటి పేజీ తరువాయి

సాధించేందుకు ఆర్థిక, క్రమబద్ధీకరణ ఇబ్బందులను ఎన్నిటినో ఎదుర్కోవలసి ఉంటుందన్నారు. ప్రభుత్వం, ప్రైవేటు రంగం, పౌర సమాజం మూడు ఒక్కతాటిపై నడిచి వీటిని ఎదుర్కోవలసి ఉంటుందన్నారు. చారిత్రాత్మక పారిస్ వాతావరణ ఒప్పందం నుంచి వైదొలిగిన దేశాలను ప్రస్తావిస్తూ పూర్తి ఫలితాలు సాధించేందుకు ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్ దేశాలన్నీ కూడా కలిసికట్టుగా ఉండాలన్నారు. పారిస్ వాతావరణ ఒప్పందం నుంచి బయటకు వస్తామన్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నిర్ణయాన్ని మాక్రాన్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. 2015డిసెంబరులో జరిగిన ఈ ఒప్పందంపై దాదాపు 2 వందల దేశాలు సంతకాలు చేశాయి. గ్రీన్‌హౌస్ ఉద్గారాలకు కళ్ళెం వేసి 2 డిగ్రీల వరకు గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించే లక్ష్యంతో పారిస్ ఒప్పందం జరిగింది. గత ఏడాది నవంబరులో సిరియా ఈ ఒప్పందంపై సంతకం చేయడంతో అమెరికా దీనిని నుంచి వైదొలిగిన ఏకైక దేశంగా మిగిలిపోయింది. "అంతర్జాతీయ సౌర కూటమి (ఐఎస్ఎ) సభ్యదేశాలు పూర్తి ఫలితాలు సాధించేందుకు పనిని ప్రారంభించాయి. అవి ఎవరి కోసం వేచి ఉండలేదు. మధ్యలోనే ఆగిపోలేదు. కొన్ని దేశాలు నేలవిడిచి సాముచేయాలనుకుని, పారిస్ ఒప్పందాన్ని విడిచి వెళ్ళాయి." అని ఆయన చెప్పారు. పారిస్ ఒప్పందం నుంచి బయటకు వెళ్ళడం మంచిదని వారు భావించారన్నారు. ప్రపంచ జనాభాలోని 3/4వంతు జనాభాకు ఐఎస్ఎ దేశాలు ప్రాతినిధ్యం వహిస్తున్నాయని మాక్రాన్ తెలిపారు. దాదాపు 20-50 శాతం జనాభాకు విద్యుత్ సౌలభ్యం లేదని ఆయన చెప్పారు. ఐఎస్ఎ దేశాల ఉమ్మడి లక్ష్యం 2030 నాటికి ఒక టెర్రావాట్ సౌర ఇంధనాన్ని సాదించడం ఉమ్మడి లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రపతి భవన్‌లోని కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే ఈ సదస్సులో 23 దేశాల అధినేతలు పాల్గొన్నారు. వివిధ దేశాలకు చెందిన ప్రతినిధులూ పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సౌర విద్యుత్‌కు మరింత ప్రాచుర్యం కల్పించే అంశాలపై సదస్సు చర్చించింది.

ఉత్తరప్రదేశ్‌లో కీలక ఉప సమరం

మొదటి పేజీ తరువాయి

ఎస్‌పితో ఉన్న వైరం కారణంగా ఇప్పుడు మాయవతి మద్దతు పలికినప్పటికీ ఓటు వేస్తారా అనేది కాస్త ప్రశ్నార్థకంగానే ఉంది. అయితే సామాజిక పొందికల రీత్యా ఇక్కడ రెండు పార్టీల మధ్య పోటాపోటీగా పరిస్థితి ఉంది. ఇక ఫూల్‌పుర్‌లోనూ పరిస్థితి ఈవిధంగానే ఉంది. బిజెపి, ఎస్‌పి రెండు పార్టీలూ కుర్మీ కులానికి చెందిన అభ్యర్థులనే పోటీలో నిలిపాయి.

2014లో ఈ నియోజకవర్గంలో మోడీ హవాతో బిజెపి మూడు లక్షలకు పైగా ఓట్ల మెజార్టీతో గెలుపొందింది. గోరక్‌పూర్‌లోనూ 2014లో యోగీ మూడు లక్షలకు పైగా ఓట్ల మెజార్టీతో గెలిచారు. యోగీ సిఎం అయిన తర్వాత మొదటిసారి ఈ ఉప ఎన్నికల ద్వారా పెద్ద పరీక్షను ఎదుర్కొంటున్నారు. ఈనెల 14న తేదీన ప్రజల తీర్పు ఏంటో తెలియనుంది.

బీహార్‌లోనూ ఉప ఎన్నికలు

బీహార్‌లో కూడా ఆదివారం ఒక లోక్‌సభకు, రెండు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరిగాయి. ఆర్జేడి ఎంపీ మరణంతో ఆరారియాలో జరిగిన ఉప ఎన్నికలో 57 శాతం పోలింగ్ నమోదయ్యింది. జెహనాబాద్ అసెంబ్లీ స్థానంలోనూ ఆర్జేడి ఎమ్మెల్యే మరణంతో ఉప ఎన్నికలు జరిగాయి. ఇక్కడ 50 శాతం ఓటింగ్ నమోదయింది. బిజెపి ఎమ్మెల్యే మరణంతో భభువా స్థానంలో ఉప ఎన్నిక జరగగా 54 శాతం పోలింగ్ నమోదయింది. మహాకూటమి నుంచి నితీష్ కుమార్ బయటకు వచ్చిన తర్వాత మొదటిసారి జరుగుతున్న ఈ ఉప ఎన్నికలు బీహార్ సిఎంకు ప్రతిష్టాత్మకంగా మారాయి. బిజెపి, జెడియు కలిసి పోటీచేస్తుండగా ఆర్జేడి, కాంగ్రెస్ పొత్తు పెట్టుకున్నాయి. అరారియాలో బిజెపితోనూ, జెహనాబాద్‌లో జెడియుతోనూ ఆర్జేడి పోటీ పడుతోంది. భభువాలో బిజెపి, కాంగ్రెస్ అభ్యర్థులు పోటీపడుతున్నారు.

టిఆర్ఎస్ అభ్యర్థులు వీరే

అభ్యర్థి బల్‌రాంనాయక్ పోటీ చేస్తే, ఈ నెల 23న ఎన్నికలు జరుగుతాయి. లేని పక్షంలో టిఆర్ఎస్ అభ్యర్థులు ముగ్గురూ ఏకగ్రీవంగా ఎన్నికవుతారు.

అభ్యర్థుల వివరాలు

జోగినపల్లి సంతోష్ కుమార్; స్వస్థలం కరీంనగర్ జిల్లా బోయిన్‌పల్లి మండలం కొదురుపాక. పుణె యూనివర్సిటీ నుంచి ఎంబీఏ పూర్తి చేశారు. పర్సనల్ మేనేజ్ మెంట్‌లో మాస్టర్స్ చేశారు. టిఆర్ఎస్ ఆవిర్భావం కంటే ముందు నుంచీ పార్టీ ఏర్పాటు ప్రక్రియలో సంతోష్ కుమార్ పాలుపంచుకున్నారు. ప్రస్తుతం ఆయన టిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. బడుగుల లింగయ్య యాదవ్; స్వస్థలం నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం భీమారం. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుదీర్ఘ కాలం టిడిపి అధ్యక్షుడిగా పని చేశారు. తెలంగాణా ఏర్పడ్డాక కెసిఆర్ పిలుపు మేరకు 2015లో టిఆర్ఎస్‌లో చేరారు. ప్రస్తుతం టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్నారు. బండా ప్రకాష్ ముదిరాజ్; స్వస్థలం వరంగల్. ఆయన ఎంఎ, పిహెచ్‌డి పూర్తి చేశారు. ప్రస్తుతం టిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు.

'ఆదరణ'కు ఆంక్షలు

మొదటి పేజీ తరువాయి

50 ఏళ్ల లోపు ఉండడంతో పాటు, గతంలో ఎన్నడూ రుణాలు తీసుకొని ఉండకూడదని పేర్కొన్నారు. అలాగే స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ తీసుకొని, ప్రజాసాధికార సర్వేలో పేరును నమోదు చేసుకొని ఉండాలి. ఈ ఏడాది రుణం తీసుకున్న వారు వచ్చే మూడేళ్లలో ఎటువంటి రుణాలూ తీసుకోకూడదని నిబంధనలు పెట్టారు.

ఈ నిబంధనలపై బిసి సంఘాల నేతలు తీవ్ర అభ్యంతరాల్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ పథకం ద్వారా ప్రభుత్వం ఇచ్చే రుణాలు ఏ మూలకు సరిపోవని పేర్కొంటున్నారు. మండల కేంద్రాలు, తాలూకా కేంద్రాల్లో ల్యాండ్రీ, బార్బర్, టైలరింగ్ షాపులు పెట్టుకోవాలంటే కనీసం రూ. 50 వేల నుంచి రూ. 80 వేలు ఖర్చవుతుందని, అదే పట్టణాల్లో అయితే కనీసం లక్ష రూపాయలవుతుందని చెబుతున్నారు. ఒక ఇస్త్రీ పెట్టె ఖరీదు రూ. 8 వేల నుంచి రూ. 10 వేలు వరకు ఉంటుందని, అలాగే కుట్టు మిషన్ ధర రూ. 10వేల వరకు ఉంటుందని చెబుతున్నారు. ప్రభుత్వం అందించే రుణాలతో పనిముట్లే కొనలేని పరిస్థితి ఉంటే ఇక షాపులు పెట్టుకోవడం ఎలా సాధ్యమవుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం అందించే రుణాల్లో పది శాతాన్ని లబ్ధిదారులు భరించాల్సి ఉంటోందని, ఆ స్థోమతే వారికి ఉంటే ఇక ప్రభుత్వం చేసేదేంటని ప్రశ్నిస్తున్నారు. కుల వృత్తులు చేసుకునే వారికి వయసుతో సంబంధం ఉండదు. చివరిదాకా కుటుంబాల్ని నెట్టుకురావాల్సిందే. ఆయా వృత్తుల ద్వారా వచ్చే ఆదాయం అంతంత మాత్రమే ఉంటుంది. కుటుంబంలో ఉన్న వారందరూ ఆ వృత్తిని చేసుకుంటే తప్ప పూట గడవదు. ఇక అనారోగ్యాలతో బాధపడేవారు, దీర్ఘకాలిక వ్యాధులతో సతమతమయ్యే వారు, అంగవైకల్యం కలిగిన వ్యక్తులు ఆ కుటుంబంలో ఉంటే పరిస్థితి మరింత దయనీయంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో లబ్ధిదారుల వయసును 50 సంవత్సరాలకు కుదించడం ద్వారా వారి జీవనాధారాన్ని తగ్గించడమే అవుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. శిక్షణకు సంబంధించిన నిబంధనలపై కూడా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. నైపుణ్యం లేనిదే కుల వృత్తుల్లో రాణించలేరు. చిన్న నాటి నుంచే వారికి ఆయా వృత్తుల్లో తర్ఫీదు ఉంటుంది. అటువంటిది నైపుణ్యాభివృద్ధి శిక్షణ తీసుకున్న వారికే రుణాలిస్తామని ప్రభుత్వం చెప్పడంపై లబ్ధిదారులు మండిపడుతున్నారు. మరలా శిక్షణ అవసరంలేదని వారంటున్నారు. ఇదిలా ఉంటే సాధికార సర్వేలో పేర్లు నమోదు చేసుకున్న వారికే రుణాలిస్తామని చెప్పడంతో, నమోదు చేసుకోని వారి పరిస్థితేంటని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఏపి గ్రే హౌండ్స్‌కు కేంద్రం మొండి చెయ్యి

మొదటి పేజీ తరువాయి

గ్రేహౌండ్స్ ఏర్పాటుకు గత నాలుగేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తూనే ఉంది. శిక్షణా కేంద్రం కోసం రూ.858.37 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలను పంపింది. రాజధాని ప్రాంతమైన కృష్ణా, గుంటూరు జిల్లాల్లో 2087.09 హెక్టార్ల అటవీ భూమిని గుర్తించింది. భూమికి సంబంధించి కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ నుంచి సూత్రప్రాయ అంగీకారం కూడా లభించింది. కేంద్ర ప్రభుత్వం తుది అనుమతులు మంజూరు చేస్తే రాష్ట్ర ప్రభుత్వం భూమిని స్వాధీనం చేసుకునే వెసులుబాటు ఉంటుంది. అయినా కేంద్రం ఇంత వరకు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు.

హోం మంత్రిత్వ శాఖకు లేఖ......!

రాష్ట్రంలో గ్రేహౌండ్స్, ఆక్టోపస్ దళాల శిక్షణా కేంద్రం ఏర్పాటులో జరుగుతున్న జాప్యాన్ని నివారించి, ప్రక్రియను వేగవంతం చేయాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది నవంబర్ 27న లేఖ రాసింది. ప్రాథమిక అనుమతులు మంజూరయ్యాయని, మొదటి దఫాగా కనీసం రూ.200 కోట్లు విడుదల చేస్తే పనులు ప్రారంభిస్తామని పేర్కొంది. కేంద్ర బడ్జెట్‌కు ముందు ఈ ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకోవాలని ఈ ఏడాది జనవరి 12న మరోసారి గుర్తు చేసింది. అయితే, కేంద్రం నుంచి ఇంత వరకు ఎటువంటి సమాధానం రాకపోగా, బడ్జెట్‌లో ఎటువంటి నిధులూ కేటాయించలేదు. దీంతో గ్రేహౌండ్స్ శిక్షణా కేంద్రం ఏర్పాటుపై నీలి నీడలు కమ్ముకున్నాయి. గత్యంతరంలేక ఆంధ్రప్రదేశ్ అధికారులు ఇప్పుడు తెలంగాణాలోని శిక్షణా కేంద్రంపై ఆధారపడవలసిన పరిస్థితులు నెలకొన్నాయి. ఎప్పుడు ఏర్పాటవుతుందో తెలియని గందరగోళ పరిస్థితుల్లో అధికారులు కేంద్ర ప్రభుత్వం వైపు ఎదురుచూస్తున్నారు.

అడవి అగ్నిలో 40 మంది విద్యార్థులు

చెన్నై : తమిళనాడులోని ఒక అటవీ ప్రాంతంలో చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో 40 మంది విద్యార్థులు చిక్కుకుపోవడం కలకలం రేపింది. అధికార యంత్రాంగం తక్షణమే స్పందించి సహాయ చర్యలు చేపట్టింది. రాత్రి 11 గంటల ప్రాంతానికి 30 మంది విద్యార్థులను భద్రతా సిబ్బంది కాపాడగలిగారు. మరో 10 మంది కోసం గాలింపు చర్యలు జరుగుతున్నాయి. తమిళనాడు పశ్చిమ కనుమల్లోని కురంగని పర్యాటక ప్రాంతంలోని అడవిలో ఆదివారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రాథమిక సమాచారం ప్రకారం 40 మంది విద్యార్థులు కేరళలోని మన్నారు నుండి ట్రెక్కింగ్ చేసుకుంటూ కొండల మీదగా తమిళనాడులోని తెని వరకు వస్తున్నారు. వేసవి కాలంలో అడవులలో ఇలా మంటలు చెలరేగడం సహజమే. ఇలా అనూహ్యంగా ఆదివారం చెలరేగిన మంటల్లో వారు చిక్కుకుపోయారు. ఈ విషయం తెలిసిన వెంటనే అటవీ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఇతర శాఖల సహకారం తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా స్పందించింది. కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి హెలికాప్టర్లను రంగంలోకి దించింది. రాత్రి పది గంటల ప్రాంతంలో ముఖ్యమంత్రి కార్యాలయం 30 మంది విద్యార్థులను కాపాడగలిగామని, మిగిలిన వారి కోసం గాలింపు జరుగుతోందని ప్రకటించింది.

హైపర్‌సోనిక్ క్షిపణిని పరీక్షించిన రష్యా

మాస్కో : అత్యాధునికమైన కింజాల్ క్షిపణిని జయప్రదంగా పరీక్షించినట్లు ఆదివారం నాడు రష్యా ప్రకటించింది. కింజాల్ అని పేరు పెట్టిన ఈ క్షిపణిని మిగ్ 31 యుద్ధ విమానం నుండి ప్రయోగించారు. శబ్దానికి మించి పదిరెట్ల వేగంతో ప్రయాణించే ఈ క్షిపణి ఇతర దేశాల క్షిపణి రక్షణ వ్యవస్థలను అధిగమిస్తుందని అధ్యక్షుడు పుతిన్ ప్రకటించారు. ముందు నిర్ణయించిన ప్రణాళిక ప్రకారం క్షిపణిని ప్రయోగించామని, క్షిపణి లక్ష్యాన్ని ఛేదించిందని రష్యన్ అధికారులు తెలిపారు.

'పది'కి సిద్ధం

మొదటి పేజీ తరువాయి

ఇప్పటికే పరీక్షల విభాగం అన్ని పాఠశాలలకు అందజేసింది. హాల్ టిక్కెట్లు అందని విద్యార్థులు www.bseap.org వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకొని పాఠశాల ప్రధానోపాధ్యాయుల చేత సంతకం చేయించుకొని పరీక్షలకు హాజరు కావాల్సి ఉంటుంది. ప్రతి జిల్లాలోనూ ఐదు చొప్పున సమస్యాత్మక పరీక్షా కేంద్రాల్ని గుర్తించిన పరీక్షల విభాగం, వీటిల్లో సిసి కెమెరాల్ని ఏర్పాటు చేయనుంది. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉన్నందున, పరీక్ష ముగిసే వరకూ జిరాక్స్ కేంద్రాల్ని మూసివేయాలి. విద్యార్థులు యునిఫాంతో కాకుండా సివిల్ దుస్తులతో హాజరు కావాలి.

ఏయన్నార్‌గా నాగచైతన్య



అలనాటి నటి సావిత్రి జీవితగాథను తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. అశ్వనిదత్ సమర్పకుడిగా అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'మహానటి'. కీర్తి సురేష్ టైటిల్ పాత్రలో నటిస్తోంది. జెమిని గణేషన్ పాత్రలో దుల్కార్ సల్మాన్ నటిస్తున్నారు. ఇంకా ఈ చిత్రంలో కీలక పాత్రలకు మహామహుల్ని ఎంపిక చేశారు. అయితే సావిత్రి జీవితంలో కెరీర్ పరంగా ఎన్టీఆర్, ఏఎన్నార్ పాత్రలు అంతే కీలకం. మరి ఆ పాత్రల్లో నటించేది ఎవరు? ఇంతవరకూ ఈ ప్రశ్నకు సరైన సమాధానం లేదు. తాజా సమాచారం మేరకు ఈ చిత్రంలో నాగచైతన్య తన తాతయ్య నాగేశ్వరరావు పాత్రలో కనిపించనున్నాడని తెలుస్తోంది. ఇప్పటికే ప్రకాష్ రాజ్, క్రిష్ లాంటి వారందరూ కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రం నాగచైతన్య ఎంట్రీతో మరింత ప్రాముఖ్యతను సంతరించుకొంది. త్వరలోనే నాగచైతన్య షూటింగ్‌లో పాల్గొంటాడు.

'నీది నాది ఒకే కథ'

శ్రీవిష్ణు హీరోగా నటించిన 'నీది నాది ఒకే కథ' చిత్రం ఈనెల 23న విడుదల కానుంది. ఇటీవలే విడుదలైన టీజర్, పాటలకు చక్కటి స్పందన వస్తున్న ఈ చిత్రంలో శ్రీవిష్ణు స్టూడెంట్‌గా కనిపించనున్నారు. టీజర్‌లో చిత్తూర్ యాసలో శ్రీవిష్ణు పలికిన ఘాటైన డైలాగులకు యూత్‌ను విశేషంగా ఆకట్టుకొని చిత్రం పై ఆసక్తిని భారీగా పెంచేసాయి. ఇప్పటివరకు విడుదలైన పాటలు కూడా సంగీత ప్రియులను



శ్రీవిష్ణు, సాట్నా టైటస్

అలరిస్తున్నాయి. వేణు ఊడుగుల దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో శ్రీవిష్ణు సరసన 'బిచ్చగాడు' ఫేమ్ సాట్నా టైటస్ జతగా కనిపించనున్నారు. ప్రశాంతి, కృష్ణ విజయ్, అట్లూరి నారాయణరావు, అరాన్ మీడియా వర్క్స్, శ్రీ వైష్ణవి క్రియేషన్స్ బ్యానర్‌పై సంయుక్తంగా నిర్మించారు.

'ప్రతి విద్యార్థి ఎంజాయ్ చేసేలా కిరాక్ పార్టీ'



సిమ్రాన్ పరింజ, అనిల్ సుంకర, అల్లరి నరేశ్, నిఖిల్, సంయుక్త హెగ్డే తదితరులు

నిఖిల్ హీరోగా కన్నడ సూపర్ హిట్ సినిమా 'కిరిక్ పార్టీ'ని ఎ.కె.ఎంటర్ టైన్మెంట్ సంస్థ తెలుగులో అదే పేరుతో నిర్మిస్తోంది. నిఖిల్ సరసన సంయుక్త హెగ్డే, సిమ్రాన్ పరీంజా కథానాయికలుగా నటిస్తున్నారు. శరణ్ కొప్పిశెట్టి దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. ఈ చిత్రానికి సుధీర్ వర్మ స్క్రీన్ ప్లే సమకూర్చగా మరో దర్శకుడు చందూ మొండేటి సంభాషణలు సమకూరుస్తుండడం విశేషం. యూత్ ఫుల్ ఎంటర్ టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం ఈనెల 16న విడుదలకు సిద్ధమైంది. కాగా, ఈ చిత్ర ఆడియో విడుదల వేడుకను గన్నవరం ఉషారామా ఇంజనీరింగ్ కాలేజ్‌లో నిర్వహించారు. 'అల్లరి' నరేష్ ముఖ్య అతిథిగా విచ్చేసిన ఈ చిత్రం ఆడియో విడుదల వేడుకలో చిత్ర బందం పాల్గొంది.

చిత్ర నిర్మాత అనిల్ సుంకర మాట్లాడుతూ.. "మా బ్యానర్ సొంత హీరో లాంటి అల్లరి నరేష్ అడగ్గానే విజయవాడలో జరుగుతున్న ఈ వేడుకకు విచ్చేయడం చాలా ఆనందంగా ఉంది. ఈ చిత్రం కోసం వర్క్ చేసిన సుధీర్ వర్మ, చందు మొండేటిలకు ప్రత్యేక కతజ్ఞతలు తెలియజేసుకొంటున్నాను. ఈనెల 16కి సినిమా కూడా ఈ ఆడియో ఫంక్షన్‌లా రీసౌండ్ వస్తుందని ఆశిస్తున్నాం" అన్నారు.

'అల్లరి' నరేష్ తెలుపుతూ.. 16న స్టూడెంట్స్ ఎవరూ అటెండెన్స్ గురించి పట్టించుకోకండి.. అటెండెన్స్ వేయించే బాధ్యత నాది. నాకు నిఖిల్‌ని చూసినప్పుడల్లా డ్యూరో సెల్ బ్యాటరీ గుర్తుకొస్తుంది. మా ఆహుతి ప్రసాద్‌గారి అబ్బాయి కార్తీక్ ఈ చిత్రంలో నటించడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా కన్నడలో ఎంత పెద్ద హిట్ అయ్యిందో.. అదే స్థాయిలో తెలుగులోనూ సూపర్ హిట్ అవ్వాలని ఆశిద్దాం" అన్నారు.

నిఖిల్ మాట్లాడుతూ.. కన్నడలో మంచి సినిమా ఒకటి ఉందని గుర్తించి.. నాకు ఈ కథలో నటించే అవకాశాన్ని అనిల్ సుంకర ఇచ్చారు. "కార్తికేయ"తో చందు మొండేటి, "స్వామి రారా"తో సుధీర్ వర్మకు ఎలాంటి మంచి పేరు వచ్చిందో.. 'కిరాక్ పార్టీ'తో శరణ్‌కి కూడా అదే స్థాయి పేరొస్తుంది. ఎంటర్‌టైన్మెంట్‌తోపాటు మంచి మెసేజ్ కూడా ఉన్న సినిమా ఇది" అన్నారు.

చిత్ర కథానాయిక సిమ్రాన్ పరీంజా మాట్లాడుతూ.. "తెలుగులో నా మొట్టమొదటి అవకాశం "కిరాక్ పార్టీ" అవ్వడం చాలా ఆనందంగా ఉంది. సాంగ్స్, ట్రైలర్‌కి సూపర్బ్ రెస్పాన్స్ వచ్చింది. సినిమాని కూడా అదే స్థాయిలో ఆదరిస్తారని ఆశిస్తున్నాను" అన్నారు. చిత్ర దర్శకుడు శరణ్ కొప్పిశెట్టి మాట్లాడుతూ.. ప్రతి ఒక్క విద్యార్థి ఎంజాయ్ చేసేలా సినిమా ఉంటుందన్నారు. ఈ చిత్రానికి సంగీతం: అజనీష్ లోక్నాధ్.

అందరూ అర్హులే

ప్రతినెల రెండో ఆదివారం రోజు మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ ఆదివారం కూడా హెల్త్ క్యాంప్‌ను నిర్వహించారు. ఇన్‌సైట్స్ డయాగ్నోస్టిక్స్‌కు సంబంధించిన డా.శ్రీకాంత్ అప్పసాని, డా.శ్రీనివాసరాజు కలిదిండి సమక్షంలో ఈ క్యాంప్ జరిగింది. లివర్, కొలెస్ట్రాల్ ఇన్‌స్పెక్షన్‌కు సంబంధించిన వ్యాధుల నిర్ధారణ పరీక్షలు జరిపారు. ఈ హెల్త్ క్యాంప్‌కు హాజరు కానివారు నేరుగా తమ హాస్పిటల్‌కు వెళ్తే 25 శాతం డిస్కౌంట్ ఇవ్వడం జరుగుతుందని డా.శ్రీకాంత్ అప్పసాని తెలియజేశారు. ఈ సందర్భంగా 'మా' అధ్యక్షులు శివాజీ రాజా, జనరల్ సెక్రటరీ నరేష్ మాట్లాడుతూ.. "ఈ కమిటీ వచ్చిన తర్వాత ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నాం. అయితే నటీనటులకు ముఖ్యమైనది ఆరోగ్యం జాగ్రత్తగా



ఆరోగ్యపరీక్షలు చేసుకుంటున్న నాగినీడు

కాపాడుకోవటం. అందుచేత ప్రతీ నెల రెండో ఆదివారం రోజు ఈ హెల్త్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నాం. కేవలం మా అసోసియేషన్‌లో మెంబర్స్ మాత్రమే కాకుండా ఇతర నటీనటులెవరైనా ఈ హెల్త్ క్యాంప్‌లో టెస్ట్ చేయించుకోవచ్చు" అన్నారు.

'వెపన్' చివరి షెడ్యూల్

'మంగళ', 'క్రిమినల్స్' వంటి విభిన్న చిత్రాలను నిర్మించిన మంత్ర ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రూపొందుతున్న మరో డిఫరెంట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'వెపన్'. అవినాష్, ప్రదీప్ రావత్, రాజారాయ్, రాజు, మధుబాబు ప్రధాన పాత్రల్లో ఆర్.ఎస్.సురేష్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని శర్మ చుక్కా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన చివరి షెడ్యూల్ ఈనెల 20 నుంచి జరుగుతుంది.

ఈ సందర్భంగా నిర్మాత శర్మ చుక్కా మాట్లాడుతూ "ఇప్పటివరకు జరిగిన షెడ్యూల్స్‌తో 90 శాతం చిత్రీకరణ పూర్తయింది. రామచంద్రాపురం, పసలపూడి పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ చేశాం. రెండు గ్యాంగ్‌ల మధ్య జరిగే వార్ నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుంది. 'వెపన్' టైటిల్‌కి పూర్తి జస్టిఫికేషన్ ఇచ్చే కథాంశంతో ఈ చిత్రం రూపొందుతోంది. దర్శకుడు సురేష్ ప్రతి సీన్‌ని చాలా అద్భుతంగా తీస్తున్నారు. గతంలో వచ్చిన 'మంగళ', 'క్రిమినల్స్' చిత్రాలు మా బేనర్‌కి మంచి గుర్తింపుని తీసుకొచ్చాయి. 'వెపన్' చిత్రం దాన్ని రెట్టింపు చేస్తే స్థాయిలో ఉంటుందని చెప్పగలను. బ్యాలెన్స్ షూటింగ్ పార్ట్, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ పూర్తి చేసి సమ్మర్‌లో చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం" అన్నారు.



'వెపన్'లో అవినాష్

'దెయ్యం చెప్పిన కథ'

శివ, సుప్రియ, సురేష్‌జెండా, సునీల్, పద్మ ముఖ్య నటీనటులుగా ప్రదీప్‌రాజ్ దర్శకత్వంలో, పెనాక దయాకర్‌రెడ్డి నిర్మిస్తున్న చిత్రం 'దెయ్యం చెప్పిన కథ'. నవీన్ జె.సంగీత దర్శకత్వంలో రూపొందిన పాటలు ఫిలించాంబర్‌లో ఘనంగా విడుదలయ్యాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా విచ్చేసిన ప్రముఖ దర్శకులు సాగర్,నిర్మాతలు రామ సత్యన్నారాయణ ,సాయి వెంకట్‌లు సంయుక్తంగా ఆడియో బిగ్ సిడిని ఆవిష్కరించారు. చిత్ర దర్శకుడు ప్రదీప్‌రాజ్ , నిర్మాత పి.దయాకర్ రెడ్డి మాట్లాడుతూ: తొలి ప్రయత్నంగా మేము కష్టపడి చేసిన ఈ సినిమా అందరికి నచ్చుతుంది. ఇందులో నటించిన నటీ నటులు ,టెక్నీషియన్స్ సహకరించారు. పాటలు ఉన్నతంగా తెరకెక్కించాం. థ్రిల్ కల్గించే కథనంతో చిత్రం వుంటుంది. దెయ్యం అనే అంశం ఇందులో ఆసక్తికరంగా వుంటుంది. త్వరలోనే సినిమాను రిలీజ్ చేస్తామని అన్నారు.



శివ, సుప్రియ

'అమీర్ పేట్ టు అమెరికా' ప్రయాణం



మణిచందన, పద్మజ, రామ్మోహన్, తనికెళ్ళభరణి, లక్ష్మణ్, శంకర్, కార్తీక్ తదితరులు

రాధా మీడియా బ్యానర్ పై శ్రీమతి స్వప్న కొమండూరి సమర్పించు చిత్రం 'అమీర్ పేట్ టు అమెరికా'. ఈ చిత్ర మొదటి ట్రైలర్‌ను నటుడు తనికెళ్ళ భరణి విడుదల చేయగా రెండవ ట్రైలర్‌ను రవికుమార్ విడుదల చేశారు. బందూక్ లక్ష్మణ్, డా. శ్రీనివాస్, నిర్మాత పద్మజ, కాసర్ల శ్యామ్, నటి మణిచందన, డా. రాజేశ్వరి, అంబర్ పేట్ శంకర్, మ్యూజిక్ డైరెక్టర్ కార్తీక్, మల్లన్న, సత్తి, మంగ్లీ, గాంధీ, గాయత్రి గుప్తా తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమం ఆదివారం ప్రసాద్ ల్యాబ్‌లో జరిగింది. ఈ సందర్భంగా తలికెళ్ల భరణి మాట్లాడుతూ.. టైటిల్ చాలా సహజంగా ఉంది. ప్రతి ఇంటినుంచి ఒక్కరు కచ్చితంగా అమెరికాలో ఉన్న వారే. అమీర్‌పేట్ టు అమెరికా ఈ ప్రయాణాన్నంతా ఈ సినిమాలో చూపించడం జరిగింది. నేను ఇందులో మంచి పాత్రను పోషించాను. ఈ సినిమాకు అన్నీ తానై రామ్మోహన్ భుజాలమీద వేసుకున్నారు. అంతే కష్టపడి సినిమాను తెరకెక్కించారు. యూత్‌ను అలరించే అన్ని అంశాలు ఈ చిత్రంలో ఉన్నాయి. ఈనెల 30న ఈ చిత్రం విడుదల చేయనున్నారని అన్నారు. ఈ చిత్రానికి కథ, కర్మ, క్రియ అయిన రామ్మోహన్ కొమండూరి మాట్లాడుతూ... ఎనభై శాతం అమెరికాలో ఇరవై శాతం ఇండియాలో చిత్రీకరించాం. అమీర్ పేట్ టు అమెరికా వెళ్లే వారి లైఫ్ స్వర్గంలా అనిపిస్తుంది. కానీ డాలర్ సంపాదించుకోవడానికి వారు చాలా కష్టాలు పడుతారు. ఆ సంఘటనల్ని ఈ సినిమాలో చూపించడం జరిగింది. ఈనెల 23న ఆడియో విడుదల చేసి నెలాఖరున 30న చిత్రాన్ని విడుదల చేస్తామని అన్నారు. నిర్మాత పద్మజ మాట్లాడుతూ.. ఈ చిత్రాన్ని తెరకెక్కించిన రామ్మోహన్ నా మరిది.. సినిమాను చాలా కష్టపడి తీశారు. మంచి సబ్జెక్ట్ ఉన్న సినిమా కనుక తప్పకుండా విజయం సాధిస్తుందని ఆశిస్తున్నా అన్నారు.

'బంగారు తెలంగాణ' గీతాలు

బిపిన్, రమ్య, అక్షర, లయన్ ఏవి స్వామి, బాబూమోహన్, సాయిత్రిశాంక్, ప్రధాన పాత్రలలో షిరిడి సాయి క్రియేషన్స్ పతాకంపై కూర అంజిరెడ్డి సమర్పణలో బిపిన్ స్వీయ దర్శకత్వంలో రూపొందించిన చిత్రం 'బంగారు తెలంగాణ'. ఈ చిత్రం ఆడియో విడుదలైంది. అంతకుముందు సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ కార్యాలయంలో చిత్ర ఆడియో సీడీలను రిలీజ్ చేసారు. బిపిన్ సంగీత సారథ్యంలో రూపొందిన ఈ చిత్రం ఆడియో కలర్స్ మ్యూజిక్ ద్వారా మార్కెట్లోకి విడుదలైంది.అనంతరం బిపిన్ మాట్లాడుతూ.. "తెలంగాణ కోసం ఎంతోమంది పోరాటం చేసి ఆత్మ బలిదా నాలు చేసుకొన్నారు. సినిమా పూర్తి అవడానికి నా మిత్రులు ఎంతోమంది సహకరించారు వారందరికీ నా కృతజ్ఞతలు. కో ప్రొడ్యూసర్ ఏవి స్వామి మాట్లాడుతూ... దర్శకుడు



బిపిన్, రమ్య, అక్షర, అంజిరెడ్డి, అశోక్‌కుమార్ తదితరులు

బిపిన్ తెలంగాణ గురించి నేటి ప్రజలకు యువకులకు తెలిసేలా ఈ చిత్రాన్ని రూపొందించారని అన్నారు. నటుడు అశోక్‌కుమార్ మాట్లాడుతూ... సినిమాని దర్శక నిర్మాతలు తపనతో తీశారని పేర్కొన్నారు.

మరో ప్రేమకథ

ఆయూష్, వర్ణిక హీరోహీరోయిన్లుగా నటిస్తోన్న చిత్రం ఇటీవలే గుంటూరులో ప్రారంభమైంది. ఇంకా పేరు నిర్ణయించని ఈ చిత్రాన్ని వ్యాంకిష్ మీడియా పతాకంపై షేక్ గౌస్ నిర్మిస్తున్నారు. రవి కుమార్ పొన్నగంటి దర్శకత్వం వహిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి ఎం.ఎల్.ఎ. ఆలపాటి రాజేంద్రప్రసాద్ క్లాప్ ఇవ్వగా, వైటి. నాయుడు గౌరవ దర్శకత్వం వహించారు. నిర్మాత మాట్లాడుతూ.. ప్రేమకథలో కొత్త కోణాన్ని ఆవిష్కరిస్తున్నాం. ఈ చిత్రానికి కెమెరా: దుర్గా ప్రసాద్, సంగీతం: అమ్మపండు.



ఆయూష్, వర్ణిక

సేవా సామ్రాజ్యంగా 'మనం సైతం'

ప్రముఖ నటుడు కాదంబరి కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'మనం సైతం' రోజు రోజుకూ తన సేవా సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటోంది. మనసున్న ఎంతో మంది మనం సైతంలో భాగమవుతున్నారు. తమకు వీలైనంత విరాళాలు అందిస్తున్నారు. అందుకే అత్యవసరంలో ఉన్న వాళ్లను ఎంపిక చేసి ఆర్థిక సహాయం అందిస్తోంది మనం సైతం. అలాంటి కొంతమందికి హైదారాబాద్ ఫిలిం ఛాంబర్‌లో ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు వీవీ వినాయక్, నిర్మాత సి కళ్యాణ్, దర్శకుడు జి నాగేశ్వరరెడ్డి, శ్రీ మిత్రా చౌదరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న డ్రైవర్ యూనియన్ రాజు, లైట్ మెన్ కూతురు అనూజ, నటుడు ధమ్ కొడుకు బాబు, దర్శకత్వ శాఖలో పనిచేస్తున్న ఉదయ్ కాంత్ తదితర పదమందికి చెక్‌లను అందజేశారు.

అనంతరం కాదంబరి కిరణ్ మాట్లాడుతూ... చిత్ర పరిశ్రమలో నాకు కష్టాలు ఉన్నాయని ఎవరూ చెప్పుకోరు. అలా చెప్పుకుంటే అవకాశాలు ఇవ్వరు. దగ్గరకు రానీయరు అనే అపోహ ఉంది. అయితే నేను నా జీవితంలోని కష్టాలను పరిశ్రమలోని వాళ్లతో పంచుకున్నాను. వాళ్లు నన్ను దూరం పెట్టకుండా ఆదరించారు. అప్పుడే అనిపించింది ఈ భావన తప్పని. మనకున్న బాధలను చెప్పుకోవడంలో తప్పు లేదు. ఇవాళ మనం సైతం ఇంతింతై విస్తరిస్తోంది. ఎంతోమంది కొత్తగా సేవాభావం ఉన్నవాళ్లు భాగస్వామ్యులు అవుతున్నారు. చిరంజీవిగారితో సహా పెద్దలంతా మమ్మల్ని ఆశీర్వదిస్తున్నారు. ఇవాళ వినాయక్, కళ్యాణ్ లాంటి వాళ్లు మా సంస్థను దీవించాడనికి వచ్చారు. వాళ్లకు కతజ్ఞతలు. అన్నారు.

దర్శకులు వీవీ వినాయక్ మాట్లాడుతూ.. కష్టాల్లో ఉన్న వాళ్ల గురించి మాట్లాడుతుంటే ఆయన కళ్లలో నీళ్లు వస్తున్నాయి. అంతగా ఇతరుల బాధను పంచుకోవడం అద్భుతం. నా వంతుగా మనం సైతంకు లక్ష రూపాయలు విరాళం అందిస్తున్నాను. ఇలాంటి సంస్థల్లో రాజకీయాలు చేరకుండా గొప్ప సంస్థగా తీర్చిదిద్దుతారని ఆశిస్తున్నా అన్నారు.

నిర్మాత సి. కళ్యాణ్ మాట్లాడుతూ... నిర్మాతలుగా మేము హీరోల, దర్శకుల పుట్టిన రోజులకు వేసే ప్రకటనల్లో కొన్ని సెంటిమీటర్లు తగ్గించి ఆ సొమ్ము మనం సైతంకు ఇస్తే చాలా బాగుంటుంది. మనం సైతం దేశవ్యాప్తంగా విస్తరించాలని అన్నారు.



కష్టాల్లో వున్న కార్మికులకు చెక్కులందిస్తున్న వినాయక్, కాదంబరి కిరణ్ తదితరులు

ప్రియమణి 'అంగులీక'



'అంగులీక' టీజర్, పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కోడి రామకృష్ణ, పక్కన దర్శకుడు ప్రేమ్

ప్రియమణి టైటిల్ పాత్రలో శ్రీ శంఖు చక్ర ఫిలింస్ పతాకంపై కోటి తూముల, ఎ.హితేష్ రెడ్డి నిర్మిస్తోన్న చిత్రం 'అంగులీక'. ప్రేమ్ ఆర్యన్ దర్శకుడుగా పరిచయమవుతున్నారు. దీపక్ హీరోగా నటిస్తోన్న ఈ చిత్ర టీజర్ ప్రముఖ దర్శకులు కోడి రామకష్ణ హైదారాబాద్‌లో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఈ కథ గురించి నాకు మొదటి నుంచి తెలుసు. టీజర్ చాలా బాగుంది. ఎన్ని అడ్డంకులు వచ్చినా అన్నింటినీ తట్టుకుంటూ నిర్మాతలు ఇంత వరకూ తీసుకొచ్చారు. టీజర్ టైమింగ్, కటింగ్ చూశాక దర్శకుడు సినిమా అద్భుతంగా తీశాడని అర్థమైంది. నిర్మాతలకు మంచి లాభాలు, దర్శకుడికి మంచి పేరు రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు.

నిర్మాతలు మాట్లాడుతూ... సూర్యగ్రహణం, కాలచక్రంతో కూడుకున్న కథాంశం ఇది. దర్శకుడు చాలా కాలం ఈ స్క్రిప్ట్ పై వర్క్ చేసి అద్భుతంగా తెరకెక్కించారు. ప్రస్తుతం గ్రాఫిక్స్ వర్క్ జరుగుతోంది. సినిమా అనుకున్న దానికన్నా చాలా బాగా వచ్చిందని తెలిపారు. దర్శకుడు ప్రేమ్ ఆర్యన్ మాట్లాడుతూ...కోడి రామకష్ణగారి ఇనిస్పిరేషన్‌తో ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేశాను. కాలచక్రంతో ముడిపడిన ఇద్దరు ప్రేమికుల వీరగాథ ఈ చిత్రం. అంగులీకగా టైటిల్ పాత్రలో ప్రియమణి చక్కగా నటించారు. కాలచక్రం, సూర్యగ్రహణం ఈ రెండు అంశాల చుట్టూ సినిమా తిరుగుతుంది. సూర్యగ్రహణం ఘడియల్లో విడిపోయిన ప్రేమజంట మళ్లీ సూర్యుడి ఆశీస్సులతో 585 ఏళ్ల తర్వాత కలుసుకుంటారు. అదే సమయంలో పగతో రగిలిపోతున్న దుష్టాత్మ ఆ జంటపై పగ తీర్చుకుందా? ఆ ప్రేమ జంట ఆత్మలకు ఎలా మోక్షం కలిగింది అనేది సినిమాకు హైలెట్‌గా ఉంటుందని అన్నారు.

ప్రజాశక్తి
విజయవాడ
సోమవారం 12-3-2018

రూపాయి





'క్రమశిక్షణతో కూడిన జీవనశైలి, ఆచరణాత్మక ప్రణాళికలనేవి భవిష్యత్తులో మెరుగైన ఆర్థిక ప్రగతికి గీటురాయి' అంటారు ప్రఖ్యాత అమెరికన్ వ్యాపారవేత్త, ఆర్థిక విశ్లేషకులు వారెన్ బఫ్ఫెట్. వివాహ జీవితానికి ముందు ఆర్థిక ప్రణాళికా అలాంటిదే. పెళ్లి అంటే కుటుంబ జీవితంలోకి అడుగుపెట్టినట్టే. అంటే ఖర్చులు పెరుగుతాయి. అయితే ఆ ఖర్చులను తట్టుకోగల ఆదాయమార్గాలూ ఉండాలి. అలా ఉంటే ఓకే. లేకుంటే బ్యాచిలర్ లైఫే సో బెటరూ!! అనుకోక తప్పదు. అందుకే పెళ్ళికి ముందు యువతీయువకులు కాస్త ఆర్థిక ప్రణాళిక వేసుకుని.. అంతో ఇంతో స్థిరపడ్డాకే పెళ్ళి జోలికెళ్ళండి.. అంటున్నారు నిపుణులు. అందుకే బ్యాచిలర్ లైఫ్‌లో అనుసరించదగ్గ పొదుపు మార్గాలేంటో ఈ వారం 'రూపాయి'లో చూద్దాం!!

ఇది.. బ్యాచిలర్స్ పొదుపు మంత్రం

చదువు తర్వాత, ఆ చదువుకు తగ్గ ఉద్యోగం, సరైన జీవనోపాధి అనేవి ఏ యువతీ యువకులకైనా తమ ముందుండే లక్ష్యాలు. అసలు చదువుకునే సమయంలోనే ఆర్థికపరమైన క్రమశిక్షణ అలవర్చుకోవడం, జీవితంలో స్థిరపడ్డానికి కావాల్సిన చదువుల్ని ఎంపిక చేసుకోవడం అనేది ముందుచూపుతో కూడిన ఆర్థిక ప్రణాళిక అంటున్నారు నిపుణులు. అందుకు జీవితంలో ఆర్థికంగా తోడ్పాటును అందించే చదువుల్ని ఎంపిక చేసుకోవడం, సరిపడా అధ్యయనం, భాషా, సాంకేతిక నైపుణ్యాలను పెంచుకోవడం, కొత్త విషయాల పట్ల సాధన.. ఇవన్నీ రేపటి ఆర్థిక సంపత్తికి ప్రత్యక్షంగా, పరోక్షంగా దోహదపడేవే. అందుకే బ్యాచిలర్ లైఫ్‌లోనే అంటే విద్యార్థిగా ఉన్నప్పటి నుంచే తొలి ఆర్థికప్రణాళిక సిద్ధం చేసుకోవడం అన్నివిధాలా మంచిది. అందుకు ముందుగా కొన్ని కేస్‌స్టడీస్ పరిశీలిద్దాం.



కేస్‌స్టడీ1:

అనిత సివిల్ ఎగ్జామ్స్ ప్రిపేర్ అవుతోంది. గ్రూప్2 రాస్తే మంచి ఉద్యోగమూ వచ్చింది. 'గవర్నమెంట్ ఉద్యోగం ఉంది కదా, మంచి సంబంధం చూస్తాం.. పెళ్లి చేసేసుకో అనితా..!' అని ఇంట్లోవాళ్ళు బలవంతం పెడుతున్నా.. ఒప్పుకోలేదు. 'ఎలాగైనా గ్రూపు-1 కొట్టాలి. ఇంకా మంచి హోదాగల సర్వీసులో చేరాలి' ఇదే అనిత సంకల్పం. అందుకు బాగా కష్టపడింది. సివిల్ పరీక్షల్లో మంచి ర్యాంక్ వచ్చింది. ఒకప్పటి అనితలా ఉండిపోయుంటే సాదాసీదా ఉద్యోగంతో సరిపెట్టుకోవాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు అనిత పేరుకి వెనుక ఐఎఎస్ అనే హోదా. సరిసమాన హోదాగల భర్త. ఇప్పుడు అనితకు రేపటి భవిష్యత్తు ఎంతో ఉజ్వలంగా కనపడుతోంది.

కేస్‌స్టడీ2:

అతని పేరు ప్రసాద్. తన స్నేహితుల్లా ప్రసాద్ పెళ్లికోసం తొందరపడిపోలేదు. ఉద్యోగం ఎలాగూ ఉంది. ఉండటానికి ఓ చిన్న ఇల్లు, అటూ ఇటూ తిరగడానికి స్కూటర్, కాస్త బ్యాంక్ బ్యాలెన్స్.. ఇవన్నీ సమకూర్చుకుంటేగానీ పెళ్లి జోలికి పోవొద్దనుకున్నాడు. అందుకనే కొన్నాళ్ళపాటు పెళ్ళి వాయిదా వేసుకున్నాడు. అనుకున్నట్టే అన్నీ సమకూర్చున్నాడు. ఆ తర్వాతే పెళ్లికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. మంచి సంబంధం కుదిరింది. ప్రసాద్ ఆర్థిక సమస్యల్లేని జీవితం గడుపుతున్నాడు.

పొదుపైన వివాహం

జీవితంలో స్థిరపడ్డాం అంటే దానికి తొలిమెట్టు పెళ్లికి ముందు అంతో ఇంతో ఆర్థికంగా కాస్తంత వెనకేసుకోవడం. పైన ఉదహరించిన కేస్‌స్టడీస్ కూడా అలాంటివే. ఒక్కమాటలో చెప్పాలంటే.. సొంతకాళ్ళపై నిలబడగలిగినప్పుడే భాగస్వామిని ఎంచుకోవడానికి అర్హత సాధించినట్టు. ఈ విషయంలో ఆడ, మగ ఇద్దరూ సమానమే. వచ్చేకాలం కంటే గతకాలం మేలంటారు పెద్దలు. పూర్వపు సమాజంలో పెళ్లీడు రాగానే పెళ్ళిళ్లు చేసేస్తే ఎలాగోలా బతికేస్తారులే' అనే ధోరణి ఉండేది. ఇప్పుడు కాలం మారింది. బంధం రోజు రోజుకూ భారమవుతోంది. ఆర్థికపరమైన సమ ఉజ్జీ లేకపోతే బంధాలు బోర్లాపడుతున్నాయి. అందుకే పెళ్ళికి ముందే ఆర్థిక ప్రణాళికతో సాగాలన్నది ఆర్థిక నిపుణుల మాట.



ప్రయత్నం.. నైపుణ్యం కీలకం

విజయవంతంగా చదువు పూర్తి చేయడానికి ఎంతటి క్రమశిక్షణ, పట్టుదల, ప్రణాళిక అవసరమో?! ఆ చదువుకు సార్ధకత చేకూర్చగల ఉద్యోగం, ఉపాధి సాధించే విషయంలోనూ అంతే క్రమశిక్షణ ఉండాలి. అందుకు తగ్గ ప్రయత్నమూ చేయాలి. చదువుకున్నంత మాత్రాన రాత్రికి రాత్రే ఉద్యోగం, ఉపాధి అవకాశాలు మనల్ని వెతుక్కుంటూ రావు. మెరుగైన అవకాశాలను అన్వేషించాలి. అందుకోసం వేగంగా పరుగెత్తాలి. అందుకు తగ్గ నైపుణ్యాలను, అదనపు అర్హతల్ని పెంచుకోవాలి. అలాంటప్పుడే చదువుకుతగ్గ ఉద్యోగం, ఉపాధి అవకాశాలను అందుకోగలం. సరియైన వయసు, సరియైన సమయంలో ఆదాయ మార్గాలను ఎంచుకోగలిగితే జీవితంలో స్థిరత్వానికి మార్గం సులువైనట్టే.



చదువు, ఉద్యోగం, పొదుపు

చదువు, ఉద్యోగం అనే విషయంలో అనుకున్న లక్ష్యాలను చేరుకున్నాక, ఆ తర్వాత 'పొదుపు' అనే అంశానికే ప్రాధాన్యత ఇవ్వాలంటున్నారు విద్య, ఉద్యోగ సలహాదారులు. చాలామంది యువత ఉద్యోగం రాగానే ఇక పెళ్లి చేసుకోవడమే మిగిలిందనే భ్రమలో ఉంటారు. కొంతమందైతే పెళ్లి చేసుకోవడం కోసమే ఏదో ఒక ఉద్యోగం, ఉపాధి అనే ధోరణిలో పరుగులు తీస్తారు. ఇలాంటి సమన్వయంలేని ప్రణాళిక అంతమంచిది కాదంటున్నారు నిపుణులు. సంపాదన మార్గంలో పడ్డాక సరిపడే అవసరాలకు, కుటుంబ బాధ్యతలకు ఆ డబ్బును వినియోగించాలి. అదే సందర్భంలో మరోపక్క కొంత మొత్తమైనా పొదుపు కోసం కేటాయించాలి. ఇలా బ్యాచిలర్ లైఫ్‌లో ప్రారంభించిన పొదుపు ప్రయాణం. రేపటి భవిష్యత్తుకు చక్కటి భరోసాని ఇవ్వడంతోపాటు.. జీవితంలో పొదుపు మంత్రం సులభంగా అలవాటవుతుంది.

పెళ్లికి గ్రీన్ సిగ్నల్.. ఇలా

బ్యాచిలర్ లైఫ్‌లో ఆర్థిక సమతుల్యతను సాధించి, వివాహం చేసుకోవడానికి సరియైన వయసు అని భావిస్తే.. ఆ పెళ్లి బంధం ఎలాంటి కుదుపులు లేకుండా సాగిపోవడానికి అవకాశం ఉంది. పెళ్లికి ముందే అంతో ఇంతో పొదుపు మార్గాన్ని ఆచరణలో పెట్టడంవల్ల.. అలా దాచుకున్న సొమ్ముతో ఇల్లు, వాహనం, ప్రసూతి వైద్యం, పర్యాటక సందర్శన వంటి కనీస అవసరాలకు ఉపయోగించుకోవచ్చు. అలాగే పిల్లల భవిష్యత్తుకూ ఆ మొత్తాన్ని పెట్టుబడుల రూపంలో ఉపయోగించుకోవచ్చు. అందుకే బ్యాచిలర్ లైఫ్‌లో పొదుపు మంత్రాన్ని నమ్ముకుంటే భవిష్యత్తుకు నచ్చినట్టుగా తీర్చిదిద్దుకోవచ్చు. అందమైన వివాహ బంధాన్ని మరింత అందంగా మలచుకోవచ్చు.



- వి చైతన్య

బ్యాంకు ఖాతా నిర్వహణ-జాగ్రత్తలు

ఈ రోజుల్లో ప్రతి ఒక్కరికీ బ్యాంకు అకౌంట్ ఉండటం సర్వసాధారణం. వృత్తి, ఉపాధి, వ్యాపారాల రీత్యా మనం బ్యాంక్ తో ఆర్థిక లావాదేవీలు జరుపుతుంటాం. ఇలా బ్యాంక్ ఖాతా నిర్వహించే విషయంలో మనం ఎలా మెలకువగా వ్యవహరించాలి? కొన్ని అంశాలు చూద్దాం!!

- బ్యాంకు ఖాతా తెరిచేటప్పుడు మన మొబైల్ నంబర్ మాత్రమే ఇవ్వాలి. మొబైల్ లేకుంటే ఇవ్వకూడదు. ఎవరో ఒకరి మొబైల్ నంబర్ ఇచ్చినట్టయితే మన లావాదేవీలన్నీ వారికి తెలిసే అవకాశం ఉంటుంది.
- మన అడ్రస్ మారినప్పుడు తప్పని సరిగా బ్యాంకుకు తెలియజేయాలి. అలా తెలియజేయక పోతే బ్యాంకు ఏ విషయమైన తెలియజేయాలనుకున్నా తెలియజేయలేదు. ఉదాహరణకు మనం వేసిన చెక్కు తిరిగి వచ్చినా మనకు తెలియజేయలేరు. పర్యావసానానికి మనమే బాధ్యులం అవుతాం.
- మన ఖాతాలో ఇతరుల సొమ్ము జమ చేసుకోకపోవడం ఉత్తమం. పరోపకారం అనుకుని తీసుకుంటే కష్టాలు తప్పవు.
- ఎటిఎం. కార్డుతోపాటు పిన్ పెట్టుకోకూడదు. పిన్ ఎవ్వరికి తెలియకుండా ఉంచుకోవడం మంచిది. కార్డు నెంబరునుగానీ పిన్ నంబరును గానీ ఎవరికీ ఇవ్వవలసిన అవసరం ఉండదు. ఎవరైనా అడిగితే ఇవ్వమని కచ్చితంగా చెప్పాలి. పిన్ ఇవ్వడం అంటే తాళం ఇచ్చినట్లే.!
- ఎటియం సెంటర్‌లో కార్డు వివరాలు సేకరించే పరికరాలు ఉన్నాయా అని గమనించాలి. కొన్ని పరికరాలు అమర్చి.. కార్డు వివరాలు సేకరించి, డూప్లికేట్ కార్డులు రూపొందిస్తున్నారు.
- వీలైనంత వరకు ఖాతా ఉన్న బ్యాంకు ఎటిఎంలో డబ్బులు తీసుకోవడం ఉత్తమం. ఛార్జీలు పడవు. వేరే బ్యాంకు ఎటిఎంలు ఐదు సార్లు అంతకంటే ఎక్కువసార్లు వాడితే ఛార్జీలు పడతాయి. ఈ ఐదుసార్లలో అకౌంట్‌లో నిల్వ చూసుకోవడం కూడా కలుస్తుంది.
- నెట్ బ్యాంకిగ్‌ను నెట్ సెంటర్‌లలో వాడకూడదు. ఈ రోజు మన సొమ్ము బ్యాంకులో దాచుకున్న దానిని భద్రంగా కాపాడుకునే బాధ్యత మనదే కాబట్టి మన కార్డు మన పాస్‌వర్డ్ మన చెయ్యి జారకూడదు.
- బ్యాంకు సేవలో లోపాలు అంబుడ్స్‌మెన్‌కు ఫిర్యాదు చేయవచ్చు.
- ఇప్పుడు మన నోట్ల ఉపసంహరణతో మన రూపాయి కోసం ఎదురు చూడవలసి వస్తుంది!

మన రూపాయి కంటే మన శ్రమ మనం దాచుకున్న శ్రమ దీనినెవ్వరూ దోచుకోకుండా మనమే మెలవకువగా ఉండాల్సిన పరిస్థితి వచ్చిందిప్పుడు. అందరు తీసుకోవలసిన జాగ్రత్తలలో ఇవికొన్ని..



'రూపాయి'కి మీరూ రాయండి!



బ్యాంకు, పోస్టాఫీసు, షేర్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్, ఎల్ఐసీ, ఇతర బీమా పథకాలు, ఇన్‌కంటాక్స్ వంటి ఆర్థిక విషయాలపై మీరూ మీ అనుభవాలను 'రూపాయి' ఫీచర్‌కి పంపండి. సంబంధిత విషయాలపై సలహా, సూచనల్ని తెలియజేయండి. ఏవైనా సందేహాలు ఉంటే రాయండి.

మా చిరునామా

రూపాయి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట,
విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com
ఫోన్ నెం. 9490099006

చిన్నారి





ఎవరిని?

త్రయంబకంలో పుట్టాను..
తెలుగు రాష్ట్రానికి వచ్చాను..
అన్నపూర్ణగా మార్చాను..
ఒక్కోమారు ఉప్పొంగుతాను?

జవాబు : గోదావరి

జోక్:

తండ్రి : ఒరేయ్ గోపి పరీక్షలు ఎలా రాస్తున్నావ్?
గోపి : చాలా బాగా రాస్తున్నా నాన్నా!
తండ్రి : ఇవ్వాళ సైన్స్‌పేపర్ ఎలా ఉంది?
గోపి : ఇవాళ నేను రాసింది సైన్స్ ఎగ్జామా?!

చుక్కలు కలపండి!



పిల్లలూ! పక్కనున్న బొమ్మలోని చుక్కలు కలిపి రంగులు వేయండి !

ఒంటి నొప్పులకు వేడినీళ్లు ఉపశమనమా?




పిల్లలూ..! చలిగా ఉన్నప్పుడు చర్మం ఉపరితల పొరల్లో ఉండే కణాలు దగ్గరికి రావడం వల్ల కొంచెం ఇబ్బందికిలోనవుతాం. పైగా చలి వాతావరణంలో శరీరంలోకి వేడి వెళ్ళకుండా ఉండేందుకు రక్తనాళాలు కూడా ఉపరితల చర్మం పొరలకు రక్తాన్ని చేరవేయవు. దీనివల్ల పైపొరల్లో ఉన్న కణాలు పొడిగా ఉంటాయి. అక్కడ ఉన్న నాడీతంత్రులు **(Fasciculi)** కూడా మొద్దుబారిపోతాయి. ఇలాంటి స్థితిలో కాస్త వేడిగా ఉండే నీటితో స్నానంచేస్తే.. ఆ వేడికి చర్మపు పొరలు కొద్దిగా సడలడం వల్ల తాత్కాలికంగా ఉపశమనం పొందిన భావన పొందుతాం. నాడీతంత్రులకు అధిక ప్రేరణ రావడంవల్లా కొద్దిగా సుఖానుభూతి పొందుతాం. ఇక ఏ సమయంలోనైనా బాగా కష్టపడి శారీరక శ్రమ చేసినప్పుడు కణాలు అలసిపోతాయి. కణాలు అలసి పోవడమంటే వాటిలో పోషక పదార్థాల పరిమితి బాగా పడిపోవడమని అర్థం. అలాగే వ్యాయామం చేసినప్పుడు అధిక మోతాదులో రక్తంలోని గ్లూకోజు ఆక్సీకరణం చెందుతుంది. ఆ క్రమంలో ఆక్సిజన్ సరఫరా తదనుగుణంగా లేకుంటే నిర్ణీత ప్రక్రియ **(anerobic oxidation)** ద్వారా గ్లూకోజ్ పాక్షికంగా ఆక్సీకరణం చెంది శక్తినిస్తుంది. అప్పుడు రక్తంలోనూ కణాల్లోనూ పైరూవిక్ ఆమ్లపు మోతాదు పెరుగుతుంది. ఇది అవాంఛనీయమైన రసాయనిక ధాతువు. ఇది ఎముకల కీళ్ల దగ్గర పోగయితే ఒంటి నొప్పులుగా ఇబ్బందిపడతాం.



అలాంటి సమయంలో వేడినీటి స్నానంవల్ల కణజాలాలు వ్యాకోచించి, రక్తసరఫరా వేగవంతం అవుతుంది. ఆ క్రమంలో పైరూవిక్ ఆమ్లం త్వరితంగా కణాల నుంచి తొలగడంవల్ల ఒళ్లు నొప్పులు తగ్గినట్టు, సేదతీరి సుఖానుభూతిని పొందుతాం. ★



నేను వేసిన బొమ్మ





ఎం. సుగంధిని నిస్సీ,
4వ తరగతి,
కేంద్రీయ విద్యాలయం, కడప.

పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపవలసిన మా చిరునామా

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com

అదరహో అఖిల్



50 మీటర్ల రైఫిల్ విభాగంలో స్వర్ణం

షూటింగ్ ప్రపంచ కప్

న్యూఢిల్లీ : షూటింగ్ ప్రపంచకప్‌లో భారత షూటర్లు గురి తప్పటం లేదు. యువ షూటర్ అఖిల్ షెరాన్ పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్ విభాగంలో స్వర్ణం సాధించాడు. ప్రపంచకప్‌లో అరంగేట్రంలోనే పతకం సాధించిన నాలుగో భారత షూటర్‌గా చరిత్ర సృష్టించాడు. షహజర్ రిజ్వీ, మను భాకర్, మెహూలి గోష్, అంజుమ్ మౌద్గిల్ తమ విభాగాల్లో ఇంతకు ముందే పతకాలు సాధించారు. దీంతో ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్‌లో భారత్ తొలిసారి పతకాల పట్టికలో అగ్రస్థానంపై గురిపెట్టింది. పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్ ఫైనల్ పోరులో షెరాన్ 455.6 పాయింట్లతో ఆస్ట్రియా ఆటగాడు బెర్నార్డ్ పికిల్ (452)ను వెనక్కి నెట్టి అగ్రస్థానంలో నిలిచాడు. ఐఎస్ఎస్ఎఫ్‌లో 38 సార్లు పతకాలు గెలిచిన హంగేరియన్ రైఫిల్ లెజెండ్ పీటర్ సిడి, రియో కాంస్య పతక విజేత అలెక్సిక్ సహా ఎయిర్ రైఫిల్ విజేత రేనాల్డ్ (ఫ్రాన్స్), సహచర భారత షూటర్ సంజీవ్ రాజ్‌పుత్ వంటి వారిని షెరాన్ వెనక్కునెట్టి పసిడి కైవసం చేసుకున్నాడు.

నవశకానికి నాంది
భవిష్యత్ భారత షూటర్లదేన్న బింద్రా

న్యూఢిల్లీ : ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్‌లో అదరగొడుతున్న భారత షూటర్లపై ఒలింపిక్ స్వర్ణ పతక విజేత అభినవ్ బింద్రా ప్రశంసల జల్లు కురిపించారు. ప్రపంచకప్‌లో తొలిసారి భారత్ పతకాల పట్టికలో అగ్రస్థానంలో నిలిచేందుకు అవకాశాలు స ష్టించుకుంది. ఇప్పటి వరకుభారత్ నాలుగు స్వర్ణాలు, ఒక రజతం, నాలుగు కాంస్య పతకాలను సాధించింది. బింద్రా మాట్లాడుతూ.. 'మెక్సికో ప్రపంచకప్‌లో భారత ప్రదర్శన దేశ షూటింగ్‌లో నవశకానికి నాంది. భారత్‌లో షూటింగ్ భవిష్యత్తు సురక్షితమైన చేతుల్లో ఉన్నది. ఒలింపిక్ పోడియంపై యువ క్రీడాకారులకు సత్తా చాటగలరని నమ్మకమున్నది. ప్రపంచకప్ విజేతలకు అభినందనలు. ఆటగాళ్లలో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన అందరికీ ప్రత్యేక అభినందనలు. వారి క షి ఇవాల భారత్‌కు పతకాలు తెచ్చిపెట్టింది' అన్నారు.

మళ్లీ టెన్నిస్ వివాదం





ముంబాయి: భారత టెన్నిస్‌ను వివాదాలు ఇప్పుడప్పుడే విడిచేటట్టులేవు. ఏడాది కాలంగా పరిస్థితి కొంత మేరకు మెరుగైనట్టు కనిపించినా మళ్లీ పాత పరిస్థితే పునరావృత్తమయ్యేటట్టు కనిపిస్తోంది. వెటరన్ క్రీడాకారుడు లియాండర్ పేస్‌ను డేవిస్‌కప్‌కు ఎంపిక చేయాలన్న అఖిల భారత టెన్నిస్ సమాఖ్య (ఎఐటిఎ) నిర్ణయం తాజా వివాదానికి కారణమైంది. మరో క్రీడాకారులు బొపన్నతో లియాండర్‌కు సరైన సంబంధాలు లేని విషయం తెలిసిందే. వీరిద్దరి మధ్య నెలకొన్న స్పర్ధల కారణంగా గెలవాల్సిన మ్యాచ్‌లు ఓడిపోయిన సంఘటనలూ గతంలో ఉన్నాయి. అయితే, చైనాలోని తైన్‌జిన్‌లో జరిగే డేవిస్‌కప్ పోటీలకు వీరిద్దరిని ఎంపిక చేయడం ద్వారా వ్యక్తిగత విభేదాలను తాము పరిగణలోకి తీసుకునేది లేదని ఎఐటిఎ తేల్చిచెప్పింది. దీంతో సీనియర్ టెన్నిస్ క్రీడాకారుడు లియాండర్ పేస్ మళ్లీ భారత టీమ్‌లో మెరవనున్నాడు. అంతర్జాతీయ క్రీడల నుండి దాదాపుగా తప్పుకున్న ఈ వెటరన్ క్రీడాకారున్ని డేవిస్‌కప్‌కు ఎంపిక చేశారు. మరోసారి డేవిస్‌కప్ గెలిస్తే అత్యధిక సార్లు ఆ కప్‌ను గెలిచిన రికార్డు పేస్ సొంతమవుతుంది. ఇప్పటి వరకు ఇటాలియన్ క్రీడాకారుడు నికోలా పైట్రాంజలి పేరు మీద ఆ రికార్డు ఉంది. ఆయన 42 సార్లు డేవిస్ విజేతగా నిలిచారు. ఈ రికార్డు సాధనకు వీలుగా పేస్‌ను డేవిస్‌కప్‌కు ఎంపిక చేయాలని ఎఐటిఎ భావించినట్లు సమాచారం. రికార్డు సాధనకు వీలుగా బొపన్నతో కలిసి ఆడటానికి తనకెటువంటి అభ్యంతరాలు లేవని పేస్ చెప్పినట్లు తెలిసిందే. అయితే, బొప్పన్నమాత్రం దీనికి భిన్నంగా స్పందిస్తున్నారని సమాచారం. పేస్‌కు అవకాశం కల్పించడానికి తనకు అభ్యంతరం లేదని, అదే సమయంలో తనకు విశ్రాంతి ఇవ్వాలని ఆయన కోరినట్లు తెలిసింది. బొప్పన్న చేసిన సూచనను టెన్నిస్ సమాఖ్య పరిగణలోకి తీసుకోలేదు. ఇరువురిని కలిసి ఎంపిక చేయడం ద్వారా మ్యాచ్‌లో కలిసి ఆడాలా లేదా అన్నది బొప్పన్న నిర్ణయానికే వదిలివేసినట్లు భావిస్తున్నారు. నాన్ ప్లేయింగ్ కెప్టెన్ మహేశ్‌భూపతి మాత్రం వీరిరువురు కలిసి ఆడుతారిన చెబుతున్నారు.

డేవిస్ కప్‌కు వీరే...

సుదీర్ఘ చర్చల అనంతరం ఐదుగురు సభ్యుల సెలక్షన్ కమిటీ డేవిస్‌కప్‌కు యూకి భాంబ్రీ, రామ్‌కుమార్ రామ్‌నాథన్, సుమిత్‌నాగల్, బొప్పన్న, పేస్‌ల పేర్లను ప్రకటించింది. ఎడమ చేతి ఆటగాడు దివిజ్ షారన్‌ను రిజర్వు క్రీడాకారుడిగా ఎంపిక చేశారు. వాస్తవానికి గత ఏప్రిల్‌లో ఉజ్బెకిస్తాన్‌లో జరిగిన డేవిస్‌కప్ మ్యాచ్‌లకే లియాండర్‌పేస్‌ను తప్పించారు. కెనడాతో జరిగిన ప్రపంచ గ్రూప్ ఫైనల్స్‌కు పేస్‌ను ఎంపిక చేయలేదు. దీంతో పేస్ కెరీర్ దాదాపుగా ముగిసినట్టేనని భావించారు.

దళిత యువతకు వాలీబాల్ పోటీలు

- మంత్రి అయ్యన్నపాత్రుడు



విశాఖ జిల్లా జోగుంపేటలో వాలీబాల్ ఆడుతున్న మంత్రి అయ్యన్న

ప్రజాశక్తి-గొలుగొండ (విశాఖపట్నం)

దళిత తేజం కార్యక్రమంలో భాగంగా తన నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాల్లోనూ దళిత యువతకు వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. విశాఖ జిల్లా గొలుగొండ మండలం జోగుంపేటలో ఆదివారం ఆయన వాలీవాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు మండలాల్లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన జట్లకు నియోజకవర్గ కేంద్రంలో 19వ తేదీన పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. 20వ తేదీన నర్సీపట్నంలో దళిత మహాసభ నిర్వహించి బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. దళిత ఆడపిల్లలకు పెళ్లి కానుకగా రూ.40 వేలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులు కేటాయించి వాటిని దళితవాడల అభివృద్ధికి ఉపయోగిస్తున్నామని పేర్కొన్నారు. దళిత వాడల్లో 80 శాతం సిమెంట్ రోడ్లు పూర్తి చేశామన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఏప్రిల్ 14వ తేదీన అమరావతిలో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రణాళిక సిద్ధం చేశారని చెప్పారు. నియోజకవర్గంలోని నర్సీపట్నం, నాతవరం, మాకవరపాలెం మండలాల్లోనూ ఈ ఆట పోటీలు ప్రారంభమైనట్లు చెప్పారు.

తైక్వాండోలో కడప మొదటి స్థానం



మెడల్స్ సాధించిన క్రీడాకారులతో అతిథులు

ప్రజాశక్తి - కడపఅర్బన్

కడపలోని వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి 38వ సబ్ జూనియర్స్ తైక్వాండో పోటీలలో కడప మొదటి స్థానంలో నిలించింది. ఓవరాల్ ఛాంపియన్‌గా కడపకు 62 పాయింట్లు వచ్చాయి. 45 పాయింట్లతో గుంటూరు 2వ స్థానంలో, 34 పాయింట్లతో చిత్తూరు 3వ స్థానంలో నిలిచాయి. జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి నయాబ్ రసూల్ అధ్యక్షత నిర్వహించిన పోటీలకు ముఖ్యఅతిథులుగా జిల్లా క్రీడల ముఖ్యఅధికారి టి.మమత, జిల్లా ఒలపింక్ కమిటీ చైర్మన్ తోట కృష్ణ, శ్రీనివాస రెసిడెన్సీ అధినేత టింబర్ డిపో సుధీర్, జిల్లా మార్షల్ ఆర్ట్స్ చైర్మన్ శివకృష్ణమూర్తి హాజరయ్యారు. ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచిన కడపకు కప్పు అందజేశారు. ఈ సందర్భంగా మమత మాట్లాడుతూ అమ్మాయిలు తైక్వాండోలో రాణించడం అభినందనీయమని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో రాణించాలని పిలుపు నిచ్చారు. తోట కృష్ణ మాట్లాడుతూ జిల్లాలో క్రీడలకు చక్కటి ఆదరణ లభిస్తుందని తెలిపారు. టింబర్ డిపో సుధీర్ మాట్లాడుతూ ఆటలు ఆరోగ్యానికి ఔషధం లాంటివని తెలిపారు. వయసుతో సంబంధం లేకుండా నచ్చిన క్రీడల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో బ్లడ్2లివ్ వ్యవస్థాపకులు పట్టుపోగుల పవన్‌కుమార్, వేణుగోపాల్, జగన్‌మోహన్, అర్జున్‌రావ్, గౌస్‌బాష, మోహన్‌రామ్, భాస్కర్‌రావ్, విజయకుమారి, సాయిబాబా, మధుబాబు, శ్రీనివాసులు, వీరలంకయ్య, భాస్కర్‌రెడ్డి, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

నువ్వానేనా

- మూడో రౌండ్‌లో విలియమ్స్ సిస్టర్స్ పోరు
- ఇండియన్ వెల్స్ మాస్టర్స్ టెన్నిస్



ఇండియన్ వెల్స్ (అమెరికా) : అంతర్జాతీయ టెన్నిస్‌లో అరుదుగా కనిపించే పోరుకు ఇండియన్‌వెల్స్ టోర్నీ వేదిక కానున్నది. మూడో రౌండ్లోనే విలియమ్స్ సిస్టర్స్ తలపడ నున్నారు. భారత కాలమానం ప్రకారం శనివారం అర్ధ రాత్రి జరిగిన పోరులో కికీ బెర్టన్స్‌పై వరుస సెట్లలో విజయం సాధించింది సెరెనా విలియమ్స్. 29వ సీడ్ కికీ బెర్టన్స్ (నెదర్లాండ్స్)ను 7(7)-6(5), 7-5తో అన్‌సీడెడ్ సెరెనా మట్టికరిపించింది. ఇక ఎనిమిదో సీడ్ వీనస్ విలియమ్స్ 6-3, 6-4తో సొరానా కిర్‌స్టియా (రొమేనియా)ను ఓడించింది. కాగా మూడో రౌండ్లో అక్కా చెల్లెల పోరుపై అభిమానుల్లో ఆసక్తి నెలకొన్నది. ఇప్పటివరకూ విలియమ్స్ సిస్టర్స్ 28 సార్లు తలపడ్డారు. చివరగా గతేడాది ఆస్ట్రేలియా ఓపెన్ ఫైనల్లో వీరిద్దరూ తలపడగా 6-4, 6-4తో సెరెనా పైచేయి సాధించింది. 2001లో తొలిసారి విలియమ్స్ సిస్టర్స్ మధ్య సెమీస్ పోరు జరగాల్సి ఉండగా.. వీనస్ పోరు విరమించుకుని చెల్లికి వాకోవర్ ఇచ్చింది.



ఉండవల్లి కొండలపై మంటలు

ప్రజాశక్తి - తాడేపల్లి (గుంటూరు)

సీడ్ క్యాపిటల్‌లో భాగమైన గుంటూరు జిల్లా ఉండవల్లి కొండలపై ఆదివారం రాత్రి మంటలు చెలరేగాయి. ఎవరో ఆకతాయిలు కొండకు నిప్పు పెట్టి ఉంటారని భావిస్తున్నారు. మంటలు చెలరేగుతున్న కొండకు ఇవతలి వైపున చరిత్ర ప్రసిద్ధిగాంచిన ఉండవల్లి గుహలున్నాయి. ఆ పక్కనే సిఎం నివాసానికి వెళ్లే దారిలో పోలీసు అవుట్‌పోస్టు ఉంది. హైఅలర్ట్ జోన్‌గా ఉన్న ఉండవల్లి కొండలపై మంటలు చెలరేగడం చర్చనీయాంశమైంది. అసలే ఎండలు మండిపోతున్నాయి. కొండపై మంటలు శరవేగంగా విస్తరిస్తున్నాయి. కొండకు ఇటువైపు ఉండవల్లి, అటువైపు పెనుమాక గ్రామాలున్నాయి. రెండుపక్కలా కొండ ప్రాంతాల్లో వందలాది మంది పేదలు ఇళ్లు వేసుకొని నివాసముంటున్నారు. మంటలు ఎక్కడ తమ ఇళ్లను చుట్టు ముడతాయోనని ఆ ప్రాంతంలోని పేదలు ఆందోళన చెందుతున్నారు. కొండపై కింది భాగంలో ఇళ్లున్న దృష్ట్యా మంటల అదుపూ కష్టమే. అగ్నిప్రమాద శకటం వెళ్ళడానికి దారిలేదు. వేసవి ప్రారంభంలో ఈ ఘటన నేపథ్యంలో ఆకతాయిలను గుర్తించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నాసిరకంగా చేపల యార్డుల నిర్మాణం

- అక్రమాలకు పాల్పడుతున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

తూర్పుగోదావరి జిల్లా సముద్ర తీర ప్రాంతాల్లో చేపట్టిన చేపలయార్డుల నిర్మాణ పథకంలో తెలుగు తమ్ముళ్లు అక్రమాలకు పాల్పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. వేటాడుకున్న చేపలను ఎండబెట్టుకునేందుకు, మత్స్యకారులకు ఆసరా కల్పించి, సముద్రతీరంలో పటిష్టంగా ఉండాల్సిన నిర్మాణాలను నాసిరకంగా చేపడుతున్నారు. చివరికి సముద్రపు ఇసుకను, నాసిరకం మెటీరియల్‌ను వినియోగించి నిధులు కాజేస్తున్నారు.

తూర్పుగోదావరి జిల్లా కాకినాడ, అమలాపురం, పెద్దాపురం డివిజన్లలో రూ.43 లక్షలతో 86 చేపల యార్డులను నిర్మిస్తున్నారు. ఒక్కో ప్లాట్‌ఫారం నిర్మాణానికి రూ.1.49 లక్షలు వెచ్చిస్తున్నారు. అమలాపురం డివిజన్‌లో అల్లవరంలో 6, మలికిపురంలో 3, కాట్రేనికోనలో 5, సఖినేటిపల్లిలో 26, ఐ.పోలవరం, రాజోలు, అల్లవరం, మామిడికుదురులో ఒక్కొక్కటి చొప్పున ఏడు మండలాల్లో 43 చేపల కళ్లాలను నిర్మిస్తున్నారు. పెద్దాపురం డివిజన్ తొండంగి మండలంలో 27 ప్లాట్‌ఫారాలు నిర్మిస్తున్నారు. కాకినాడ డివిజన్ యు.కొత్తపల్లి మండలంలో 15, కాకినాడ రూరల్‌లో ఒకటి నిర్మిస్తున్నారు.

సముద్రతీరంలో నిర్మిస్తున్న ఈ ప్లాట్‌ఫారాలకు నాణ్యమైన ఇసుకను వాడకుండా ఉప్పు నీటితో ఉండే సముద్ర ఇసుకనే వాడేస్తున్నారు. దీంతో, ఈ నిర్మాణాలు ఎంతోకాలం ఉండే అవకాశాలు లేవు. సముద్ర తీరంలో నిర్మించే కట్టడాలకు సాధారణ ప్రాంతంలో నిర్మించే వాటికంటే గట్టి ఇసుక, మట్టితోపాటు సిమెంట్ పాళ్లు ఎక్కువగా ఉండాలి. తీరంలో నిర్మించే యార్డులు తూతూమంత్రంగా నిర్మించి జేబులు నింపుకోవాలని చూస్తున్నారు. ఒక్కో యార్డుకు రూ.1.49 లక్షలు అవుతుందని అంచనా వేసినా ఇక్కడ నిర్మాణాలు పరిశీలిస్తే రూ.70 వేలు కూడా ఖర్చయ్యే అవకాశాలు లేవని అంటున్నారు. వాస్తవానికి ఈ నిర్మాణాలను మత్స్యశాఖ అధికారుల పర్యవేక్షణలో, వారి సమక్షంలో జరగాలి. ఆశాఖ అధికారులు తమ్ముళ్లకు అప్పగించేసి అటు వైపు కనీసం చూడడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి.



తూర్పుగోదావరి జిల్లా యు.కొత్తపల్లి ఫిష్‌యార్డులో కళ్లాలను నాసిరకంగా నిర్మిస్తున్న వైనం

అక్రమాలపై విచారణ జరిపిస్తాం
రాజకుమారి, డ్వామా పీడీ, తూర్పుగోదావరి

చేపల యార్డుల నిర్మాణంలో అక్రమాలపై విచారణ జరిపిస్తాం. ఎక్కడైనా అవినీతి జరిగితే కఠిన చర్యలు తీసుకుంటాం. మా శాఖ పరిధిలోని క్వాలిటీ కంట్రోల్ అధికారులతో పనులను తనిఖీలు చేయించి తగిన చర్యలు తీసుకుంటాం. లోపాలు జరిగినట్లు మా దృష్టికి రాలేదు. ఈ పనులు మెటీరియల్ కాంపొనెంట్‌తో చేయాలి. మత్స్యశాఖ అధికారుల పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి. గ్రామ పంచాయతీలే ఈ పనులను పూర్తి చేయాల్సి ఉంది.



పురుషుల విభాగంలో తొలి మూడు స్థానాలు సాధించిన విజేతలు

ఆకట్టుకున్న జాతీయ ట్రయథ్లాన్ పోటీలు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

జిల్లా, రాష్ట్ర ట్రయథ్లాన్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ సీనియర్ పురుషుల, మహిళల ట్రయథ్లాన్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఆసక్తికరంగా సాగాయి. ఆదివారం జరిగిన ఈ పోటీలకు రాష్ట్ర యూత్ అండ్ స్పోర్ట్స్ చీఫ్ సెక్రటరీ ఎల్‌వి.సుబ్రహ్మణ్యం, సిటి పోలీసు కమిషనర్ యోగానంద్ ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. పది కిలోమీటర్ల పరుగు పందెంలో, 40 కిలోమీటర్ల సైక్లింగ్, 150 కిలోమటర్ల స్విమ్మింగ్ పోటీలకు సంబంధించిన పురుషుల విభాగంలో బిస్వర్జిత్ సింగ్ (ఎస్ఎస్‌సిబి), కెఎస్‌హెచ్. మణిచంద్ర (ఎస్ఎస్‌సిబి), ఎల్.మహేష్ (మణిపూర్) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ఎస్.సయోచ సింగ్ (మణిపూర్), మనీష్ దల్ (ఢిల్లీ), ఎం.ఆదురత్య బోరా (కర్ణాటక) 4, 5, 6 స్థానాల్లో నిలిచారు. మహిళల విభాగంలో సమీర ఆబ్రహం (గోవా), ప్రజ్ఞ మోహన్ (గుజరాత్), మోనికా నాగ్‌పూరే (గుజరాత్), ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సొంతం చేసుకున్నారు. సరోజిని దేవి (మణిపూర్) అనూజ ఆగ్లే (మహారాష్ట్ర), నేహ (మధ్య ప్రదేశ్) 4, 5, 6 స్థానాల్లో నిలిచారు. సాయంత్రం జరిగిన టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఈస్ట్రన్ నేవల్ కమాండ్, కమాండెంట్ స్పోర్ట్సు కమాండెంట్ నగర ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, బహుమతులు అందజేశారు. అంతకుముందు ఎల్‌వి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, క్రీడాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందన్నారు. నవ్యాంధ్రప్రదేశ్ క్రీడా కేంద్రంగా రూపొందుతున్న విశాఖలో వరుసగా జాతీయ క్రీడా పోటీలు నిర్వహించడం ఆహ్వానించగదగ్గ విషయమని పేర్కొన్నారు. ఒలింపిక్ గేమ్స్ గుర్తింపు పొందిన ట్రయిథ్లాన్ క్రీడకు సంబంధించి విశాఖలో జాతీయ పోటీలు జరగడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ద ఒలింపిక్ అసోసియేషన్ విశాఖ అధ్యక్షుడు టిఎస్ఆర్ ప్రసాద్, రాష్ట్ర ట్రయథ్లాన్ అసోసియేషన్ ప్రతినిధులు వి.బాలాజీరావు, డి.ప్రసన్నకుమార్, దానయ్య, కంచరాన సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాగ్ నివేదికకు

ప్రభుత్వ లెక్కలకు పొంతనేదీ

సమ్మిట్‌లు, ఉద్యోగాలూ అంతా మాయ
వైసిపి నేత బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాగ్ నివేదికకు, ప్రభుత్వ లెక్కలకు పొంతన లేకుండా పోతోందని పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీ (పిఎసి) ఛైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా బావుందంటూ టిడిపి ప్రభుత్వం తప్పుడు లెక్కల్ని ప్రచారం చేయడంతోనే రాష్ట్రానికి ఎక్కువ నష్టం జరిగిందన్నారు. విజయవాడలోని వైసిపి రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. అంకెల గారడీతో ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. నాలుగేళ్లలో ఉన్న లోటు ఒక్కసారిగా రూ.5 వేల కోట్లు మిగులుకు ఎలా వచ్చిందని ప్రశ్నించారు. కాగ్ నివేదికలో రెవిన్యూ లోటు చూపిస్తుంటే, రాష్ట్రం ఆర్థికంగా బావుందని సిగ్గులేని ప్రచారం చేస్తున్నారన్నారు. ఎన్నికల సంవత్సరం కావడంతో రాష్ట్ర బడ్జెట్‌ను తప్పుల తడకగా మార్చేశారన్నారు. ముడుపులు తీసుకుంటూ అబద్ధాలు, ఆడంబరాలతో సిఎం చంద్రబాబు పాలన సాగిస్తుండటంతో ప్రతి ఇంటికీ లక్ష రూపాయిల అప్పు తేలిందన్నారు. 2017-18లో కాగ్ నివేదికకు, రాష్ట్ర లెక్కలకు రూ.23 వేల కోట్లు తేడా ఉందన్నారు. ఈ ఏడాది క్యాపిటల్ వ్యయం రూ.28,500 కోట్లుగా చెబుతున్నారనీ, గతేడాదికంటే 30 శాతం అదనమంటున్నారనీ ఆయన పేర్కొన్నారు. వైసిపిపై విమర్శలు చేసే సమయాన్ని రాష్ట్ర అభివృద్ధికి కేటాయిస్తే బావుంటుందన్నారు. బడ్జెట్‌లో చెప్పినట్లు విశాఖలో జరిగిన పెట్టుబడుల సమ్మిట్‌ల ద్వారా రూ.16 లక్షల కోట్లు పెట్టుబడులు, 30 లక్షల ఉద్యోగాలు వచ్చాయని చెప్పడం అంతా మాయేనన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ పాలసీ అండ్ ప్రమోషన్ నివేదిక ప్రకారం 2015లో రూ.4,500 కోట్లు, 2016లో రూ.11,400 కోట్లు, 2017లో రూ.3000 కోట్లు మాత్రమే పెట్టుబడులొచ్చాయన్నారు.

నిధుల్ని ఖర్చు చేయని మైనార్టీ శాఖ

నిధుల వ్యయంపై తప్పుపట్టిన పార్లమెంటరీ ప్యానెల్



న్యూఢిల్లీ: బడ్జెట్ కేటాయింపుల్లోని నిధులను తక్కువగా ఖర్చుచేయడంతో కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖపై పార్లమెంటరీ ప్యానెల్ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో మైనార్టీ శాఖకు కేటాయించిన 4,195.48 కోట్ల రూపాయల్లో ఫిబ్రవరి 20నాటికి కేవలం 66.58శాతమే వ్యయం చేసింది. ఈ నిధుల వ్యయంపై బీజేపీ ఎంపీ రమేశ్ బాయిస్ చైర్మెన్‌గా వ్యవహరిస్తున్న స్టాండింగ్ కమిటీ తన 53వ రిపోర్టును పార్లమెంటులో సమర్పించింది. ప్రతి ఏడాది బడ్జెట్‌లో కేటాయించిన నిధుల కంటే మైనార్టీ శాఖ తక్కువగా వ్యయం చేస్తోందని ఈ నివేదిక పేర్కొంది. ఇలా తక్కువగా ఖర్చుపెట్టడంపై గతేడాది చెప్పిన కారణాలే నేడు వివరించిందని తెలిపింది. ఇది నిత్య సమస్యగా మారుతున్నదని పేర్కొన్నది. ఆర్థిక సంవత్సరం చివరి నెలలో నిధుల వినియోగం 30నుంచి 40శాతానికి పడిపోవడాన్ని అరికట్టడంలో మైనార్టీ శాఖ విఫలమవుతోందని తెలిపింది. కేటాయించిన నిధులు తక్కువగా ఖర్చుచేయడం.. భవిష్యత్తు బడ్జెట్ కేటాయింపులను ప్రభావితం చేయదా? అని మైనార్టీ శాఖను స్టాండింగ్ కమిటీ అడగ్గా..ఆర్థిక శాఖనుంచి మినహాయింపు తీసుకుంటామని తెలిపింది. ఒకవేళ ఆర్థిక శాఖ ఈ మినహాయింపునివ్వకపోతే.. సంక్షేమ పథకాలకు ఇదివరకు చెల్లించాల్సిన నిధులు చెల్లించినట్టుగానే నమోదయ్యే ప్రమాదం ఉందని కమిటీ హెచ్చరించింది. ఆర్థిక నిబంధనలు పాటించాలని ఇన్నేండ్లు మైనార్టీ శాఖకు సూచిస్తున్నా నిధుల వినియోగంలో ఎలాంటి మార్పు చోటుచేసుకోలేదని కమిటీ తెలిపింది. కేటాయించిన నిధుల వినియోగంపై ఆర్థిక శాఖ సూచించిన మార్గదర్శకాలు పాటించడాన్ని మైనార్టీ శాఖ విచక్షణకే వదిలేస్తామని కమిటీ స్పష్టం చేసింది. అయితే కొన్నేండ్లుగా మైనార్టీ శాఖ ఖర్చుపెట్టిన వివరాలను కమిటీ వెల్లడించలేదు.

పిఇటి పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ నేడు విజయవాడలో ర్యాలీ, రిలే దీక్ష

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)

ప్రభుత్వం ప్రకటించే 2018 డీఎస్సీ నోటిఫికేషన్‌లో వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులను ప్రకటించి వాటిని భర్తీ చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యాయామ విద్య పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఇ.మోహన్ గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాల, కళాశాల స్థాయిల్లో సరైన క్రీడా ప్రాంగణాలు లేక పిల్లలు మానసికంగా, శారీరకంగా అభివృద్ధి చెందక మానసిక ఒత్తిడికి గురవుతున్నారని చెప్పారు. వ్యాయామ విద్యను ఓ పాఠ్యాంశంగా ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. క్రీడా మైదానాల్లేని విద్యా సంస్థలపై, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. వ్యాయామ అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న విజయవాడలో రెండు వేల మంది వ్యాయామ నిరుద్యోగ ఉపాధ్యాయులతో భారీ ర్యాలీ , అనంతరం ధర్నా చౌక్ వద్ద రిలే దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వ్యాయామ విద్య పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి ఇ.దేవేంద్ర గౌడ్, కార్యవర్గ సభ్యులు రమేష్, వాసు, గంగాధర్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68